అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 21-2-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 51 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు | వెల : 6.50

ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరు శాతం వడ్డీ చెల్లించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరోనా వ్యాప్తి కారణంగా ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్లు సగమే చెల్లించి ఆ మిగిలిన మొత్తాన్ని తర్వాత చెల్లించిన ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వారికి 50 శాతం తిరిగి ఇవ్వటంలో జరిగిన జాప్యానికి ఆరు శాతం వడ్డీ చెల్లించాలంటూ సూచించింది. జీతాలు, పెన్షన్లను ...6లో



బువ్వ కోసమే భూమి

వ్యాపారం కోసం కాదు..

- పోడు సాగుదారులందరికీ హక్కులు కల్పించాలి
- కేంద్ర సర్కార్ ఆరాటం కార్పొరేట్ల కోసమే..
- హక్కుల్ని హరిస్తే ఉద్యమం తప్పదు : మహాధర్నాలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పోడు సాగుదారులంతా తమ భూమిని ఆకలి తీర్చుకోవటం కోసమే ఉపయోగించుకుంటున్నారనీ, రియల్ఎస్టేట్ వ్యాపారం కోసం అటవీ భూములను ఆక్రమించుకోవటం లేదని నేతలంతా ప్రభుత్వాలకు గుర్తుచేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆదివాసీ, అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు, పలు ప్రజాసంఘాల నాయకులు ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. పోడు సాగుదారులందరికీ ఎటువంటి ఆంక్షలు లేకుండా హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. టైగర్ జోన్ పేరిట అడవి నుంచి ఆదివాసీలను వెళ్లగొట్టే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ తీసుకొచ్చిన అటవీ హక్కుల నియమాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమన్వయ కమిటీ కన్వీనర్లు వేములపల్లి వెంకట్రామయ్య, అంజయ్యనాయక్, శ్రీరాంనాయక్, కెచ్చెల రంగయ్య, అధ్యక్షతన జరిగిన మహాధర్నాలో ముఖ్యవక్తగా హాజరైన ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలివ్వాలంటూ సుదీర్ఘకాలంగా ఆదివాసీలు ఉద్యమించాల్సి రావటం బాధాకరమన్నారు. ఆదివాసీలకు పోరాటాలు కొత్తకావని చెప్పారు. ఆనాడు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా తొలిసారి పోరాడింది ఆదివాసీలు, దళితులేనని వారు తెలిపారు. పోడు భూముల పోరాటంలో న్యాయముందని చెప్పారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఉప ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చినట్టు ఎలాంటి ఆంక్షలు లేకుండా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కార మార్గమని చెప్పారు. పట్టాలు సాధించేంతవరకు పోరాటం చేయాలని గుర్తుచేశారు.

తెలంగాణ వస్తే పోడు సమస్యకు పరిష్కారం దొరుకుతుందనుకున్నాం : కోదండరాం

టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ వస్తే పోడు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావించామని అన్నారు. అటవీ హక్కుల చట్టం పరిధిలో ఈ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులను బలవంతంగా భూముల్లోంచి ఖాళీ చేయించడమేంటని ప్రశ్నించారు. అటవీ హక్కుల చట్టం ఇతర భూపంపిణీ చట్టాల లాంటిది కాదని చెప్పారు. 14రకాల సాక్ష్యాల్లో ఏ రెండు సాక్ష్యాలున్నా వారికి పట్టా ఇవ్వాల్సిందేనని చెప్పారు. అందుకోసం శాటిలైట్ విధానం తగదన్నారు. ఎమ్మెల్యేలు భూములు కబ్జాచేసి వ్యాపారం చేస్తున్నట్టుగా..గిరిజనులు పోడు భూములతో వ్యాపారం చేయబోరని గుర్తుచేశారు. వారు బువ్వకోసమే పోడు వ్యవసాయం చేస్తున్నారని గుర్తుచేశారు. ఆహారభద్రతను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందనీ, ఈ నేపథ్యంలోనే వారికి హక్కు పత్రాలిచ్చి ఆకలి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

శాటిలైట్ల ద్వారా తీసే చిత్రాలతో సమస్యకు పరిష్కారమా..! పశ్యపద్మ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ...2లో

పోడు రైతులకు న్యాయం చేయాలి : జూలకంటి



పోడు రైతులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) నేత, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నాయని విమర్శించారు. అటవీ హక్కుల చట్టాన్ని అనేక పోరాటాల ద్వారా, యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో సాధించుకున్నామని గుర్తుచేశారు. ఈ చట్టాన్ని బలహీనపర్చేందుకు మోడీ సర్కార్ కుట్ర చేస్తున్నదని విమర్శించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం తాపత్రయపడుతున్నదని చెప్పారు. అటవీహక్కుల చట్టం ప్రకారం సాగులో ఉన్న పోడు రైతులందరికీ హక్కు పత్రాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పాలకులు ఈ పనిచేసుంటే..ప్రభుత్వ పరంగా రావాల్సిన సౌకర్యాలు, రాయితీలు రైతులు పొందేవారని చెప్పారు. మోడీ సర్కారు ఉన్న చట్టాలకు తూట్లుపొడిచి కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని వివరించారు. మరో పక్క సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో గిరిజనులకు ఒక్క హక్కుపత్రం కూడా ఇవ్వలేదని అన్నారు. విద్యా, వైద్యం లేకపోయినా పోడు భూమితో బతుకుతుంటే..దాంట్లోకి కూడా పోవద్దంటే ఎలా? అని ప్రశ్నించారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా వారికి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నది గిరిజనులు కాదని తెలిపారు. శాసన సభలో సీఎం చెప్పిన విధంగా అందరికీ హక్కుపత్రాలివ్వాలని కోరారు.

ఎన్‌పీఎస్‌కు నిధులివ్వం

రాష్ట్రాలు ఆశలు పెట్టుకోవద్దు

- ప్రస్తుత చట్టాల ప్రకారం ఇవ్వడం కుదరదు : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



జైపూర్ : జాతీయ పింఛను విధానం (ఎన్‌పీఎస్) నిధుల విషయంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఎన్‌పీఎస్ కింద జమ అయిన చందాల సొమ్మును తిరిగి రాష్ట్రాలకు ఇచ్చేది లేదని మరోసారి స్పష్టం చేసింది. ఎన్‌పీఎస్ నిధులను తిరిగిస్తారని రాష్ట్రాలు అంచనా పెట్టుకోవద్దని, ప్రస్తుతమున్న చట్టాల ప్రకారం అది కుదరదని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఎన్‌పీఎస్ నిధులను ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసిన రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వ్యాఖ్యల నేపథ్యంలో నిర్మలా ఈ మేరకు స్పష్టతనిచ్చారు. రాజస్థాన్ వేదికగా పలు రంగాల వాటాదారులతో జరిగిన ...5లో

అదానీ రుణాలు అక్రమాల పుట్ట

గ్రీన్ కంపెనీల స్టాక్స్‌ను ష్యూరిటీగా చూపి భారీగా రుణాలు

- ఆస్ట్రేలియాలో బొగ్గు తవ్వకానికి వినియోగం..
- అదానీ వ్యవహారంపై దృష్టిసారించిన 'ఈఎస్‌జీ' మార్కెట్



వివరాలు 5లో..




మాణిక్‌రెడ్డి గెలుపు చారిత్రక అవసరం

అప్పుడే విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం సాధ్యం

- సమస్యలపై లోతైన అవగాహన ఉంటేనే ప్రశ్నిస్తారు : నామినేషన్ కార్యక్రమంలో నేతలు

వివరాలు 2లో..

కేరళలో తప్ప మరెక్కడా ...



అభ్యర్థి విద్యార్హతల ఆధారంగా ఓటు వేయరు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : దేశంలో ఒక్క కేరళలోనే అభ్యర్థి విద్యార్హతల ఆధారంగా ఓటు వేస్తారని, మరెక్కడ అలా ఉండదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 2017లో ఉత్తరప్రదేశ్ ...5లో

జాన్ బ్రిట్టాస్‌కు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు



- సీపీఐ(ఎం) మాజీ ఎంపీ టికె రంగరాజన్ కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

వివరాలు 5లో..

మత రాజకీయాలతో వినాశనమే

దండుపాళ్యం బ్యాచ్... రోజులు లెక్కపెట్టుకోవాలే

- కొత్త సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వమే : రేవంత్ రెడ్డి



నవతెలంగాణ - కాజీపేట/వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మతసామరస్యానికి ప్రతీకగా ఉన్న కాజీపేట దర్గా సాక్షిగా దేశాన్ని విభజించాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. టీపీసీసీ అధ్యక్షులు, మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్ రెడ్డి చేపట్టిన 'హాత్ సే హాత్' జూడో యాత్ర వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో సోమవారం అట్టహాసంగా కొనసాగింది. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, ప్రజలు రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం కాజీపేటలోని హజ్రత్ సయ్యద్ షా బియాబానీ దర్గాను ఆయన సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సుబేదారి ఆర్ట్స్ కళాశాల (లా కాలేజ్) నుంచి పాదయాత్ర ప్రారంభించారు. అక్కడ నుంచి అమరవీరుల స్థూపం (అదాలత్ జంక్షన్) మీదుగా కాళోజీ విగ్రహం, ఏకశిలా పార్క్, ప్రెస్‌క్లబ్, హన్మకొండ కొత్త బస్టాండ్, శ్రీదేవి మాల్, అంబేద్కర్ సర్కిల్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, హన్మకొండ చౌరస్తా మీదుగా ఏనుగుల గడ్డ వరకు పాదయాత్ర సాగింది. ఏనుగులగడ్డ సెంటర్‌లో సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కుల మతాల మధ్య చిచ్చులు రాజేస్తూ పాలన సాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మైనార్టీలకు రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని, దండుపాళెం బ్యాచ్ రోజులు లెక్కపెట్టుకోవాలని ...2లో

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

ఇది రాజకీయ వేదిక కాదు

ఇక్కడ అనవసరమైన వ్యాఖ్యలు చేయొద్దు

- ఏ వర్గాన్నీ సంతోషపెట్టడానికి మేం ఇక్కడ లేం
- యూనిఫాం వివాహ వయస్సు విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం
- పిటిషన్ తిరస్కరించిన న్యాయస్థానం



న్యూఢిల్లీ: 'రాజకీయాల్లో ఏ వర్గాన్ని సంతోషపెట్టడానికి మేము ఇక్కడ లేం' అని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పురుషులు, మహిళలకు ఒకే విధమైన వివాహ వయస్సు (యూనిఫాం మ్యారేజ్ ఏజ్) ఉండాలని కోరుతూ బిజెపి నేత, న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం మహిళలు, పురుషులకు వరుసగా 18 సంవత్సరాలు, 21 సంవత్సరాలు వివాహ కనీస వయస్సుగా నిర్దేశిస్తుంది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ స్త్రీ,పురుషులిద్దరికీ వివాహ వయస్సు 21 ఏండ్లుగా ఉండాలని కోరినప్పటికీ, ఈ పిటిషన్‌లోని అభ్యర్థనను కొట్టివేయాలని పేర్కొంది. "కేవలం 18 ఏండ్ల వయస్సును నిర్దేశించే నిబంధనను కొట్టివేయడం వల్ల మహిళలకు కనీస వివాహ వయస్సు ఉండదు. 32 ఏండ్ల కింద ఈ న్యాయస్థానం పార్లమెంటుకు శాసనం చేయడానికి లేదా చట్టాన్ని రూపొందించడానికి మాండమస్‌లను జారీ చేయలేదనేది న్యాయమైన చట్టం' అని కోర్టు నొక్కి చెప్పింది. అయితే ఈ విషయాన్ని హైకోర్టు నిర్ణయిస్తుందని ఉపాధ్యాయ్ పేర్కొన్నాడు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "మాపై మీ అవాంఛనీయ వ్యాఖ్య మాకు అక్కర్లేదు. మిమ్మల్ని లేదా రాజకీయాల్లోని ఏ వర్గాన్ని సంతోషపెట్టడానికి మేము ఇక్కడ లేం. మీరు ఇక్కడ అనవసరమైన వ్యాఖ్య చేయవద్దు. ఇది రాజకీయ వేదిక కాదు. మేము మీకు వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదు' అని సీజేఐ డివై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

ఫిబ్రవరి 2021లో ఆ పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. ఆ తరువాత జనవరి 2023లో ఢిల్లీ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను తనకు బదిలీ చేయాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే ఈ సమస్య పార్లమెంటు పరిధిలోకి వస్తుందనీ, ఈ అంశాన్ని పార్లమెంటు అంతిమ విజ్ఞతకే వదిలేయాలని ధర్మాసనం పేర్కొంది. 'మేం రాజ్యాంగానికి ప్రత్యేక సంరక్షకులం కాదు. పార్లమెంటు కూడా అలా చేయగలదు. పార్లమెంటు కూడా చట్టాన్ని రూపొందించగలదు. నిర్ణయించగలదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందువల్ల ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు కోర్టు నిరాకరించింది. 'కాబట్టి ఈ పిటిషన్‌లో జోక్యం చేసుకోవడానికి మేం నిరాకరిస్తున్నాం. పిటిషనర్‌కు అందుబాటులో ఉన్న పరిష్కారాలను పొందవచ్చు' అని పేర్కొన్న ధర్మాసనం, పిటిషన్‌ను కొట్టివేసింది. డిసెంబర్ 2021లో మహిళలకు చట్టబద్ధమైన వివాహ వయస్సును 18 నుంచి 21 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది.

బిజినెస్

ధరల నియంత్రణపై దృష్టి

- మంత్రి సీతారామన్ వెల్లడి

జైపూర్ : దేశంలో పెరుగుతున్న ధరల కట్టడికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. జైపూర్‌లో జరిగిన ఓ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కొన్ని వస్తువులపై దిగుమతి సుంకాన్ని తగ్గించనున్నట్టు తెలిపారు. పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించనున్నామని తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడానికి పప్పుల సాగును పెంచాలని నిర్ణయించామన్నారు. తాత్కాలికంగా పప్పు ధాన్యాల కొరతను అధిగమించేందుకు కంది, పెసర వంటి పప్పు ధాన్యాల దిగుమతులపై సుంకాన్ని ఒక అంకెకు లేదా పూర్తిగా తొలగించే యోచన చేస్తున్నామన్నారు.

ఆఫీసు లీజింగ్‌లో 56 శాతం క్షీణత

న్యూఢిల్లీ : దేశంలో ఆర్థిక కార్యకలాపాలు కుంటుపడుతున్నాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో కార్యాలయాల అద్దె ఒప్పందాలు భారీగా పడి పోవడమే ఇందుకు నిదర్శనం. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయి, బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్, పూణె, కోల్‌కత్తా లాంటి ఏడు నగరాల్లో ప్రస్తుత ఏడాది జనవరిలో లీజింగ్ 56 శాతం పతనమై 32 లక్షల చదరపు అడుగులకు పరిమితమయ్యిందని కన్సల్టెంట్ సంస్థ జేఎల్‌ఎల్ ఇండియా వెల్లడించింది. ఇంతక్రితం 2022 డిసెంబర్‌లో ఇది 74 లక్షల చదరపు అడుగులుగా నమోదయ్యిందని పేర్కొంది. కొత్త ఏడాది జనవరిలో సాధారణంగానే ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలపై కొంత ప్రతికూలత ఉంటుందని జేఎల్‌ఎల్ పేర్కొంది.

వైవిధ్యంతోనే మెరుగైన రాబడులు

- క్వాంటమ్ ఎంఫ్ వెల్లడి

హైదరాబాద్ : పెట్టుబడుల విషయంలో వైవిధ్యం పాటించడం ద్వారానే మెరుగైన రాబడులు అందు కోవడానికి వీలుంటుందని క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్ పేర్కొంది. ఇందుకోసం క్వాంటమ్ మల్టీ అసెట్ ఫండ్, రెడీమేడ్ మల్టీ అసెట్ ఫండ్ ఆఫ్ ఫండ్ సరైన ఎంపిక అని తెలిపింది. 'మార్కెట్లు అనిశ్చితితో నిండి పోవడంతో ఇన్వెస్టర్లు అస్థిరతను ఎదుర్కొం టున్నారు. పెట్టుబడిదారుల రాబడిని ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. ఇలాంటి క్లిష్ట కాలంలో మెరుగైన రాబడులు అందుకోవడానికి పెట్టుబడుల విషయంలో వైవిధ్యం పాటించాల్సి ఉంటుంది. ఈ దిశగా ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మించి రాబడులు పొందడానికి క్వాంటమ్ వంటి రెడీమేడ్ మల్టీ అసెట్ ఫండ్ ఆఫ్ ఫండ్ తోడ్పడగలదు' అని ఆ సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ చిరాగ్ మెహతా పేర్కొన్నారు.

ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఇంటిపై రాళ్లదాడి

న్యూఢిల్లీ : ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఇంటిపై రాళ్ల దాడి జరిగింది. ఢిల్లీలోని తన ఇంటిపై గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేశారనీ, ఈ దాడిలో ఇంటి కిటికీలు దెబ్బతిన్నాయని అసదుద్దీన్ ఓవైసీ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2014 నుంచి తన ఇంటిపై అగంతకులు రాళ్ల దాడి చేస్తున్నారనీ, ఆదివారం రాత్రి జరిగిన ఈ రాళ్ల దాడి నాలుగో ఘటన అని అసదుద్దీన్ ఓవైసీ ట్వీట్ చేశారు. ఆదివారం రాత్రి తాను జైపూర్ నుంచి ఢిల్లీ ఇంటికి 11.30 గంటలకు తిరిగిరాగా రాళ్ల దాడి జరిగినట్టు పనివాళ్లు చెప్పారనీ, ఈ దాడిలో పలు కిటికీలు పగిలిపోయాయని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తన ఇంట్లోని దృశ్యాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుంచి 6 గంటల వరకు ఈ దాడి జరిగిందని అన్నారు. ఎంపీ ఫిర్యాదుతో ఢిల్లీలోని అశోకా రోడ్డులో ఉన్న అసద్ ఇంటిని ఢిల్లీ డీసీపీ సందర్శించి రాళ్ల దాడి ఆధారాలు సేకరించారు. తన ఇంటి పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని సేకరించి రాళ్ల దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంపీ అసదుద్దీన్ ఓవైసి కోరారు. రాళ్ల దాడిలో కొన్ని కిటికిలు దెబ్బతిన్నాయనీ, అయితే ఎవరికీ గాయాలు కాలేదనీ, ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఒవైసి నుంచి ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. 'మేం ఫిర్యాదును స్వీకరించాం. ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నాం. విధ్వంసకారులను త్వరలో గుర్తిస్తాం. సాయంత్రం వచ్చి రాళ్లు రువ్వారు. కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు" అని ఓ అధికారి తెలిపారు. అసదుద్దీన్ ఓవైసీ ఇళ్లు అధిక భద్రతా జోన్‌గా అని పిలవబడే ప్రాంతంలో కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం పక్కన, పార్లమెంటుకు సమీపంలో ఉంది.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో నాలుగేండ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, కార్యదర్శి నామాల ఆజాద్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారని తెలిపారు. రూ.4,529 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరీక్షల సమయం ఆసన్నమైందని వివరించారు. ఫీజులు చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామంటూ ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బెదిరిస్తున్నాయని తెలిపారు. దీంతో విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలు, ఖర్చులరీత్యా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలను బలోపేతం చేస్తామని హెచ్చరించారు.

మాణిక్‌రెడ్డి గెలుపు చారిత్రక అవసరం

- నామినేషన్ కార్యక్రమంలో పలువురు నేతలు
- మాణిక్‌రెడ్డికి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల విస్తృత మద్దతు
- ఇందిరాపార్క్ నుంచి లిబర్టీ చౌరస్తా వరకు భారీ ప్రదర్శన
- జీహెచ్ఎంసీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి, స్వతంత్ర అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి గెలుపు చారిత్రక అవసరమని పలువురు నేతలు ఉద్ఘాటించారు. అప్పుడే విద్యారంగం, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని చెప్పారు. మాణిక్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బహిరంగ సభను నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్క్ నుంచి లిబర్టీ చౌరస్తా వరకు భారీ ప్రదర్శనను చేపట్టారు. ఆ తర్వాత జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు నామినేషన్ పత్రాలను అందజేశారు. మాణిక్‌రెడ్డికి ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు విస్తృతంగా మద్దతు ప్రకటించాయి. అంతకుముందు బహిరంగ సభనుద్దేశించి ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ మండలిలో తన ఒంటరితనానికి బ్రేక్ పడే అవకాశం తొందర్లోనే ఉందంటూ ఆకాంక్షించారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం తాము పాటుపడతామని చెప్పారు. అయితే ఈ ఎన్నికల్లో ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేసే టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారని అన్నారు. వారి కోసం యజమానులు మాట్లాడబోరనీ, తామే ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్తామనీ వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని విమర్శించారు. ఎన్ఈపీ, సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. మండలిలో ప్రజల వాణిని బలంగా వినిపించాలంటే మాణిక్‌రెడ్డిని గెలిపించుకోవాలని చెప్పారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్ మాట్లాడుతూ మండలిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ముగ్గురున్నా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నర్సిరెడ్డి ఉన్నారని అన్నారు. మాణిక్‌రెడ్డి గెలిస్తే మ్యాన్ ఆఫ్ ద సిరీస్ వస్తుందన్నారు. అభ్యర్థుల పనితీరు, నిజాయితీ, నిబద్ధతను చూసి ఓటెయ్యాలని కోరారు. స్వార్థానికి ఓటేస్తారా? నిస్వార్థంగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పోరాడే మాణిక్‌రెడ్డికి ఓటేస్తారా?అన్నది ఉపాధ్యాయులు తేల్చుకోవాలని చెప్పారు. సమస్యలపై లోతైన అవగాహన ఉన్న వారే ప్రభుత్వాలను ప్రశ్నిస్తారని అన్నారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ జోక్యం లేదనీ, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓట్లేస్తారని చెప్పారు. మాణిక్‌రెడ్డి గెలిచేందుకు అన్ని రకాలుగా అవకాశాలున్నాయన్నారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థుల్లో ఉత్తమమైన వ్యక్తి మాణిక్‌రెడ్డి అని అన్నారు. తెలంగాణ కోసం, ప్రజా ఉద్యమాల కోసం ఆయన గెలవాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాలనూ అమ్ముతున్నదని చెప్పారు. అదానీ సంపద కొల్లగొడుతున్నారంటూ ప్రచారం చేసే ధైర్యం ఎవరికైనా ఉందా?అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని, అంబేద్కర్ పేరును నిలబెట్టాలనీ, కొత్త సచివాలయంలోకి మాణిక్‌రెడ్డిలాంటి నిజాయితీ ఉన్న వ్యక్తి అడుగుపెట్టాలని అన్నారు.

మాణిక్‌రెడ్డికి ఇతర వ్యాపారాల్లేవ్

ఉన్నత విద్యా పరిరక్షణ కమిటీ చైర్మెన్ అండేసత్యం, టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, ఉపాధ్యక్షులు దుర్గాభవాని, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, పాలిటెక్నిక్ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉదయ్‌భాస్కర్, వృత్తి విద్యా ఉపాధ్యాయుల సంఘం ఉపేందర్, టీఎస్ ఎంఎస్‌టీఎఫ్ అధ్యక్షులు బి కొండయ్య, తెలంగాణ ఆల్ గురుకుల ఉపాధ్యాయుల సంఘం చైర్మెన్ మామిడి నారాయణ, సెక్రెటరీ జనరల్ డాక్టర్ ఎ మధుసూదన్ తదితరులు మాట్లాడుతూ నర్సిరెడ్డికి తోడుగా మరో గొంతును మండలికి పంపేందుకే మాణిక్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నామని చెప్పారు. కొత్త గురుకులాలు అద్దె భవనాల్లో ఉండడం వల్ల వాటి యజమానులకే ప్రయోజనం కలుగుతున్నదని విమర్శించారు. అన్ని గురుకులాలనూ ఒకే డైరెక్టరేట్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. మాణిక్‌రెడ్డికి ఉపాధ్యాయులకు సేవ చేయడం తప్ప వేరే వ్యాపారాల్లేవనీ, సమస్యలపై పాలకులను ప్రశ్నిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి టి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు ఎ వెంకట్, ఎం రాజశేఖర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్, కె రవికుమార్, జి నాగమణి, ఈ గాలయ్య, బి రాజు, వై జ్ఞానమంజరి, ఎ సింహాచలం, ఎస్‌వై కొండల్‌రావు, టీఎస్ఎంఎస్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బువ్వ కోసమే భూమి

(మొదటిపేజీ తరువాయి)

పశ్య పద్మ మాట్లాడుతూ ఉపగ్రహ ఛాయా చిత్రాల సమస్యను ఎందుకు ముందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. న్యాయబద్ధంగా వారికి పట్టాలు ఎందుకు ఇవ్వటం లేదో చెప్పాలన్నారు. కొద్దిమందికి మాత్రమే పట్టాలిస్తామని చెప్పడం సరికాదన్నారు.

పోడు పోరులో కలిసి వస్తాం..మల్లు రవి

కాంగ్రెస్ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి మాట్లాడుతూ పోడు భూములకోసం జరిగే పోరాటం లో తమ పార్టీ కలిసొస్తుందని చెప్పారు. పోడు సాగు దారులను ప్రభుత్వం ఇబ్బందులు పెట్టటం మాను కోవాలని హితవు పలికారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను పక్కనపెట్టి తమ ఇష్టమొచ్చినట్టు పాలన సాగిస్తున్నాయని విమర్శించారు.

పోడు రైతులందరికీ పట్టాలివ్వాలి..గుమ్మడి నర్సయ్య

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ పోడు రైతులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. పట్టాలిస్తామంటూనే ఆంక్షలెందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేసీఆర్ ఎనిమిదేండ్ల కాలంలో ఒక్క ఎకరానికి కూడా పట్టా ఇవ్వలేదని చెప్పారు. న్యూడెమోక్రసీ నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు, మధు, ఎంఎల్ నాయకులు మల్లేశ్, ఎంసీపీఐ(యు) నాయకులు ఉపేందర్‌రెడ్డి, ప్రజాపంథా నాయకులు ప్రభాకర్, రైతు కూలీ సంఘం నాయకులు కోటేశ్వరరావు, గౌని ఐలయ్య, ప్రసాదన్న మాట్లాడుతూ పోడు దారులకు హక్కుపత్రాలు ఇవ్వకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలను తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నాయకులు మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, మామిడాల బిక్షపతి, రామకృష్ణ, తదితరులు కూడా మాట్లాడారు.

రాష్ట్రంలో తగ్గిన మాతా శిశు మరణాలు

- మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాతా శిశు మరణాల సంఖ్యను తగ్గించటంలో తెలంగాణ మెరుగైందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. హైదరాబాద్ పాతబస్తీలోని పేట్లబురుజు మెటర్నిటీ ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన ఇన్‌ఫెక్షన్ల నివారణ అవగాహన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. మాతా శిశు మరణాల్లో ఒకప్పుడు తెలంగాణ ఐదు, ఆరు స్థానాల్లో ఉండేదని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఏడాదికి లక్షకు 43 మరణాలతో రాష్ట్రం మూడో స్థానంలో ఉందని మంత్రి తెలిపారు. అయినప్పటికీ మరణాలకు గల కారణాలపై లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు.

ప్రసవం జరిగిన తర్వాత బాలింతకు ఏవైనా ఇన్‌ఫెక్షన్లు ఉన్నాయా? లేవా? అనే అంశాలు పరిశీలించాలని అన్నారు. పూర్తిగా పరీక్షలు నిర్వహించిన తర్వాతే తల్లీబిడ్డను ఇంటికి పంపాలని సూచించారు.

మత రాజకీయాలతో వినాశనమే



(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయం జరగాలని, సమస్యలు పరిష్కారం కావాలని రాష్ట్రాన్ని ఇచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని విమర్శించారు. మన సమస్యలను ఎప్పటికప్పుడు రాసే జర్నలిస్టులు వాళ్ల సమస్యలు చెప్పుకునే పరిస్థితి వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో కవులు, కళాకారులు, మేధావులు, విద్యావంతులు అందరూ ఆలోచించాలని కోరారు. సునీల్ నాయక్ పీజీ చదివిన సునీల్ నాయక్ అనే నిరుద్యోగి ఉద్యోగాల నోటిఫికేషన్లు లేక ఆత్మహత్య చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోలేదన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని 3000 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. 2018-22 వరకు 10 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతుబీమా లెక్కల ప్రకారం 2014 నుంచి ఇప్పటి వరకు 80 వేల మంది చనిపోయారని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని తెలిపారు. బీఆర్ఎస్ నేతలతో పాటు బీజేపీ నేతలూ భూ కబ్జాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. ఏకశిలా పార్క్‌కు జయశంకర్ సార్ పేరు పెట్టారని, ఆ పార్క్‌లో బీరు సీసాలు పడి పొర్లుతున్నా యన్నారు. కాళోజీ కళాక్షేత్రం మొండిగోడలు దర్శనమిచ్చా యని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించినా నేటికీ పేదలకు పంచకుండా కనిపించా యన్నారు. పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని, లేదంటే నేనే పెడతానని మా హన్మన్న డిమాండ్ చేస్తే ఈరోజు వరకు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శిఖం భూములు, చెరువులు కబ్జా కావడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కారణం కాదా అని ప్రశ్నించారు. పార్టీ కోసం కష్టపడ్డ నేతలను, కార్యకర్తలను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని స్పష్టంచేశారు.

కాగా, పాదయాత్ర అంతా వినతులు, సమస్యలు వినడంపై రేవంత్‌రెడ్డి ఎక్కువ శ్రద్ధ పెట్టారు. దర్గాను సందర్శించిన రేవంత్ వారితో మైనార్టీల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కేయూ విద్యార్థులు వారి సమస్యలు వివరించారని, అడ్వకేట్లు, మహిళలు వారి బాధలు తెలిపారు. ఎనుమాముల మార్కెట్‌లో దోపిడిపై రైతులు కలిసి వారి సమస్యలు చెప్పారు. సమావేశానికి హన్మకొండ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, మహ్మద్ షబ్బీర్ అలీ, పీసీసీ మాజీ ఛీఫ్ వి. హన్మంతరావు, మల్లు రవి, ఎమ్మెల్యే సీతక్క, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, అస్మదుల్లా హుస్సేన్, వేం నరేందర్‌రెడ్డి, దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, కూచన రవళి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో అటవీ అధికారుల పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి గుడి, పరిసర ప్రాంతాలను అభివద్ధి చేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియాల్ సోమవారం కొండగట్టులో పర్యటించారు. ఆలయ అభివద్ధి, పునర్నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ తన వంతుగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ తరపున కొండగట్టును ఆనుకుని ఉన్న కొడిమ్యాల అటవీ ప్రాంతాన్ని దత్తత తీసుకుంటామని ప్రకటించారు. దీనితో అధికారులు అక్కడ చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు పర్యటన జరిపారు. అటవీ ప్రాం తం చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు, 5 కిలో మీటర్ల కాలినడక మార్గం (వాకింగ్ ట్రాక్) మట్టితో ఏర్పాటు చేయటం, వెయ్యి ఎకరాల్లో ఔషద, సుగంధ మొక్కల పెంపకం, దానికోసం నర్సరీల ఏర్పాటు, వాచ్ టవర్ నిర్మాణం, యాత్రికుల విశ్రాంతి మందిరా లు తొలి దశలో చేపట్టాలని నిర్ణయించారు. పర్యటన లో శరవణన్, ముఖ్య అటవీ సంరక్షణాధి కారి, బాసర సర్కిల్, వెంకటేశ్వరావు, జగిత్యాల జిల్లా అటవీ అధికారి లత, రేంజ్ ఆఫీసర్ మౌనిక, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సాయిరాం పాల్గొన్నారు.



టీఎస్‌ఆర్టీసీలోకి ఏసీ స్లీపర్ బస్సులు

మార్చి నుంచి అందుబాటులోకి...



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవల్ని అందించేలా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) తొలిసారిగా ఏసీ స్లీపర్ బస్సుల్ని ప్రవేశపెడుతున్నది. ఈ ఏడాది మార్చి నుంచి ప్రయాణీకులకు అందుబాటులోకి రానున్నాయి. తొలి విడతగా 16 ఏసీ స్లీపర్ బస్సుల్ని ప్రవేశపెడుతున్నారు. సుదూర ప్రాం తాలకు వెళ్లే రూట్లలో ఈ బస్సుల్ని టీఎస్‌ఆర్టీసీ నడుపనుంది. కర్ణాటకలోని బెంగళూరు, హుబ్లీ, ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం, తిరుపతి, తమిళనాడులోని చెన్నై మార్గాల్లో ఈ బస్సులు నడుస్తాయి. ఈ బస్సులకు 'లహరి' గా నామకరణం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని బస్ భవన్ ప్రాంగణంలో కొత్త ప్రోటో (నమూనా) ఏసీ స్లీపర్ బస్సును టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పరిశీలించారు. బస్సులోని సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ బస్సు లకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇవీ ప్రత్యేకతలు...

ఏసీ స్లీపర్ 'లహరి' బస్సులు 12 మీటర్ల పొడవు ఉంటాయి. లోయర్ 15, అప్పర్ 15తో మొత్తం 30 బెర్తుల సామర్థ్యం ఉంటుంది. బెర్త్‌ల వద్ద వాటర్ బాటిల్ పెట్టుకునే సదుపా యంతో పాటు మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉంటుంది. ప్రతి బెర్త్ వద్ద రీడింగ్ ల్యాంప్‌లు ఏర్పాటు చేశారు. వెహికిల్ ట్రాకింగ్ సిస్టం, ప్యానిక్ బటన్ సదుపాయం కల్పించి, వాటిని టీఎస్‌ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు అను సంధానం చేస్తారు. వైఫై సదుపాయం తో పాటు బస్సు క్యాబిన్‌లో, లోపల రెండు సీసీటీవీ కెమెరాలు ఉంటాయి. బస్సు రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా కూడా ఉంటుంది. బస్సుకు ముందు, వెనుక ఎల్ఈడీ బోర్డుల్లో గమ్యస్థానాల వివరాలు డిస్‌ప్లే చేస్తారు. అగ్నిప్రమా దాలను ముందుగా గుర్తించి నివారిం చేందుకు బస్సుల్లో ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం(ఎఫ్‌డీఎస్ఎస్) ఏర్పా టు చేశారు. అలాగే పబ్లిక్ అడ్రస్ సిస్టం కూడా ఈ బస్సుల్లో ఉంటుంది. నమూనా బస్సును పరిశీలించిన వారిలో టీఎస్‌ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో) డాక్టర్ వీ రవిందర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పీవీ మునిశేఖర్, చీఫ్ పర్సనల్ మేనేజర్ (సీపీఎం) కష్ణకాంత్, చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (సీఎంఈ) రఘునాథరావు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(సీటీఎం) జీవన్‌ప్రసాద్ ఉన్నారు.

గిరిజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు..

- టీజీఎస్ రాష్ట్ర మూడో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అను సరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానా లపై పోరాటాలకు శ్రీకారం చుట్టాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగా రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం(టీజీఎస్) రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా ముద్రించిన పోస్టర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాం నాయక్‌తో కలి సి సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ యన ఆవిష్కరించారు. మార్చి ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు మిర్యాల గూడలో మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. మార్చి ఒకటిన వేలాది మందితో మహాప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ, ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు బృందాకరత్, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ చైర్మెన్ డాక్టర్ మిడియం బాబురావు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాము లు పాల్గొంటున్నారని తెలిపారు.

టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-11 (ప్రిలిమ్స్) ఆన్‌లైన్ కోచింగ్

- తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్
టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్-11(ప్రిలిమ్స్) పరీక్ష లకోసం సోషల్ స్ట్రక్చర్, పబ్లిక్ విధాన సమ స్యలు తదితర అంశాలపై రెండు నెల్ల కాలానికి లైవ్ టెలీకాస్ట్ కోచింగ్ క్లాసులు ఈ నెల 27నుంచి జై తెలంగాణ టీవీ ఐఎన్‌బీ, హైదరాబాద్ న్యూస్ ద్వారా ప్రారంభమవుతా యని తె లంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టరఽ కె అలో క్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలి పారు. వీటిపై ప్రతి రోజు మధ్యాహ్నం 3గం టలనుంచి 4.30వరకు ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని పేర్కొన్నారు.

మూస పద్ధతుల్లో బోధన సరికాదు

- అంబేద్కర్ వర్సిటీ వీసీ సీతారామారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ఒకవైపు సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతుంటే మరోవైపు మూస పద్ధతుల్లో విద్యాబోధన సరైంది కాదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) కె సీతారామారావు అన్నారు. సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ (సీఎస్‌టీడీ) ఆధ్వర్యంలో అధ్యాపకులు, పరిశోధకులకు రెండురోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. 'ఔట్‌కం బేస్డ్ ఎడ్యుకేషన్ టీచింగ్ లెర్నింగ్'అనే అంశంపై శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో అధునాతన పద్ధతుల్లో విద్యార్థికి సమగ్రంగా అర్థమయ్యేలా పాఠాలు ఎలా బోధించాలో ఈ శిక్షణలో చెప్తారని అన్నారు. పరిశోధన అంశాలను చాట్ జీపీటీలాంటివి మరింత ప్రభావితం చూపుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా వర్సిటీ ఇంచార్జీ అకడమిక్ డైరెక్టర్ సుధారాణి, రిజిస్ట్రార్ ఎవిఎన్ రెడ్డి, సీఎస్‌టీడీ డైరెక్టర్ ఐ ఆనంద్ పాల్గొన్నారు.

ఆరె కుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



హైదరాబాద్: ఆరె కులస్తులు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలని అధ్యక్షులుగా చెట్టిపల్లి శివాజీ అన్నారు. అంబర్‌పేట త్రిశూల్ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యవర్గ సమావేశంలో సోమవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చెట్టిపల్లి శివాజీ, గౌరవ అధ్యక్షులు నాగూర్ల వెంకన్న, స్టీరింగ్ కమిటీ చైర్మెన్‌గా దిగంబర్ రావు, క్రమశిక్షణ కమిటీ చైర్మెన్‌గా ఎం.రాంబాబు, ఉద్యమ కమిటీ చైర్మెన్‌గా సోమిడి అంజన్ రావు, ఆరె కుల రైతు సంఘ అధ్యక్షులుగా మోర్తాల చందర్ రావుతో పాటు వివిధ కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ పలు తీర్మానాలు చేసి ఆమోదించింది. ఉప్పల్ భగాయాల్లో ఆరెకుల సంఘానికి ఒక ఎకరం స్థలం, రూ.కోటి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే భవన నిర్మాణానికి మరో నాలుగు కోట్లు నిధుల కోసం విజ్ఞప్తి చేయాలని నిర్ణయించారు.
ఈ సమావేశంలో సంఘం నాయకులు రామ నర్సింహాయ్య, కోల కష్ణస్వామి, నర్సింగ్ రావు, శ్రీనివాస్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సాయన్నకు కన్నీటి వీడ్కోలు

- అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు



నవతెలంగాణ-కంటోన్మెంట్
హైదరాబాద్‌లోని కంటో న్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్నకు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమ సంస్కారాలు సోమ వారం మారేడ్‌పల్లి హిందూ శ్మశానవాటికలో నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు కార్ఖానా క్యాంపు కార్యాల యం నుంచి బయలుదేరిన అంతిమయాత్ర శ్మశానవాటికకు చేరుకుంది. అయితే, అధికారిక ఏర్పాట్లు చేయకపోవడంతో అభిమానులు, కార్యకర్తలు సాయన్న భౌతికకాయాన్ని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. సీనియర్ ఎమ్మెల్యేకి లాంచనప్రాయంగా, ప్రభుత్వపరంగా చేయాల్సిన ఏర్పాట్లు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ వారికి నచ్చజెప్పినప్పటికీ మధ్యాహ్నం నుంచి కార్యకర్తలు, అభిమానులు శ్మశానవాటికలోనే ఆందోళనకు దిగారు. అధికార లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహిం చాలని డిమాండ్ చేశారు. ఆలస్యం అవుతుండటంతో సాయన్న కుటుంబీకులు నచ్చజెప్పి అంత్యక్రియలు జరిగేలా చూడాలనడంతో శాంతించారు. దీంతో రాత్రి 7 గంటల 25 నిమి షాలకు అంత్యక్రియలు పూర్తి చేశారు. సాయన్న అల్లుడు అంతిమ సంస్కారాలు చేశారు. కాగా, సోమవారం ఉదయం నుంచి కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలో భౌతికకాయాన్ని ఉంచారు. మంత్రి కేటీఆర్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, మంత్రులు మహమ్మద్ అలీ, శ్రీనివాస్ యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, పలువురు కాంగ్రెస్ ప్రముఖులు సాయన్న భౌతికకాయాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళి అర్పించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు నళిని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు.

భద్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

- క్షేత్ర స్థాయి తనిఖీలు చేయండి
- ద.మ. రైల్వే జీఎమ్ అరుణ్ కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో
రైళ్లు, రైల్వే లైన్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనీ, దానికోసం అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు తప్పనిసరిగా చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. సోమవారంనాడాయన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో "ఇంటెన్సివ్ సేఫ్టీ డ్రైవ్"పై సమీక్షా సమావేశం నిర్వహించారు. విజయవాడ, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాబీలు, నిర్వహణ కేంద్రాలు, పని ప్రదేశాల్లో ఆకస్మిక క్షేత్ర తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ప్రమాద హెచ్చరిక సిగ్నల్ పాస్ చేయడం వంటి అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లతో సహా అన్ని భద్రతా విభాగాల సిబ్బందికి నిరంతర కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం 'అమృత్ భారత్ స్టేషన్ల' ప్రాజెక్టు స్థితిగతులపైనా సమీక్షించారు. ఆధునీకరణ కోసం ఎంపిక చేసిన రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు జనరల్ మేనేజర్‌కు వివరించారు.

సంపాదకీయం

'ఉపాధి'కి కేంద్రం సమాధి!

గ్రామీణ భారతావనిలో కాస్తంతయినా బతుకు భరోసానిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్‌జిఎ)పై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపరీత ఆంక్షలు విధిస్తూ నిర్వీర్యానికి కుట్ర పన్నుతున్నట్లు కనిపిస్తోంది. వేతన బకాయిలు, ముఖ ఆధారిత హాజరు,

> 'ఉపాధి' కార్మికులకు వేతనాలు చెల్లింపు కోసం ఆధార్‌తో ముడి పెట్టడం పట్ల అసలు చట్టం లక్ష్యానికే ప్రమాదం వాటిల్లుతుందని ఈ పథకానికి సంబంధించిన కార్మిక సంఘాల ఐక్య వేదిక ఎన్ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసినా మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారమే అధార్ అనుసంధానిత వేతన చెల్లింపుల విధానం వల్ల 57శాతం ఉపాధి కార్మికులు ఈ చట్టానికి దూరమవుతారు.


చెల్లింపులకు ఆధార్‌తో ముడిపెట్టడం వంటి ఆంక్షలు రుద్దుతోంది. 'ఉపాధి'పై ఆంక్షల కత్తి వేలాడదీయడమంటే గ్రామీణ పేద ప్రజానీకంపై ప్రత్యక్ష దాడికి పూనుకోవడమే. వ్యవసాయమే ప్రధానంగా ఉన్న గ్రామీణ భారతావనిలో నాట్లు, కోతల సమయంలో మినహా ఏడాదంతా ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితులు, కరువు కాటకాలున్న ప్రాంతాల్లో ఆ పనులు కూడా దక్కక ప్రజానీకం బతుకు జీవుడా అంటూ పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లాల్సిన పరిస్థితులను కొంత మేరకైనా నిలుపుదల చేయడానికి ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. గ్రామంలోని ప్రతి వయోజనుడికి ఏడాదికి కనీసం 100రోజులు పనిని ఈ చట్టం ఒక హక్కుగా కల్పించింది. ఉపాధి చట్టం కింద పనులు చేసిన వారందరికీ వేతనాలను కేంద్రమే చెల్లించాలి. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఈ ఏడాది 'ఉపాధి' పథకానికి భారీగా కోత పెట్టడంతో దాడిని తీవ్రం చేసిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు వేతనాల చెల్లింపు బాధ్యత నుంచి తప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది.



'ఉపాధి' వేతనాలు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలన్న నిబంధన ఉండటంతో రాష్ట్రాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ అక్రమాలను పట్టించుకోవడం లేదన్నది మోడీ సర్కార్ చేస్తున్న వాదన. కేంద్రం 100శాతం భరించాలన్న నిబంధనను ఎత్తివేసి దానిస్థానంలో 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్రం భరించాలన్న నిబంధనతో ఉపాధి చట్టాన్ని సవరించాల్సిన అవసరముందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ ఇటీవల సెలవిచ్చారు. అప్పుడే రాష్ట్రాలు కూడా 'ఉపాధి'లో అక్రమాలు జరగకుండా జాగ్రత్త వహిస్తాయని ఆయన చెప్పుకొచ్చారు. అంతేకాదు దేశంలో ఎక్కడా పని దొరకకపోతే అప్పుడు మాత్రమే ఈ పథకం కింద ఉపాధి పొందాలట! గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ వంటి మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమేనన్న సంగతి విస్మరించి 'ఉపాధి' కార్మికులకు మొబైల్ యాప్‌లో ముఖ ఆధారిత హాజరు వేయడమేంటన్న ప్రశ్నకు కూడా గిరిరాజ్ గొప్ప బదులిచ్చారు! పారదర్శకత విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడబోదని చెప్పారు. మోడీ సర్కార్‌కి ప్రజాధనం దుర్వినియోగం కాకుండదన్న అంతటి చిత్తశుద్ధి నిజంగానే ఉంటే యేటా లక్షలాది కోట్ల రూపాయలు ప్రభుత్వ విత్త సంస్థలకు ఎగవేస్తున్న కార్పొరేట్లు కనిపించడం లేదా? అదానీ అక్రమాలపై ప్రపంచం మొత్తం గగ్గోలు పెడుతున్నా ఎందుకు వెనకేసుకొస్తోంది? ఎక్కడకుపోయింది పారదర్శకత? అదానీ దోచుకున్నది ప్రజాధనం కాదా? దోచిపెట్టింది.. పెడుతున్నదీ మోడీ సర్కార్ కాదా? కోట్ల దోపిడీ కానరాదు కానీ చిన్నోచితకో ఉపాధి కూలీల వేతనాల్లో మాత్రం దోపిడీ కనిపెట్టడం మోసకారితనమే! పైగా ఉపాధి చట్టాన్ని తీసుకొచ్చిన లక్ష్యమే వలసలు నివారించడం.. అయితే దానికి కేంద్రం వక్రభాష్యం చెబుతోంది.

'ఉపాధి' కార్మికులకు వేతనాలు చెల్లింపు కోసం ఆధార్‌తో ముడి పెట్టడం పట్ల అసలు చట్టం లక్ష్యానికే ప్రమాదం వాటిల్లుతుందని ఈ పథకానికి సంబంధించిన కార్మిక సంఘాల ఐక్య వేదిక ఎన్ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసినా మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదు. కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారమే అధార్ అనుసంధానిత వేతన చెల్లింపుల విధానం వల్ల 57శాతం ఉపాధి కార్మికులు ఈ చట్టానికి దూరమవుతారు. ఈ ఏడాది బడ్జెట్‌లో గతేడాది కంటే 33శాతం తక్కువ కేటాయింపులు చేయడం కూడా 'ఉపాధి'ని నిర్వీర్యం చేయడంలో కుట్రగానే చూడాలి. ఇప్పటికే 14రాష్ట్రాలకు రూ.6157 కోట్ల 'ఉపాధి' బకాయిలను కేంద్రం చెల్లించాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్‌కే రూ.836 కోట్లు బకాయి పడింది. వేతన బకాయిలు నిలిపివేయడం, మొబైల్ యాప్ ద్వారా హాజరు, ఆధార్ చిక్కుముడులు ఇలా ఒకదానికి ఒకటి లింక్ చేసి మొత్తంగా 'ఉపాధి' పని దినాలను కుదించేసి మొత్తం చట్టానికే సమాధి కట్టాలన్నది మోడీ సర్కార్ మదిలోని కుట్ర. గ్రామాలకు రక్షగా ఉంటున్న ఉపాధిని కాపాడుకోవడం అందరి బాధ్యత.

ఆర్థిక మంత్రినోట తప్పుదోవ పట్టించే ప్రకటన



ప్రభాత్ పట్నాయక్

బాధ్యత కలిగిన ఒక కేంద్ర క్యాబినెట్ మంత్రి తప్పుదోవ పట్టించే విధంగా ప్రకటన చేయడం ఏ మాత్రమూ సరైనది కాదు. కాని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అదే పని చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి మాట్లాడుతూ రాష్ట్రాలకు చేసిన కేటాయింపుల విషయంలో "రాష్ట్రాలకు ఆర్థిక వనరుల కేటాయింపులు భారీగా పెంచినట్టు" ఆమె ప్రకటించారు (హిందూ, ఫిబ్రవరి 11). ఈ ప్రకటన చూస్తే కేంద్రం చాలా ఉదారంగా వ్యవహరించిందన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ ఆ విధమైన పెరుగుదల వాస్తవంగా ఉన్నట్టు చూపించే అంకెల వివరాలను వేటినీ ఆమె ఇవ్వలేదు. బడ్జెట్‌లో ఉన్న అంకెలను పరిశీలిస్తే ఏ విధంగా చూసినప్పటికీ రాష్ట్రాలకు చేసిన కేటాయింపులలో పెరుగుదల లేకపోగా తరుగుదల కనిపిస్తున్నది. మన స్థూల జాతీయోత్పత్తితో పోల్చినప్పుడు కేటాయింపులలో నికరంగా తరుగుంది. మోడీ ప్రభుత్వం మొదటినుంచీ వనరులన్నింటినీ కేంద్రం వద్ద కేంద్రీకరించుకునే విధానాన్ని అమలు చేస్తున్నది. ఈ బడ్జెట్‌లో కూడా ఆ విధానమే కొనసాగింది.

కేంద్రం వద్ద జమ అయ్యే మొత్తం పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు ఎంత వాటా కేటాయించినదీ చూద్దాం. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు 42శాతం పన్ను ఆదాయాన్ని కేటాయించమని సిఫార్సు చేసిన సంగతి మనకి గుర్తుంది. అప్పుడు కేంద్రం ఆ సిఫార్సును ఎటువంటి అరమరికలూ లేకుండా ఆమోదించినట్టు ప్రకటించింది. కాని ఇంకోపక్క వేరే వేరే పద్దుల్లో (ఆ పద్దులు ఆర్థిక సంఘం పరిధిలోకి రావు) రాష్ట్రాలకు రావలసిన వాటాలను భారీగా తగ్గించింది. నిజానికి జీడీపీ ఏ మేరకు పెరుగుతుందో అదే మోతాదులో రాష్ట్రాలకు కేటాయింపులు కూడా పెరగాలి. ఆ విధంగా చేయకుండా కోతలు పెట్టింది. అందువలన మొత్తం మీద జీడీపీ పెరుగుదలతో పోల్చి చూసుకు న్నప్పుడు రాష్ట్రాలకు వాటాలు తగ్గిపోయాయి. ఆ తర్వాతనుంచీ మొత్తం పన్ను ఆదాయంలో రాష్ట్రాలకు దక్కే వాటా తగ్గిపోవడం మొదలైంది. 2018-19లో 36.6శాతం, 2021-22లో 33.2శాతం, 2022-23 (సవరించిన అంచనాల ప్రకారం) 31.2శాతం కేటాయించారు. ఇప్పుడు 2023-24లో 30.4శాతమే కేటాయించారు. పన్ను రూపంలో వసూలు చేస్తే రాష్ట్రాలతో పంచుకోవాలి కాబట్టి అదనంగా వసూలు చేసినదానికి పన్ను అని పేరు పెట్టకుండా స్పెషల్ లెవీ అని, సర్‌చార్జి అని, సెస్ అని రకరకాల పేర్లు పెట్టి ఆ రూపంలో వసూలైన ఆదాయంలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా ఎగ్గొడుతోంది కేంద్రం. 2011-12 నాటికి అటువంటి పేర్లతో వసూలు చేసిన ఆదాయం మొత్తం ఆదాయంలో 10శాతం ఉండేది. 2021-22 నాటికి అది అమాంతం రెట్టింపై ఇరవై శాతం అయింది.

వసూలైన మొత్తం పన్నుల్లో రాష్ట్రాల వాటా తగ్గడమే కాదు, జీడీపీతో పోల్చుకున్నా తగ్గింది. గతేడాదితో పోల్చుకుంటే 2023-24లో జీడీపీలో 10.5శాతం వృద్ధి ఉంటుందన్న అంచనాతో బడ్జెట్ తయారైంది. కానీ, రాష్ట్రాలకు కేటాయించిన వాటా మాత్రం రూ.9,48,406 కోట్ల నుండి (సవరించిన అంచనా) రూ.10,21,448 కోట్లకు మాత్రమే పెరిగింది. ఇది 7.7శాతం పెరుగుదల మాత్రమే. జీడీపీ పెరుగుదల 10.5 ఉంటుందన్నప్పుడు రాష్ట్రాల వాటా కూడా ఆ మేరకు పెరగాలి కదా. కాని అలా పెరగలేదు. మరి ఆర్థికమంత్రి భారీగా రాష్ట్రాల కేటాయింపులు పెరిగాయని ఏ విధంగా ప్రకటించారు? అటు పన్ను వసూళ్ళతో పోల్చి చూసినా, ఇటు జీడీపీ వృద్ధి రేటుతో పోల్చి చూసినా పన్ను ఆదాయంలో రాష్ట్రాల వాటా వాస్తవంగా తగ్గిపోయింది.

ఇక రాష్ట్రాలకు మొత్తంగా జరిగే నిధుల బదలాయింపుల సంగతి చూద్దాం. ఈ బదలాయింపు నాలుగు రకాలుగా ఉంటుంది. ఒకటి: మొత్తం వసూలైన పన్నుల్లో రాష్ట్రాల వాటా. రెండు: ప్రత్యేక సహాయంపేరుతో పెట్టుబడుల వ్యయం కోసం రాష్ట్రాలకు ఇచ్చే రుణాలు, ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం వగైరా. మూడు: కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు కోసం, కేంద్ర పథకాల కోసం ఇచ్చే గ్రాంట్లు, నాలుగు: ఆరోగ్యరంగం మెరుగుదల, స్థానిక సంస్థల నిర్వహణ మెరుగుదల తదితర లక్ష్యాలకోసం ఆర్థిక సంఘం ప్రత్యేకంగా సిఫార్సు చేసిన గ్రాంట్లు. ఈ అన్ని రకాల బదలాయింపులనూ మొత్తంగా లెక్క వేస్తే 2022-23 (సవరించిన అంచనాలు)లో రాష్ట్రాలకు రూ.17.11 లక్షల కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్ అంచనాల్లో అది రూ.18.63 లక్షల కోట్లు అయింది. అంటే 8.88శాతం పెరిగి ంది. కాని జీడీపీ వృద్ధి రేటు 10.5శాతం కన్నా ఇది తక్కువ కదా!

ఈ విధంగా ఆర్థిక వనరులను కేంద్రీకరించడం మోడీ ప్రభుత్వం హయాంలో యాదృచ్ఛికంగా జరుగుతోందను కోలేం. ఉన్న పరిమిత వనరుల్లో తమవద్ద ఎక్కువ వాటా ఉండాలన్న తాపత్రయం కొద్దీ చేస్తున్న పని అని కూడా అనుకోలేం. ప్రపంచంలోని ఏ ఫాసిస్టు ప్రభుత్వపు చరిత్ర చూసినా, దాని

> ఆర్థిక వనరులను కేంద్రం గుప్పెట్లో పెట్టుకునే ధోరణి ఒక్క ఫాసిస్టు ప్రభుత్వాలకే ఉంటుంది అని అనుకోలేం. గుత్త పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలన్నింటికీ ఈ లక్షణం ఉంటుంది. ప్రజలనుండి పోగేసిన వనరులను ప్రయివేటు గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం వెచ్చించాలన్నదే వాటి విధానం. అలా కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయడం అంటే అది వారి దృష్టిలో "సంపదను వృథాగా ఖర్చు చేయడమే." ఈ ధోరణి ఫాసిస్టు ప్రభుత్వాలున్నప్పుడు మరింత ప్రకోపిస్తుంది.

మౌలిక సిద్ధాంతం కేంద్రీకరణే. మన దేశంలోనైతే ఇది "సహకార ఫెడరలిజం" అనే ముసుగులో అమలు జరుగుతోంది. ఫాసిస్టు ప్రభుత్వాలలో కేవలం సంస్థాగత నిర్మాణంలోనే గాక, ప్రభుత్వ పాలనా వ్యవస్థలోనూ కేంద్రీకరణ అమలు జరుగుతుంది. తమకు అధికారం అప్పజెప్పిన ప్రజలు లేవనెత్తిన డిమాండ్లను పరిశీలించి అమలు జరపడం అనే ప్రజాస్వామ్య పద్ధతిలో ఈ ఫాసిస్టు ప్రభుత్వాలకు నమ్మకం ఉండదు. ఒకసారి అధికారం చేతిలోకి వచ్చాక ఒక ఆ ప్రజల్ని ఏ విధంగా మభ్యపెట్టాలా అన్నదే వారి దృష్టి. అందుకే తరచూ ప్రజల మధ్య మతాల పేరుతో చిచ్చు రాజేసి ఘర్షణలను రెచ్చగొడుతూవుంటారు. మైనారిటీ తరగతుల ప్రజలు తమకు శత్రువులు అని మెజారిటీ తరగతుల ప్రజలు నమ్మేటట్టు ప్రచారం చేస్తూ ఉంటారు. అధికారం తమకు ఏ ప్రజలనుంచి సంక్రమించిందో, ఆ ప్రజలనే నిస్సహాయులుగా మార్చేస్తూవుంటారు. నాయకుడే సర్వశక్తిమంతుడు అన్న భావనను కలిగించడానికి ప్రయత్నిస్తూంటారు. అందుకే ఫాసిస్టు పాలనలో సమిష్టి నాయకత్వం ఉండదు. అంతేకాదు. ఆ నాయకుడు ప్రజలను ఉద్దేశించి చేసే ప్రసంగాలలో హేతుబద్ధమైన వాదన ఏదీ ఉండదు. ప్రజల చైతన్యాన్ని కదిలించే ప్రయత్నం ఎక్కడా



ఉండదు. దానికి బదులు నాటకీయంగా మాట్లాడుతూ ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి పూనుకుంటారు.

వనరుల కేటాయింపుల విషయంలో కూడా కేంద్రానికి ఎంత వాటా ఉండాలి? రాష్ట్రాలకు ఎంత వాటా ఉండాలి? అన్న చర్చను హేతుబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా జరిపే ప్రయత్నం ఏదీ ఉండదు. ఏదో ఒక సాకుతో వనరులను కేంద్రీకరించడమే పనిగా వ్యవహరిస్తారు. కేంద్రంలో అధికారం ఫాసిస్టు శక్తుల చేతుల్లో ఉండి, కొన్ని రాష్ట్రాల్లో ఆ ఫాసిస్టు విధానాలకు తలొగ్గని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రతిపక్ష-పాలిత రాష్ట్రాలకు ఊపిరి సలపకుండా చేయడానికి ఈ వనరుల కేంద్రీకరణ పద్ధతిని మరింత ఉధృతంగా అమలు చేస్తారు.

ఈ కేంద్రీకరణ విధానం వెనక మరో బలమైన కారణం కూడా ఉంది. ప్రతీ ఫాసిస్టు ప్రభుత్వానికీ కొన్ని గుత్త పెట్టుబడిదారీ సంస్థలతో ప్రత్యేకమైన సాన్నిహితం ఉంటుంది. అందుకే ఇటీవల బయటపడిన అదానీ సంస్థల కుంభకోణాల


> వనరుల కేటాయింపుల విషయంలో కూడా కేంద్రానికి ఎంత వాటా ఉండాలి? రాష్ట్రాలకు ఎంత వాటా ఉండాలి? అన్న చర్చను హేతుబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా జరిపే ప్రయత్నం ఏదీ ఉండదు. ఏదో ఒక సాకుతో వనరులను కేంద్రీకరించడమే పనిగా వ్యవహరిస్తారు. కేంద్రంలో అధికారం ఫాసిస్టు శక్తుల చేతుల్లో ఉండి, కొన్ని రాష్ట్రాల్లో ఆ ఫాసిస్టు విధానాలకు తలొగ్గని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఆ ప్రతిపక్ష-పాలిత రాష్ట్రాలకు ఊపిరి సలపకుండా చేయడానికి ఈ వనరుల కేంద్రీకరణ పద్ధతిని మరింత ఉధృతంగా అమలు చేస్తారు.

ఉదంతం విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి మౌనాన్ని పాటిస్తోంది. ప్రజా సంక్షేమం కోసం ఆర్థిక వనరులను వికేంద్రీకరించేబదులు కేంద్రీకరిస్తే ఆ నిధులను తన అభిమాన గుత్త సంస్థలకు ఉపయోగపడే విధంగా ఖర్చు చేయడానికి వీలవుతుంది.

ఈ ఏడాది బడ్జెట్‌ను ఇందుకు సరైన మచ్చుతునక. కరోనా మహమ్మారి నుండి కోలుకున్నప్పటికీ, ప్రయివేటు వ్యక్తుల వినిమయం బాగా కుదించుకుపోయింది. ఇది అనేకమంది ప్రజలను దుర్భర దారిద్ర్యంలోకి నెట్టింది. వారిని ఆ పరిస్థితి నుండి బయట పడవేయడానికి కావలసిన ఏ చర్యలూ ఈ బడ్జెట్‌లో లేవు. జీడీపీ వృద్ధి రేటు కన్నా కూడా తక్కువ స్థాయిలోనే ప్రభుత్వ వ్యయాన్ని ఉండేలా పరిమితం చేశారు. కాని అదే సమయంలో పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకోసం కేటాయింపులు బాగా పెంచారు. ఈ ప్రాజెక్టులలో అదానీ గ్రూపునకు ప్రత్యేకమైన ఆసక్తి ఉండడమే దీనికి కారణం. వాటిలో కొన్ని ప్రాజెక్టులలో ప్రభుత్వానికి తోడు భాగస్వామిగా అదానీ గ్రూపు ఉంటుంది. మరి కొన్నింటికి ఇన్‌పుట్స్‌ను సరఫరా చేస్తుంది. అదానీ సంస్థలకు కావలసిన మార్కెట్‌ను సృష్టించడానికే ఈ బడ్జెట్ కేటాయింపులన్నీ తోడ్పడతాయి.

ఆర్థిక వనరులను కేంద్రం గుప్పెట్లో పెట్టుకునే ధోరణి ఒక్క ఫాసిస్టు ప్రభుత్వాలకే ఉంటుంది అని అనుకోలేం. గుత్త పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలన్నింటికీ ఈ లక్షణం ఉంటుంది. ప్రజలనుండి పోగేసిన వనరులను ప్రయివేటు గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం వెచ్చించాలన్నదే వాటి విధానం. అలా కాకుండా ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయడం అంటే అది వారి దృష్టిలో "సంపదను వృథాగా ఖర్చు చేయడమే." ఈ ధోరణి ఫాసిస్టు ప్రభుత్వాలున్నప్పుడు మరింత ప్రకోపిస్తుంది. ప్రజల్ని మత విద్వేష రాజకీయాలలో ముంచెత్తి తమ భౌతిక జీవితంలో మెరుగుదల గురించి ఆలోచించకుండా వారు ఉండేలా చేస్తూ మరోపక్క తమకు నచ్చిన గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం ఆర్థిక వనరులను మళ్ళిస్తారు. మోడీ ప్రభుత్వం ఈ కేంద్రీకరణను తారాస్థాయికి తీసుకుపోతున్నది.

(స్వేచ్ఛానుసరణ)



'ఎర్ర పుస్తకం' వర్ధిల్లాలి

ప్రతీ అక్షరం ఓ ప్రభోదం
ప్రతీ పదం ఓ ప్రజ్వలనం
ప్రతీ పాదం ఓ ఉద్దీపనం
ప్రతీ వాక్యం ఓ ఉత్ప్రేరకం
విప్లవ కావ్యమే రెడ్ బుక్

కార్మిక కర్షక శ్రామికులకు
పోరు పాఠం ప్రబోధిస్తుంది
కష్టజీవులు, కర్మవీరులకు
రణ తంత్రం మంత్రిస్తుంది

తాడిత పీడిత వర్గాలకు
ఎర్ర దారిలో నడిపిస్తుంది
మూగబోయిన గళాలకు
ధిక్కారాజ్ఞల రాజేస్తుంది

అంధకారమైన జీవితాల్లో
క్రాంతి వెలుగు పరుస్తుంది
అసమానతల వ్యవస్థపై
అక్షరాస్త్రం సంధిస్తుంది

పెట్టుబడిదారుల గుండెల్లో
విప్లవ జెండా దించుతుంది
స్వామ్యవాద సూత్రాలను
కళ్లెదుటనే ఆవిష్కరిస్తుంది

సమసమాజ నిర్మాణానికి
సబ్బండవర్గాల కదిలిస్తుంది
మరో మహోదయం వైపు
ప్రపంచాన్ని నడిపిస్తుంది

విముక్తి చిహ్నమా!
శ్రామికుల నేస్తమా!!
ఎర్రెర్రని పుస్తకానికి
విప్లవ యోధుల వందనం
ఉద్యమ దళాల నీరాజనం

(ఫిబ్రవరి 21న "రెడ్‌బుక్స్‌డే" సందర్భంగా)
కోడిగూటి తిరుపతి, 9573929493



ప్రవాహం

"ప్రవహించే ఉత్తేజం..
నిత్య చైతన్య గీతం,
యువకిషోరం.. స్ఫూర్తి ప్రభాత..
కణకణమండే నిప్పకణిక,
నింగికెగసిన అరుణతార
అమరుడా కామ్రేడ్ నరసింహ.
జోహర్లు కన్నీటి నివాళులు..!
ఉద్యమాల అడ్డ...
వీపనగండ్ల పోరుగడ్డలో
పుట్టిండు పులిపిల్లడు...
ఈమట్టి నవయవ్వనమైంది.
ఉదయించే సూర్యుడు,
ఉద్యమాల భాస్కరుడు..!!
కటికదరిద్రుల పాలిట
క్రాంతి కిరణం,
మట్టిమనుషుల ఎదలు తట్టే వేగుచుక్క.
బువ్వలేక డొక్కలెండి
ఆకలితో తనువులు
చాలించే బతుకులకు
అంబలిపోసి
ఆయుషు పెంచిన అప్పుడు.
అగ్రవర్ణ దురహంకారనెదిరిస్తూ,
ఎట్టిబతుకుల మెతుకుల కోసం..
సమసమాజమే లక్ష్యంగా,
సమరశంఖం పూరించిన రణధీరుడు..
కపటదారి నక్సల్స్ ముష్కరుల
బాంబు వేటుకు బలైన ధృవతార..!!!
ఆనెత్తుకి గాయాలతో దండుగట్టి,
నడకలోఎర్రని జెండాలెత్తుకుంటూ..
మా అన్న ఎక్కడని,
నినుకన్న పల్లె కన్నీళ్లు కారుస్తుంది..
పాడేటి కోయిల పాట మూగబోయింది..
ఆడేటినెమళ్లు నాట్యమాపాయి.
చిన్నారి నవ్వులో
చిరునవ్వు నిలిచింది.
కొమ్మారెమ్మా చిగురించలే..!!!!
ఉద్యమంలాఎగిసిన తార,
పొద్దుపొడుపై నిలిచే వీరా..
నింగినేలలో వెలిగే ధృవతార,
నిత్య చైతన్యపు దారా..
నీ నమ్మిన ఆశయం... సిద్ధాంతం
సాగరకెరటమై
ఎగసిపడుతున్నయి...
ఇలలో అలలై .!!!
(కామ్రేడ్ నరసింహ
32వ వర్ధంతి సందర్భంగా)

- డి. కృష్ణయ్య, వీపనగండ్ల.

మనుగడ కోసం మాతృభాషల పోరాటం...




అంకం నరేష్
6301650324

భాష కేవలం భావాలు వ్యక్తం చేయడానికి ఉపయోగపడే సాధనం కాదు ఒక జాతి ఉనికిని, సంస్కృతిని, జీవన విధానాన్ని పరిచయం చేస్తుంది. ఒక జాతి విశిష్టత, వారసత్వం, నైతికత ఆ జాతి మాతభాషలో నిబిడీకృతమై ఉంటాయి. ఇలా ఏర్పడిన తల్లి భాషల్లో నేడు కొన్ని అంతరించిపోతుండటం ఆందోళన కలిగించే అంశం. భాష కనుమరుగైతే అందులోని జ్ఞానం సైతం అంతరించిపోతుంది. ఆ భాషలోని గేయాలు, పురాణాలు, చరిత్ర, ఇతిహాసాలు, సాహిత్య సంపద సైతం కనుమరుగవుతోంది. భారతవనిలో ప్రస్తుతం కొన్ని గిరిజన తెగల భాషలు ప్రపంచీకరణ ,వలసవాదం ఫలితంగా అంతరించిపోయే దశలో ఉన్నాయి. ప్రపంచంలో చిన్న పెద్ద భాషలన్నీ రక్షించుకోవాలని, భాష సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మనం జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలమనే మొదలైన లక్ష్యాలతో ప్రతి ఏడాది ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుండి ప్రతి ఏటా బంగ్లాదేశీయులు చేసిన భాష ఉద్యమానికి నివాళిగా ప్రపంచమంతటా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటాం. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఏటా ఒక థీమ్‌ను కూడా యునెస్కో ప్రకటిస్తుంది. "బహుభాషా విద్య-విద్యను మార్చే ఆవశ్యకత" అనేది ఈ ఏడాది థీమ్. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాషలను సంరక్షించడం ఇతర భాషలు నేర్చుకోవడానికి మాతృభాషను ఉపయోగించడమే ప్రధాన అంశంగా యునెస్కో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది.

తల్లడిల్లుతున్న తల్లి భాషలు...

యునెస్కో లెక్కల ప్రకారం ప్రపంచంలో ప్రస్తుతం 6వేల భాషలు మాట్లాడుతున్నారు. మనదేశంలో 1652 భాషలు కలవు. దేశంలో పదివేల మంది కంటే ఎక్కువ మంది మాట్లాడే భాషలు 270 ఉన్నాయి. అందులో 117 భాషలు అంతరించిపోయే ప్రమాదముందని ఇటీవల కేంద్ర సాంస్కృతిక శాఖ విభాగమైన అంతరించిపోతున్న భాషల రక్షణ, పరిరక్షణ సంస్థ తెలిపినది. వాటిలో అండమాన్ నికోబార్ దీవుల్లో సనెన్యో, సెంటిలీస్ తెగలకు సంబంధించి 11భాషలు, మణిపూర్ రాష్ట్రంలో మాట్లాడే ఐమొల్, జార్ఖండ్ బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మాట్లాడే బిరిజియా, హిమాచల్ ప్రదేశ్‌లో మాట్లాడే చినాలి, జార్ఖండ్ రాష్ట్రంలో 7514



మంది మాట్లాడే బీర్హోర్, అంతరించే దశలో ఉండటం బాధాకరం. ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలలో మాట్లాడే ఎరుకల భాష, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో మాట్లాడే కొండ దొర భాషలు, తెలంగాణలో గిరిజన తెగలు మాట్లాడే గోండు లాంటి గిరిజన భాషలు అంతరించిపోవడానికి దగ్గరలో ఉన్నాయి. ప్రపంచీకరణ, వలసవాదం ఫలితంగా పలు మాతృ భాషలు వేగంగా కనుమరుగవుతున్నాయి. భాషలు అంతరించి పోవడానికి ఆయా జాతుల సభ్యులు వారసత్వంగా వచ్చిన మాతృభాష నేర్చుకోకపోవడం ఒక కారణం. కొంతమంది ఆర్థిక పురోగతి ఆధునికతతో ముడిపడి ఉన్న ఆధిపత్య భాషలను నేర్చుకోవడానికి ఇష్టపడటంతో మాత భాషలు మనుగడ కోసం పోరాడుతున్నాయి. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లోని మణిపురి భాష సురక్షితం కాని భాషల జాబితాలో ఉండటం గమనార్హం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భాషల పరిరక్షణ కోసం అరకొర నిధులు కేటాయింపు కూడా పలు భాషలు అంతరించి పోవడానికి కారణం అవుతున్నాయి. 2015-19 ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు 26.10కోట్లు, అన్ని రాష్ట్రాల యూనివర్సిటీలకు రూ.10.35 కోట్లు అంతరించి పోతున్న భాషల రక్షణ, పరిరక్షణ సంస్థకు రూ.9.44 కోట్లు కేటాయించింది. నామమాత్రపు నిధులు విడుదల వల్ల వివిధ రాష్ట్రాలలో విశ్వవిద్యాలయాలు భాషల పరిశోధన కోసం నిఘంటువుల తయారీకోసం సమయాన్ని వెచ్చించ లేకపోతున్నాయి. అలాగే దేశంలో భాషల పరిరక్షణ కోసం ఏర్పడిన కేంద్ర పరిరక్షణ సంస్థకు ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించక పోవడం వల్ల అంతరించిపోతున్న భాషల అధ్యయనం కోసం పరిశోధనలు చేయలేకపోతున్నాయి.

మాతృభాష పరిరక్షణ ప్రథమ కర్తవ్యం

అమ్మ భాష మాత్రమే కాదు మహోన్నతం కూడా. మాతృభాషలో మాట్లాడ ట్లేదంటే నిన్ను నువ్వు గౌరవించుకోవడం లేదనే అర్థం. నీ గౌరవాన్ని, నీ బాల్యాన్ని, సంపదను తాకట్టు పెడుతున్నట్టే లెక్క. అన్య భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ మాతృభాషలో ప్రవీణుడు కాని వాడు విజ్ఞాన సముపార్జన చేయలేడు. మాతృభాషను కాపాడుకుంటూ దాని ద్వారానే తక్కిన భాషల్లో నేర్చుకోవడం అనంత విజ్ఞానాన్ని పొందటం సరైనమార్గం. ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు యునెస్కో లాంటి అంతర్జాతీయ సంస్థలు అంతరించిపోతున్న భాషలను కాపాడే ప్రయత్నాలు చేయాలి. తల్లి భాషను కాపాడే ప్రయత్నం భాష

> అమ్మ భాష మాత్రమే కాదు మహోన్నతం కూడా. మాతృభాషలో మాట్లాడ ట్లేదంటే నిన్ను నువ్వు గౌరవించుకోవడం లేదనే అర్థం. నీ గౌరవాన్ని, నీ బాల్యాన్ని, సంపదను తాకట్టు పెడుతున్నట్టే లెక్క అన్య భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ మాతృభాషలో ప్రవీణుడు కాని వాడు విజ్ఞాన సముపార్జన చేయలేడు. మాతృభాషను కాపాడుకుంటూ దాని ద్వారానే తక్కిన భాషల్లో నేర్చుకోవడం అనంత విజ్ఞానాన్ని పొందటం సరైనమార్గం. ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు యునెస్కో లాంటి అంతర్జాతీయ సంస్థలు అంతరించిపోతున్న భాషలను కాపాడే ప్రయత్నాలు చేయాలి.

విశ్వవిద్యాలయాలు చేస్తున్నప్పటికీ వాటికి తగిన నిధులు విడుదల కావడంలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న భాషలో పరిరక్షణ కోసం భాష యూనివర్సిటీలకు ఎక్కువ మొత్తంలో నిధులు విడుదల చేయాలి. అలాగే మన మాతృభాష అయిన తెలుగు భాషకు మాత్రమే మహత్తరమైన సాహిత్య సంపద ఉంది. గొప్ప కవులు రచయిత లెందరికో తెలుగునేల ఆలవాలం. తెలుగును అమితంగా ప్రేమించిన హాల్డేన్, అప్పయ్య దీక్షితులు, బ్రౌన్ వంటి వారి మాతభాష తెలుగు కాదు. మాతృభాషలో పట్టు సాధిస్తే ఇతర భాషలు నేర్చుకోవడం సులభమవుతుంది. బహు భాషల పుట్టినిల్లయిన మన భారతదేశంలో అమ్మ భాష వంటి మన తెలుగును కాపాడుకుంటూ అన్ని భాషలు నేర్చుకోవాలి. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠ ప్రణాళికలు రూపొందించి రానున్న కాలంలో అంతరించిపోయే భాషల్లో తెలుగు లేకుండా జాగ్రత్త పడాలి.

(ఫిబ్రవరి 21 అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం)

చాలా జాగ్రత్తగా ఉండాలి



శరీర భాగాలలో కండ్లు ముఖ్యమైనవి. వీటిని ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలి. కంటి సమస్యలు వస్తే మొదటికే మోసమొస్తుంది. ఇప్పుడున్న డిజిటల్ ప్రపంచంలో ఫోన్ల వాడకం, ల్యాప్‌టాప్, డెస్క్‌లాప్‌ల ముందు గంటల తరబడి కూర్చోవడంతో కంటి సమస్యలు ఎక్కువ తలెత్తుతున్నాయి. ఈ రోజుల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరికి కండ్ల అద్దాలు వస్తున్నాయి. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి.. ముఖ్యంగా కండ్ల ఆరోగ్యానికి ఈ గాడ్జెట్లు చాలా ప్రమాదకరమని రుజువవుతోంది. వాటి స్క్రీన్ లైట్ మన కండ్లకు హాని కలిగిస్తుంది. దీని వల్ల అన్ని రకాల సమస్యలు వస్తాయి. ఇలాంటి చెడు జీవనశైలి కారణంగా మన కండ్లు బలహీనంగా మారి కండ్ల మంట, దురద వంటి సమస్యలు మొదలై కంటిచూపు మందగించే అవకాశాలు కూడా ఎక్కువయ్యాయి. మరి కంటి చూపు మెరుగు పడాలంటే...

- ఉసిరి కండ్లకు ఇవి ఎంతో ప్రయోజనం కలిగిస్తాయి. ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. దీంతో కంటిచూపు పెరుగుతుంది. జామకాయ పొడి, మర్మాలాడ్, ఊరగాయ, ఉసిరి మిఠాయి వంటి జామకాయతో చేసిన పదార్థాలు కండ్లకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఉసిరికాయను రోజూ తీసుకోవడం ఎంతో మంచిది.
- కంటి చూపు మెరుగుపడాలంటే ఆకుకూరలు ఎక్కువగా తినాలి. పచ్చి కూరగాయలు కంటికి చాలా మేలు చేస్తాయి. వీటిలో విటమిన్ ఎ (కెరోటిన్), విటమిన్ "సి", విటమిన్ "బి" పుష్కలంగా లభిస్తాయి. పచ్చి కూరగాయల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఐరన్, లుటిన్ వంటి అంశాలు కంటి చూపును పెంచుతాయి.
- అవకాడోలో విటమిన్-ఇ పుష్కలంగా ఉంటుంది. దీన్ని తీసుకోవడం వల్ల కంటి రెటీనా బలపడుతుంది. మీ కండ్లు వృద్ధాప్యం వరకు ఆరోగ్యంగా ఉంటాయి.
- క్యారెట్‌లో బీటా కెరోటిన్ ఉంటుంది. ఇది కంటి చూపును పెంచుతుంది. క్యారెట్‌లో ఉండే విటమిన్ ఏ కండ్లకు చాలా మేలు చేస్తుంది.
- విటమిన్ సి, సిట్రిక్ యాసిడ్ నారింజ, నిమ్మ, ద్రాక్షపండు, జామపండులో పుష్కలంగా లభిస్తాయి. విటమిన్ సి కండ్లకు మేలు చేస్తుంది.
- బాదం, వాల్ నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ కంటి చూపును మెరుగుపరుస్తాయి. డ్రైఫ్రూట్స్ రోజూ తీసుకోవాలి. దీంతో కండ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

ఇట్ల చేద్దాం



చాలామంది క్యాబేజీని ఉడికించి కూర చేస్తారు. ఇలా ఉడికించినప్పుడు అందులో శరీరానికి మేలు చేసే గుణాలన్నీ వృథాగా పోతాయి. అందుకే దీన్ని ఉడికించేటప్పుడు నీళ్లలో నూనె లేదా కాస్త వెన్న వేయాలి. అప్పుడే పోషకాలు పోవు. క్యాబేజీని అతిగా ఉడికించినా, వేయించినా సల్ఫర్ విడుదలై దాని రుచి మారే ప్రమాదముంటుంది.

20 ఏండ్ల వయసులో ఆమెకు పెండ్లి చేయాలనుకున్నారు. చదువుకుని తన కాళ్ళపై తాను నిలబడ్డాకే పెండ్లి చేసుకోవాలని ఆమె బలమైన కోరిక. ఆమె కలను నిజం చేసేందుకు పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అండగా నిలిచింది. చదువుకునేందుకు తల్లిదండ్రులను ఒప్పించింది. ఇప్పుడు పోలీసుగా శిక్షణ పొందుతోంది. ఆమే బీహార్‌కు చెందిన అన్నూ కుమారి. యూత్ ఛాంపియన్ నుండి పోలీసు ఉమెన్ వరకు సాగిన ఆమె స్ఫూర్తిదాయక ప్రయాణం నేటి మానవిలో...

స్ఫూర్తి

యూత్ ఛాంపియన్ నుండి మహిళా పోలీసు వరకు



బీహార్‌లోని నవాడా జిల్లాలోని రాజౌలీ సబ్‌డివిజన్‌లోని అమవాస్ అనే మారుమూలం గ్రామంలో పుట్టింది అన్నూ కుమారి. ఆడపిల్లలకు చిన్నవయసులోనే పెండ్లి చేసి పంపించడం అక్కడి ఆచారం. కానీ అన్నూ మాత్రం ఇంకా చదువుకుంటానంది. చిన్న వయసులో పెండ్లి ఆలోచనను వ్యతిరేకించడమే కాకుండా తన చదువును కొనసాగించి తన కాళ్లపై నిలబడ్డ తర్వాతే పెండ్లి అని గట్టిగా నిర్ణయించుకుంది. ఇప్పుడు ఆమెకు 26 ఏండ్లు. పట్టుదల, కృషితో తన గ్రామానికి 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న బీహార్ పోలీస్ ట్రైనింగ్ అకాడమీలో పోలీసు కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతోంది.

> అన్నూ తన సంఘంలో, గ్రామంలో కనిపిస్తున్న మార్పుల గురించి సంతోషంగా చెబుతూ "నా తల్లిదండ్రులు నన్ను చూసి గర్విస్తున్నారు. గ్రామస్తులు కూడా. వారు ఇప్పుడు నన్ను వారి పిల్లలకు ఆదర్శంగా చూపిస్తున్నారు. వారు చదువుకోవాలని, కష్టపడి పనిచేయాలని, వారి కలలను సాకారం చేయాలని కోరుకుంటున్నారు" ఆమె చెప్పారు.

బాలికలకు చేరువైంది

యుక్తవయసులో అన్నూ తన గ్రామంలోని కిషోరి సమూహ్ (కౌమార సమూహం)లో ఛాంపియన్‌గా నిలిచింది. పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రారంభించబడిన కిషోరి సమూహ్ నవాడాతో పాటు దర్భంగాలోని బాలికలకు చేరువైంది. వారికి రుతుస్రావ సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, పోషకాహారం, ఆరోగ్యంపై శిక్షణ ఇచ్చింది. కాలక్రమేణా దర్భంగాలో 45 మంది యువజన ఛాంపియన్లు, నవాడలో 35 మంది సమావేశాలు నిర్వహించడం ప్రారంభించారు.

మొదట్లో ఇంత ధైర్యంగా లేదు

"నేను మా గ్రామంలో యూత్ ఛాంపియన్‌గా ఉన్నాను. ఆ సయంలోనే నా తల్లిదండ్రులు నాకు పెండ్లి చేయాలని మాట్లాడుకున్నారు. దాంతో నిరాశ చెందాను. వెంటనే షీలా దీదీ (షీలా దేవి, పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా బ్లాక్ కోఆర్డినేటర్)తో చెప్పాను. నేను జీవితంలో పెండ్లి చేసుకోవడాని కంటే ముందు ఏదైనా సాధించాలనుకుంటున్నాను" అన్ను చెప్పారు. షీలా దేవి తన గ్రామంలో కిషోరి సమూహ్ ఏర్పాటు సమయంలో అన్నూని కలిసింది. మొదట్లో అన్నూ ఇంత ధైర్యంగా మాట్లాడేది కాదని ఆమె గుర్తు చేసుకుంది. "మేము మొదటిసారి కలుసుకున్నప్పుడు తాన ఏం చేయాలనుకుంటుందో కచ్చితంగా చెప్పలేకపోయింది. కానీ నేను ఆమె సామర్థ్యాన్ని చూడగలిగాను. అయితే వందలాది మంది ఇతర అమ్మాయిల మాదిరిగానే ఆమెకు తన కుటుంబం నుండి మద్దతు లేదు. సమాజం వేసే సంకెళ్లను తెంచడానికి ప్రేరణ లేదు" అని షీలా దేవి చెప్పారు.



ఐదుగురు అమ్మాయిలతో ప్రారంభమై

ఈ గ్రామాలలోని ప్రజలు తమ ఆడపిల్లలను కిశోరీ సమూహ్ సమావేశాలకు ఎందుకు పంపాలని ప్రశ్నిస్తారు. ఈ ప్రశ్నే తల్లిదండ్రులను కూడా ఈ సమావేశాలకు ఆహ్వానించడానికి దారితీసింది. "మేము ముందు వారికి నేర్పిస్తాము. వారు ఏమి నేర్చుకోవాలనుకుంటున్నారో మేము వారిని అడుగుతాము. వారు ప్రశ్నలు అడగాలని, సమాధానాలు పొందాలని మేము కోరుకున్నాం. మేము దీన్ని ముందు ఐదుగురు అమ్మాయిలతో ప్రారంభించాం. మరుసటి నెలలో ఈ సంఖ్య పెరిగింది. ఈ యువతులలో వచ్చిన మార్పును గమనించిన తర్వాతనే గ్రామ ప్రజలు ఇతర అమ్మాయిలను కూడా మా సమావేశాలకు పంపించేందుకు ఒప్పుకున్నారు"అని షీలా జతచేస్తున్నారు.



కారణాల కోసం పోరాడడం

అన్నూకి పెండ్లి చేయాలని నిర్ణయించినపుడు ఆ గ్రామంలో మరో బాల్య వివాహం జరుగుతుంది. దాంతో బాల్య వివాహలపై పని చేయాలని అనుకున్నారు. ఇది కూడా ఆ ప్రాజెక్ట్‌లో భాగమైనందున అన్నూకు ఈ విషయాల గురించి అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే పెండ్లి చేసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ఆమెకు తెలుసు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి. ఆ పెండ్లిని సకాలంలో నిలిపివేసేలా చూసుకుంది. ఇంతలో అన్నూ తల్లిదండ్రులు ఆమె పెండ్లికి ప్లాన్ చేస్తున్నారు. కట్నం కోసం డిమాండ్లు వచ్చాయి. ఎవరైనా కట్నంగా రూ.10 లేదా 12 లక్షలు అడుగుతారని ఇది తనను ఆందోళనకు గురిచేసిందని ఆమె చెప్పింది. 10 లక్షలు కట్నంగా ఇవ్వడానికి సిద్ధపడితే తన చదువుకు, సంతోషానికి తప్పకుండా డబ్బు చెల్లిస్తానని తల్లిదండ్రులకు చెప్పి షీలాదేవి అన్నూకు మద్దతుగా నిలిచింది.

ఆమెకు స్వేచ్ఛనిచ్చింది

"నా తండ్రి చివరికి అంగీకరించారు. వివాహం చేయాలనే ఆలోచనను రద్దు చేసుకున్నాడు" ఆమె చెప్పింది. వెంటనే అన్నూ మగధ్ యూనివర్శిటీ నుండి బి.ఎస్సీ (ఆనర్స్) చదువు కొనసాగించారు. ఆమె సైకిల్ తొక్కడం నేర్చుకున్న తర్వాత తండ్రి ఆమెకు ఒక బైక్ కొన్నాడు. ఇది ఆమెకు స్వేచ్ఛను ఇచ్చింది. "ఒక రోజు నేను హెల్మెట్ లేకుండా బైక్ నడుపుతున్నాను. నన్ను ఓ పోలీసు ఆపి జరిమానా విధించింది. ఒక మహిళా పోలీసు ఇంత దగ్గరగా చూడటం అదే మొదటిసారి. అప్పుడే నేను అనుకున్నాను, నేను కూడా పోలీసు ఎందుకు కాలేను?" అంటూ ఆమె గుర్తుచేసుకున్నారు.

త్వరలో ఇన్‌స్పెక్టర్‌గా...

అన్నూ తన మూడవ ప్రయత్నంలో ఉత్తీర్ణత సాధించి పోలీసు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. "నేను కానిస్టేబుల్‌గా శిక్షణ పొందుతున్నాను. నా పోస్టింగ్ నాకు డెస్క్, ఫీల్డ్ డ్యూటీల కలయికను ఇస్తుందని ఆశిస్తున్నాను. ఇది నేను త్వరలో దరోగా (ఇన్‌స్పెక్టర్) కావడానికి చదువుకోవడానికి వీలు కల్పిస్తుంది" అని ఆమె చెప్పింది. భారతదేశంలోని మారుమూల గ్రామాలలోని యువతులకు సాధికారత కల్పించే సంస్థ ప్రయాణంలో భాగంగా పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కిశోరీ సమూహ్ అండగా నిలిచిన ఎంతో మంది అమ్మాయిల కథలలో అన్నూ కథ ఒకటి.



విద్య అంటే...

సీనియర్ స్పెషలిస్ట్, పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా స్టేట్ హెడ్ పరిమల్ చంద్ర మాట్లాడుతూ "నవాడా జార్ఖండ్‌కు చాలా దగ్గరగా ఉంటుంది. శివార ప్రాంతాలలో నివసిస్తూ చాలా తక్కువ అవకాశాలు ఉన్న గిరిజన సంఘాలు అక్కడ ఉన్నాయి. ఈ యువతులకు నేర్పించడం చాలా అవసరం. విద్య అంటే వారు పాఠశాలకు వెళ్లడం, బాల్య వివాహాలకు దూరంగా ఉండడం, ఉద్యోగాలు సంపాదించడం, ఆరోగ్యంగా ఉండడం. ఈ యూత్ ఛాంపియన్‌లు గ్రామ ఆరోగ్యం, పోషకాహార శానిటైజేషన్ సంఘంలో కూడా ఒక భాగం. గ్రామ స్థాయిలో ఆరోగ్య నాణ్యతను మెరుగుపరచడానికి మేము జన సంవాద్‌ను నిర్వహించాము" అని ఆయన చెప్పారు.

- సలీమ

అదానీ రుణాలు అక్రమాల పుట్ట

- అదానీ గ్రీన్ ఎనర్జీలో నార్వేకు చెందిన కేఎల్‌పీ పెట్టుబడులు
- కాలుష్యం వెలువడే పనులకు 'అదానీ' వాడుతోందని కేఎల్‌పీ ఆందోళన

హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడ్డాక ప్రపంచ వ్యాప్తంగా 'అదానీ కంపెనీ'ల్లో పెట్టుబడులు పెట్టిన స్టాక్‌మార్కెట్ ఫండింగ్ సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. హిండెన్‌బర్గ్ విమర్శనాత్మక నివేదిక (జనవరి 24న వెలువడింది)లో పేర్కొన్న ఆరోపణలు, అక్రమాలు, అనుమానాలు..తేలిగ్గా తీసిపారేసేవి కాదు. స్టాక్ మార్కెట్‌లో అదానీ కంపెనీల షేర్లను కృత్రిమంగా పెంచారన్నది ప్రధాన ఆరోపణ. కంపెనీ నిర్వహణలో పచ్చి మోసపూరిత విధానాలన్నాయి, భారీగా పెరిగిన షేర్ల విలువను చూపించి..వేల కోట్లు రుణాలు తీసుకుందన్నది 'హిండెన్‌బర్గ్' నివేదిక సారాంశం. ఈ నివేదిక బయటకు వచ్చాక అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు పెట్టిన అమెరికా, యూరప్ స్టాక్‌మార్కెట్ ఫండింగ్ సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి.



న్యూఢిల్లీ : అదానీకి చెందిన అదానీ గ్రీన్, అదానీ టోటల్ గ్యాస్..మొదలైన కంపెనీలకు 'ఈఎస్‌జీ' మార్కెట్ ద్వారా పెట్టుబడులు సమకూరాయి. ఈ పెట్టుబడులను బొగ్గు తవ్వకాలకు, బొగ్గు ద్వారా విద్యుత్ ఉత్పత్తికి అదానీ కంపెనీ వాడుతోందని 'హిండెన్‌బర్గ్' నివేదికతో బహిర్గతమైంది. దాంతో అదానీలో పెట్టుబడులు పెట్టిన ఈఎస్‌జీ ఇన్వెస్టర్స్ రిస్క్‌లో పడ్డారు. నార్వేకు చెందిన అతిపెద్ద పెన్షన్ ఫండ్ 'కేఎల్‌పీ'దీ దాదాపు ఇదే పరిస్థితి. కాలుష్యం వెలువడే, సమాజానికి, పాలనారంగాలకు హాని తలపెట్టే ప్రాజెక్టులను చేపట్టమని హామీ ఇస్తేనే ఒక కంపెనీ షేర్లను 'ఈఎస్‌జీ మార్కెట్స్' కొనుగోలు చేస్తుంది. ఈ నమ్మకాన్ని అదానీ గ్రూప్ వమ్ముచేసిందని వార్తలు వెలువడ్డాయి. అదానీ గ్రూప్ కంపెనీల ఆర్థిక వ్యవహారాలు బయటపడ్డాక, స్టాక్‌మార్కెట్ 'డౌజోన్స్' సూచిక నుంచి అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ను తొలగిస్తున్నట్టు ఈఎస్‌జీ, క్లయిమెట్ ఇండెక్స్‌లు, ఎస్ అండ్ పీ గ్లోబల్...ప్రకటించాయి. అదానీకి చెందిన మరో ఐదు కంపెనీల పేర్లను తమ 'పెట్టుబడుల జాబితా' నుంచి తొలగిస్తున్నట్టు కేఎల్‌పీ జనవరి 30న నిర్ణయించింది.

బొగ్గు గని ప్రాజెక్ట్ పనులు

అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌లో పెద్ద ఎత్తున షేర్లను కొనుగోలు చేసింది. పెద్ద మొత్తంలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలకు 'గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్' నిధులు వాడుతున్నారని తెలిసి 'కేఎల్‌పీ' అవాక్కయ్యింది. ఈ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ షేర్లను ష్యూరిటీ చూపి..అదానీ సంస్థ రుణాలు సేకరించిందన్న విషయం ఫిబ్రవరి 10న బయటకొచ్చింది. ఈ నిధులను ఉపయోగించి అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఆస్ట్రేలియాలోని 'కార్మికాయెల్ బొగ్గు గని' పనులు ప్రారంభించింది. అత్యంత తక్కువ వడ్డీతో ఎస్‌బీఐ నుంచి బొగ్గు గని ప్రాజెక్టుకు అదానీ సంస్థ వేల కోట్ల రుణాలు సేకరించింది. ఈ విషయం తెలిసాక..కేఎల్‌పీ సంస్థ అధికారులు మండిపడుతున్నారు. కేఎల్‌పీ ఇన్వెస్టింగ్ హెడ్ మాట్లాడుతూ, "బొగ్గు పరిశ్రమలకు ఫండింగ్ నిషేధించాం. కార్మికాయెల్ బొగ్గు గనికి అదానీ పెట్టుబడులు తరలిస్తే..మా నిబంధనల్ని ఉల్లంఘించినట్టే"నని అన్నారు.

పర్యావరణ, సామాజిక హితం, ప్రభుత్వ పాలనతో సంబంధమున్న వాటికి మాత్రమే తమ నిధులు వాడాలన్నది 'ఈఎస్‌జీ మార్కెట్' ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్యానికి విరుద్ధంగా బొగ్గు తవ్వకాలకు, కాలుష్యం వెదజల్లే ప్రాజెక్టుకు నిధులు తరులుతున్నాయని తెలిసి ఈఎస్‌జీ, కేఎల్‌పీ ఇన్వెస్టర్స్ ఆగ్రహంతో ఉన్నారు. "అదానీ గ్రూప్ పెట్టుబడులు కార్మికాయెల్ బొగ్గు తవ్వకాలకు తరలివెళ్లాయి" అని 2020 నుంచీ అదానీ గ్రూప్ వ్యవహారాల్ని పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుడు ఎర్లాండ్‌స్సాన్ చెప్పారు. యూరోపియన్ యూనియన్‌లో 'ఈఎస్‌జీ' లక్ష్యాలను ప్రోత్సహిస్తున్న స్టాక్‌మార్కెట్ ఫండ్స్ 500కు పైగా ఉన్నాయి. ఈ ఫండ్స్ అన్నీ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లను కొనుగోలు చేసినట్టు 'బ్లూమ్‌బర్గ్' తెలిపింది. అంతర్జాతీయంగా వీటి విశ్వసనీయత ఇప్పుడు దెబ్బతిన్నది.

రిస్క్.. రుణాలిచ్చిన బ్యాంక్‌దే : ఎర్లాండ్‌స్సాన్

అంతర్జాతీయంగా పేరొందిన సంస్థలు అదానీ కంపెనీల షేర్లను కొనుగోలు చేశాయి. పెద్ద మొత్తంలో షేర్లను కలిగివున్న సంస్థలు రిస్క్‌లో పడ్డట్టే. ఇందులో మరో ముఖ్య విషయం ఏమంటే, అదానీ గ్రీన్ స్టాక్స్‌ను చూపి ఎస్‌బీఐ నుంచి పెద్ద మొత్తంలో రుణాలు సేకరించటం. షేర్ల అత్యధిక విలువను పరిగణలోకి తీసుకొని బ్యాంక్ అతితక్కువ వడ్డీతో రుణాలు ఇచ్చింది. బొగ్గు గని ప్రాజెక్ట్‌లో క్రెడిట్ రిస్కును తగ్గించటంలో 'గ్రీన్ స్టాక్స్' ఉపయోగపడ్డాయి. ఇప్పుడు అదానీ గ్రీన్ స్టాక్ ధర 70శాతం పడిపోయింది. బ్యాంక్ ఇచ్చిన వేల కోట్ల రుణం 'రిస్క్'లో పడ్డట్టే !

అదానీ 25వ స్థానానికి పతనం

50 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔట్ ..ఫోర్బ్స్ వెల్లడి

తీవ్ర ఆర్థిక మోసాల ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతం అదాని సంపద క్రమంగా హరించుకుపోతోంది. హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో అదానీ కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో రోజురోజుకు బొక్కబోర్ల పడుతున్నాయి. దీంతో అదాని సంపద లక్షల కోటు ఆవిరవుతోంది. వరుస పతనంతో అదాని సంపద తాజాగా 50 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.3.9 లక్షల కోట్లు)కు పడిపోయిందని ఫోర్బ్స్ సోమవారం వెల్లడించింది. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో అదానీ స్థానం 25కు పడిపోయిందని ఫోర్బ్స్ రియల్‌టైం బిలియనీర్ ఇండెక్స్ తెలిపింది. గుజరాత్‌కు చెందిన ఈ పెట్టుబడిదారుడు నెల క్రితం 147 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.12 లక్షల కోట్ల పైగా) సంపదతో ప్రపంచంలోనే రెండో స్థానంలో, ఆసియాలో అతిపెద్ద కుబేరుడిగా ఉన్నారు. ముకేశ్ అంబానీ ప్రపంచంలో 85 బిలియన్ డాలర్ల సంపదతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. అదానీ కంపెనీలు తీవ్ర ఎకౌంట్స్ మోసాలకు, కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకుంటున్నాయని హిండెన్‌బర్గ్ తన రిపోర్ట్‌లో వెల్లడించిన విషయం తెలిసిందే. ఆ దెబ్బకు అదానీపై జాతీయ, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు విశ్వాసాన్ని కోల్పోయారు. దీంతో అదానీ గ్రూపు కంపెనీల్లోని షేర్లను కొనడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఈ ప్రభావంతో ఆ స్టాక్స్ విలువ నెల రోజులుగా క్రమంగా పడిపోతోంది.

అప్పులిస్తునే ఉంటాం : బీఓబీ

అదానీ కంపెనీల పరపతిపై తీవ్ర అనుమానాలు, ఆరోపణలు చోటు చేసుకుంటున్న క్లిష్ట సమయంలోనూ విత్త సంస్థలు అప్పులివ్వడానికి ముందుకు రావడం గమనార్హం. అదాని గ్రూపునకు మరిన్ని అప్పులిస్తామని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎండీ సంజీవ్ చద్దా పేర్కొన్నారు. పూచీకత్తు ప్రమాణాలు కచ్చితంగా పాటిస్తే రుణాలు ఇచ్చేందుకు అభ్యంతరం లేదన్నారు. అయితే ఇప్పటి వరకు అదానీ కంపెనీలకు బీఓబీ ఎంత అప్పులిచ్చిందనే విషయాన్ని ఆయన వెల్లడించకపోవడం విశేషం.

కేరళలో తప్ప మరెక్కడా ...

(మొదటిపేజీ తరువాయి)

అసెంబ్లీకి బీజేపీకి చెందిన హర్షవర్ధన్ బాజ్‌పేయి ఎన్నికను అనర్హతగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం విచారించింది. దేశంలో ఎన్నికల విషయానికి వస్తే, అభ్యర్థుల విద్యార్హతలు కేరళ రాష్ట్రంలో తప్ప, మిగతా ఎక్కడా ఉండవని సుప్రీం కోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. చాలా మంది ఓటర్లు ఓటు వేసే ముందు అభ్యర్థి విద్యార్హత గురించి చూడరని ధర్మాసనం పేర్కొంది. "మన దేశంలో విద్యార్హతల ఆధారంగా ఎవరూ ఓటు వేయరు" అని జస్టిస్ జోసెఫ్ అన్నారు. వెంటనే "కేరళలో తప్ప" అని జస్టిస్ నాగరత్న జోడించారు. 2007, 2012, 2017 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు తన నామినేషన్ పత్రాలతో పాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లలో తన సరైన విద్యార్హతలు, బాధ్యతలను వెల్లడించకుండా బాజ్‌పేయి అవినీతి చర్యలకు పాల్పడ్డారని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అనుగ్రహ్ నారాయణ్ సింగ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2017లో ఇంగ్లాండ్‌లోని 'షెఫర్డ్' అనే నాన్-ఇంగ్లాండ్ యూనివర్సిటీ నుంచి బీటెక్ పట్టా పొందినట్లు బాజ్‌పేయి చెప్పారని, అయితే 2007, 2012లో తాను ఇంగ్లాండ్‌లోని షెఫీల్డ్ యూనివర్సిటీ నుంచి బీటెక్ పట్టా పొందినట్లు చూపించారని పిటిషన్ లో పేర్కొన్నారు. బాజ్‌పేయి 2006లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎంటీఏ డిగ్రీని కలిగి ఉన్నారని కూడా పేర్కొన్నారనీ, అయితే ఆయన అదే సంవత్సరం బీటెక్ పరీక్షలో ఉత్తీర్ణుడైనట్లు తెలిపారు.

ఎన్‌పీఎస్‌కు నిధులివ్వం

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ అనంతర చర్చల్లో నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. "జాతీయ పింఛను విధానం కింద ఉద్యోగుల ఈపీఎఫ్‌వో నుంచి జమ అయిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం తిరిగివ్వాలని రాష్ట్రాలు చెబుతున్నాయి. ఇలాంటి అంచనాలేమైనా రాష్ట్రాలకు ఉంటే.. అది సాధ్యపడదని చెబుతున్నా. ఆ డబ్బుపై అధికారం ఉద్యోగులదే. ఆ డబ్బులకు వడ్డీ వస్తుంది. పదవీ విరమణ తర్వాతే ఆ డబ్బు ఉద్యోగుల చేతికి వస్తుంది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వాల చేతికి ఇవ్వడం అనేది కుదరని పని" అని మీడియాతో మాట్లాడుతూ నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. దీనిపై ఆర్థికశాఖ కార్యదర్శి వివేక్ జోషి కూడా మాట్లాడారు. కొన్ని రాష్ట్రాలు పాత పింఛను విధానాన్ని అమలు చేయడం, కేంద్రం కూడా అదే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేయడం మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు. "ఎన్‌పీఎస్ నిధుల్లో తమ వాటా సొమ్మును వెనక్కి ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ప్రస్తుతమున్న చట్టపరమైన నిబంధనల ప్రకారం ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇవ్వడం కుదరదు" అని తేల్చిచెప్పారు. జాతీయ పింఛను విధానం లేదా పాత పింఛను విధానంలో దేన్ని ఎంచుకోవాలనేది రాష్ట్రాల పరిధిలోని అంశమని కేంద్రం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించిన విషయం విదితమే. జాతీయ పింఛను విధానాన్ని దేశంలో కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాయి. పంజాబ్ కూడా ఇదే బాటలో నడిచేందుకు సిద్ధమైంది.

నిధులివ్వకుంటే సుప్రీంకు వెళ్తాం : రాజస్థాన్ సీఎం

అదానీ గ్రూప్ షేర్లు భారీగా పతనమైన నేపథ్యంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్‌పీఎస్ నిధులను కేంద్రం షేర్ మార్కెట్లలో పెట్టి.. ఉద్యోగులను గాలికి వదిలేయడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌పీఎస్ నిధులను తిరిగిఇవ్వాలని, లేదంటే సుప్రీంకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ఆర్థికమంత్రి దీనిపై స్పష్టతనిచ్చారు.

పర్యావరణ ముప్పులో భారత్ నుంచి తొమ్మిది రాష్ట్రాలు : నివేదిక

న్యూఢిల్లీ : వాతావరణ మార్పుల వలన పర్యావరణం దెబ్బతినే ప్రమాదంలో ఉన్న ప్రపంచలోని టాప్ 50 ప్రాంతాలలో భారత్ నుంచి పలు రాష్ట్రాలు ఉన్నాయి. ఇందులో బీహార్, యూపీ, మహారాష్ట్ర, పంజాబ్‌తో సహా తొమ్మిది రాష్ట్రాలు ఉన్నాయి. కొత్త ప్రచురించిన ఎక్స్‌డీఐ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. విశ్లేషణ ప్రకారం.. 2050లో అత్యంత ప్రమాదంలో ఉన్న టాప్ 50 రాష్ట్రాలు, ప్రావిన్సులలో యూఎస్, భారత్‌ల నుంచి అధికంగా ఉన్నాయి. ఉన్నాయి. భారత్ నుంచి బీహార్ (22వ స్థానం), యూపీ (25), అసోం (28), రాజస్థాన్ (32), తమిళనాడు (36), మహారాష్ట్ర (38), గుజరాత్ (48), పంజాబ్ (50) లు ఉన్నాయి. 1990తో పోలిస్తే 2050 నాటికి అసోం గరిష్టంగా 330 శాతం పెరుగుదలను చూస్తుంది. పాకిస్తాన్ కూడా సింధ్ ప్రావిన్స్‌తో సహా టాప్ 100లో అనేక ప్రావిన్సులను కలిగి ఉన్నది. గతేడాది జూన్-ఆగస్టు మధ్య సంభవించిన వినాశకరమైన వరదుల పాకిస్థాన్‌లోని 30 శాతం ప్రాంతంపై ప్రభావాన్ని చూపిన విషయం తెలిసిందే. సింధ్ ప్రావిన్స్‌లోనే తొమ్మిది లక్షలకు పైగా ఇండ్లు పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతిన్నాయి. యూఎస్‌లో ఆర్థికంగా ముఖ్యమైన కాలిఫోర్నియా, టెక్సాస్, ఫ్లోరిడా రాష్ట్రాలు ఎక్కువగా ప్రభావితమవుతాయి. టాప్-50లో ఉన్న బహుళ ప్రావిన్సులు, రాష్ట్రాలతో ఉన్న ఇతర దేశాల్లో పాకిస్థాన్, ఇండోనేషియాలు ఉన్నాయి. ఐరోపా నుంచి లండన్, మిలన్, మ్యూనిచ్, వెనిస్ వంటి ప్రముఖ నగరాలు ఉన్నాయి.

జాన్ బ్రిట్టాస్‌కు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు

న్యూఢిల్లీ : సీపీఐ(ఎం) రాజ్యసభ జాన్ బ్రిట్టాస్ ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సంసద్ రత్న అవార్డు వరించింది. అలాగే మరో సీపీఐ(ఎం) మాజీ ఎంపీ టికె రంగరాజన్ కు ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. రాజ్యసభ, లోక్‌సభల్లో ప్రశ్నలు, ప్రయివేట్ బిల్లులు, చర్చలలో పాల్గొనడం, జోక్యాలతో సహా పార్లమెంటరీ కార్యక్రమాలలో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా సంసద్ రత్న అవార్డును అందజేస్తారు. పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ నేతృత్వంలోని జ్యూరీ ఈ అవార్డులను సోమవారం ప్రకటించింది. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టిఎస్ కృష్ణమూర్తి కో-చైర్మెన్‌గా ఉన్నారు. మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆధ్వర్యంలో ప్రారంభించిన పార్లమెంటరీ అవార్డును ప్రైమ్ పాయింట్ ఫౌండేషన్ అమలు చేస్తోంది.

రాజ్యసభలో ముగ్గురు ఎంపీలు సంసద్ రత్న అవార్డులకు ఎంపిక కాగా, మొదటగా జాన్ బ్రిట్టాస్ పేరు వచ్చింది. ఎంపీగా పనిచేసిన తొలి ఏడాదిలోనే బ్రిట్టాస్‌కి సంసద్ రత్న అవార్డుల జాబితాలో చోటు దక్కడం విశేషం. జాన్ బ్రిట్టాస్ (సీపీఐ(ఎం) కేరళ)తో పాటు మనోజ్ కుమార్ ఝూ (ఆర్జేడీ, బీహార్), ఫౌజియా తహసీన్ అహ్మద్ ఖాన్ (ఎన్సీపీ, మహారాష్ట్ర)లకు సంసద్ రత్న అవార్డులు సిట్టింగ్ సభ్యుల విభాగంలో లభించాయి. రిటైర్డ్ విభాగంలో ఎంపీలు విశ్వంభర ప్రసాద్ నిషాద్ (ఎస్పీ, ఉత్తరప్రదేశ్), చాయా వర్మ (కాంగ్రెస్, ఛత్తీస్‌గఢ్)కు అవార్డులు వరించాయి. లోక్‌సభ ఎంపీలు బిద్యుత్ బరన్ మహతో (బీజేపీ, జార్ఖండ్), సుకాంత మజుందార్ (బీజేపీ, పశ్చిమ బెంగాల్), కుల్దీప్ రాయ్ శర్మ (కాంగ్రెస్, అండమాన్ నికోబర్ దీవులు), హీనా విజయకుమార్ గావిట్ (బీజేపీ, మహారాష్ట్ర), అధిర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్, పశ్చిమ బెంగాల్), గోపాల్ చినయ్య శెట్టి (బీజేపీ, మహారాష్ట్ర), సుధీర్ గుప్తా (బీజేపీ, మధ్యప్రదేశ్), అమోల్ రామ్ సింగ్ కోలీ (ఎన్సీ, మహారాష్ట్ర)లకు సంసద్ రత్న అవార్డులు దక్కాయి.

సీపీఐ(ఎం) మాజీ ఎంపీ టికె రంగరాజన్ కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

సీపీఐ(ఎం) మాజీ ఎంపీ టికె రంగరాజన్‌కు ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. ఆయన రెండు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారని జ్యూరీ తెలిపింది. స్టాండింగ్ కమిటీ విభాగంలో వైసీపీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి చైర్మెన్‌గా ఉన్న రాజ్యసభ ట్రాన్స్‌పోర్ట్, టూరిజం, కల్చరల్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి, బీజేపీ ఎంపీ జయంత్ సిన్హా చైర్మెన్‌గా ఉన్న లోక్‌సభ ఆర్థిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి అవార్డులు దక్కాయి. మార్చి 25న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు.

బీఆర్ఎస్‌లో ఎలా చేరాలి?

- మహారాష్ట్ర అభిమాని ట్వీట్‌కు స్పందించిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో ఎలా చేరాలంటూ మహారాష్ట్రకు చెందిన సగర్ వరదే అనే వ్యక్తి చేసిన ట్వీట్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. దేశవ్యాప్తంగా జరిగే బీఆర్ఎస్ బహిరంగ సభలు, కార్యక్రమాల్లో నేరుగా పాల్గొని సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని సూచించారు. తన చిరునామా, ఇతర వివరాలు నేరుగా పంపమని కోరారు.

ఎంఎస్‌సీఎస్ వద్దు



సహకార సంఘాలపై కేంద్రం తీరు సరికాదు

- రాష్ట్రాల అధికారాల్లో జోక్యం
- ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్న మోడీ సర్కారు
- కేరళ ప్రభుత్వం నుంచి తీవ్ర వ్యతిరేకత

తిరువనంతపురం : దేశంలో సహకారం సంఘాలపై పెత్తనం చలాయించాలని చూస్తున్న కేంద్రం తీరును కేరళ సర్కారు తప్పుబట్టింది. కేంద్రం గతంలో చేసిన సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు ప్రకటనను వ్యతిరేకించింది. మోడీ సర్కారు సమాఖ్య స్ఫూర్తిని ఉల్లంఘిస్తున్నదని ఆరోపించింది. వాస్తవానికి సహకార సంఘాలు అనేది రాష్ట్ర జాబితాలోని అంశం. భారత రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌లో రాష్ట్ర జాబితాలో ఉన్న 32 అంశాల్లో సహకార సంఘాలు అనేవి ఒకటి. దీంతో మంత్రిత్వ శాఖ ఏర్పాటుతో సహకార సంఘాలను తన చేతిలోకి లాక్కోవాలని మోడీ సర్కారు యోచిస్తున్నదని నిపుణులు, విశ్లేషకులు ఆరోపించారు. రాష్ట్ర జాబితాలో కేంద్రం వేలు పెట్టాలనుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని తెలిపారు.

2021-22 బడ్జెట్ ప్రసంగంలో బహుళరాష్ట్ర సహకార సంఘాలు (ఎంఎస్‌సీఎస్) గురించి ప్రకటన వచ్చింది. కేంద్రం సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటుపై 2021, జులైలో ప్రకటన చేసింది. దీంతో ఎంఎస్‌సీఎస్‌పై కేంద్రం తీరును అప్పటి నుంచి అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి. ముఖ్యంగా వందేండ్లుగా సహకార సంఘాలను విజయవంతంగా నడుపుతున్న కేరళ రాష్ట్రం మోడీ సర్కారు ఎత్తులను ఆది నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం

బహుళ రాష్ట్ర సహకార సంఘాల (సవరణ) బిల్లు, 2022 ను లోక్‌సభలో గతేడాది డిసెంబర్ 7న ప్రవేశపెట్టారు. బడ్జెట్ సెషన్ రెండో భాగంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ నివేదికను ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఉన్న చట్టానికి అనేక సవరణలతో ఈ బిల్లును తీసుకొచ్చారు. ఏదైనా సహకార సంఘం ఉనికిలో ఉన్న ఎంఎస్‌సీఎస్‌లో కలిసేలా ఈ బిల్లు దారి కల్పిస్తుంది. అలాగే కేంద్రం సహకార ఎన్నిక యంత్రాంగంను ఏర్పాటు చేస్తుంది.

రాష్ట్రాలను సంప్రదించలేదు

కేంద్రం చేస్తున్న ఈ చర్యనే కేరళ వద్దంటున్నది. రాష్ట్రాల అధికారాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటున్నదని కేరళ సహకార మంత్రి వి.ఎన్ వాసవన్ అన్నారు. 'ఒకే దేశం, ఒకే భాష' తర్వాత బీజేపీ 'ఒకే దేశం, ఒకే రిజిస్ట్రేషన్' విధానాన్ని తీసుకురావాలని యోచిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రాల హక్కులను లాక్కోవడమే దీని ఉద్దేశమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సహకార రంగం అనేది రాష్ట్ర జాబితాలో ఉన్న అంశమైనప్పటికీ.. కేంద్రం రాష్ట్రాలను సంప్రదించలేదని విజయన్ సర్కారు ఆరోపించింది. సమాఖ్య స్ఫూర్తి, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కేంద్ర మంత్రి డిపార్ట్‌మెంట్ కార్యదర్శి, రిజిస్ట్రార్‌కు నేరుగా ఆదేశాలు ఇచ్చారని వాసవన్ ఆరోపించారు.

ఎంఎస్‌సీఎస్ రాజ్యాంగానికి విరుద్ధం

బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టం, 1984 అమలులోకి వచ్చిన తర్వాత ఎంఎస్‌సీఎస్ ఉనికిలోకి వచ్చింది. ఎంఎస్‌సీఎస్‌పై కేరళ ఆందోళనను వెలిబుచ్చింది. ఈ సొసైటీలు ఇతర విధులతో పాటు నిధులను సేకరించేందుకు, వడ్డీరేట్లను స్వతంత్రంగా నిర్ణయించడానికి అధికారం కలిగి ఉంటాయని కేరళ మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లేదా సహకార విభాగం ఇలాంటి సొసైటీలను నియంత్రించలేవనీ, అది తప్పుడు నిర్వహణకు దారి తీస్తుందని, ప్రజలు తమ కష్టార్జితాన్ని కోల్పోతారని తెలిపారు. ఎంఎస్‌సీఎస్ అనేది రాజ్యాంగానికి విరుద్ధమని నిపుణులు అన్నారు.

కేరళ ఎందుకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది?

కేరళ ఒక బలమైన సహకార వ్యవస్థకు పేరు గాంచింది. 1910 నుంచి వందేండ్లకు పైగా చరిత్రను కలిగి ఉన్నది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ముందు కూడా ట్రావెన్‌కోర్ (1914), కొచిన్ (1913), మలబార్ (1932) ప్రాంతాల్లోనూ సహకార చట్టాలు ఉండేవి. ప్రస్తుతం కేరళలో మొత్తం 941 పంచాయతీలలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) 1607, మత్స్యకార సంఘాలు 1562 ఉన్నాయి. అలాగే, 23,167 సహకార సంఘాలు ఉన్నాయి. రాష్ట్రంలోని ఉరాలుంగల్ కార్మిక ఒప్పంద సహకార సంఘం (యూఎస్‌సీసీఎస్), బ్రహ్మగిరి డెవలప్‌మెంట్ సొసైటీ (బీడీస్), కేరళ రాష్ట్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (కేరళ బ్యాంకు), ఎస్సీ, ఎస్టీ సహకార సంఘం, వనిత సహకార సంఘాలు వంటివి చాలా విజయవంతంగా నడుస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రజల ద్వారా నడుస్తున్న ఈ సహకార వ్యవస్థను కేంద్రం నాశనం చేయాలని, స్వార్థ ప్రయోజనాలను రుద్దాలని ప్రయత్నిస్తున్నదని వాసవన్ అన్నారు. కేంద్ర సహకార శాఖ నిర్ణయాలను, దానితో కలిగే ముప్పు దృష్ట్యా వ్యతిరేకించాలని తెలిపారు.

దేశాన్ని 'రాజ్యాంగాన్ని రక్షించండి'

అదానీ-మోడీ సర్కారుకు వ్యతిరేకంగా భారీ ర్యాలీ



కోజికోడ్ : 'దేశాన్ని రాజ్యాంగాన్ని రక్షించండి.. అదానీ-మోడీ సర్కారుకు బుద్ధి చెప్పండి' అంటూ భారీ ర్యాలీ కేరళలోని కోజికోడ్‌లో నిర్వహించారు. కోజికోడ్‌లోని కెల్యూట్టన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రసంగించారు. మోడీ, అదానీ గ్రూపు భారత జాతీయ జాతీయ వాదం పేరుతో అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. 2002లో గుజరాత్ మతమారణ హోమంపై బిబిసి డాక్యుమెంటరీ నిజాలను మరోసారి వెలికితీసిందన్నారు. ఈ రెండు సందర్భాల్లోనూ జాతీయ వాదం పేరుతో మాట్లాడుతున్నారని విమర్శించారు.

కేరళలో 'పీపుల్స్ రెసిస్టన్స్ ర్యాలీ' ప్రారంభం

కేరళ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ నేతృత్వంలో సాగే ది పీపుల్స్ రెసిస్టన్స్ ర్యాలీ సోమవారం ప్రారంభమయింది. కసర్‌గాడ్ జిల్లాలోని కుంబ్లాలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఎంవి గోవిందన్ నేతృత్వంలో వచ్చే నాలుగు వారాల పాటు కేరళలోని అన్ని జిల్లాల మీదుగా ఈ యాత్ర సాగుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, మతతత్వానికి వ్యతిరేకంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. యాత్ర ప్రారంభంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

బెంగాల్ ఉద్యోగుల 48 గంటల పెన్‌డౌన్

- డీఏ పెంచాలని రాష్ట్రవ్యాప్త నిరసన ప్రారంభం




కొల్‌కతా : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా డిఎ పెంచాలని డిమాండ్ చేస్తూ పశ్చిమబెంగాల్ ఉద్యోగులు 48 గంటల పెన్‌డౌన్‌ను సోమవారం ప్రారంభించారు. పెన్‌డౌన్‌లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామన్న రాష్ట్ర ప్రభుత్వ బెదిరింపులను లెక్క చేయకుండా ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల ఐక్య పోరాట వేదిక 'సంగ్రామి జౌతా మంచా' పిలుపుతో ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొంటున్నారు. రైటర్స్ బిల్డింగ్‌లోని వివిధ శాఖల ఉద్యోగులతో పాటు నూతన సచివాలయం, కోర్టులు, పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర రాజధానితోపాటు సియురి, బీర్భూం, మేదినీపూర్, నదియా, మాల్దా, ముర్షిదాబాద్, హౌరా, హుగ్లీ తదితర జిల్లాల ఉద్యోగులు పెన్‌డౌన్‌లో పాల్గొన్నారు. 'కరువు భత్యం క్రమబద్ధీకరణ, అవినీతి రహిత నియామకాల కోసం పెన్‌డౌన్ చేస్తున్నాం. డిఎ మూడు శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మేం దిగ్భ్రాంతికి గురయ్యాం. మేం మా ఆందోళనను కొనసాగిస్తాం' అని ఉద్యోగులు చెప్పారు. ఉద్యోగులకు మూడు శాతం డిఎ పెంచుతున్నట్లు ఈ నెల 15న బడ్జెట్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. 'ఈ పెంపును మేం అంగీకరించం. మేం బిచ్చగాళ్లం కాదు. మా అర్హత ప్రకారం మేం డిమాండ్ చేస్తున్నాం. మేం వెనక్కి తగ్గం' అని ఉద్యోగులు తేల్చిచెప్పారు. మరోవైపు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, గత కొన్ని రోజులుగా కోల్‌కత్తా నడిబొడ్డున ఉన్న షాహిద్ మినార్ గ్రౌండ్స్‌లో 'సంగ్రామి జౌత మంచా' బ్యానర్‌తో పలువురు ఉద్యోగులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు.

గుండె లయ తప్పుతోంది...

పెరుగుతున్న హార్ట్ అటాక్ కేసులు

- కోవిడ్ తర్వాత మరింత ప్రమాదకరంగా మారిన వైనం
- గతంతో పోలిస్తే 20 శాతానికి పైగా నమోదవుతున్న కేసులు
- చిన్న వయస్సు వారిని వదలని తీరు
- జాగ్రత్తలు తప్పవంటున్న వైద్యులు, నిపుణులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇటీవల సినీ నటుడు నందమూరి తారకరత్న గుండెపోటుతో మరణించిన విషయం అందరిని కలచివేసింది. కేవలం 40 సంవత్సరాల వయస్సున్న ఆయనకు గుండె పోటు రావడమేంటని అటు అభిమానులు, ఇటు సాధారణ ప్రజలు ఆశ్చర్య పోయారు. కాని 40 ఏండ్లే కాదు... ఇప్పుడు 30 ఏండ్ల వారికి కూడా గుండె జబ్బులు వస్తున్నాయనీ, అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకు ముప్పు తప్పక పోవచ్చని వైద్యులు, నిపుణులు హెచ్చరిస్తు న్నారు. ఈ సందర్భంగా వారు తారకరత్న మరణాన్ని ఉదహరిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో గుండె జబ్బులు పెరుగుతున్న తీరును పరిశీలిస్తే మరిన్ని విషయాలు అవగతమవు తున్నాయి.

హార్ట్ అటాక్ బారిన పడుతున్న వారి సంఖ్యతో పాటు సకాలంలో చికిత్స అందక మరణిస్తున్న వారి సంఖ్య కూడా ఇటీవల బాగా పెరిగింది. గుండె పోటుతో మరణిస్తున్న వారిలో అత్యధికులు 30 ఏండ్ల నుంచి 60 ఏండ్ల వయస్సు మధ్య వారుండటం గమనార్హం. ఇటీవల కాలంలో 30 నుంచి 40 ఏండ్ల వయస్సు వారు సైతం గుండె పోటుకు గురి కావడం ఆందోళనకరం. గతంలో హార్ట్ అటాక్‌కు గురైన వారిలో 70 శాతం మందికి పైగా 40 ఏండ్ల పైబడిన కేసులుండగా, ప్రస్తుతం ఆస్పత్రులకు వస్తున్న బాధితుల్లో 50 శాతం మంది 40 ఏండ్లలోపు వారే ఉంటున్నట్టు డాక్టర్లు చెబుతున్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి అనంతరం కాలం నుంచి ఈ పరిస్థితి పెరుగుతూ వస్తున్నది. గతంలో హార్ట్ అటాక్ రావడానికి కారణమయ్యే వాటికి తోడు కోవిడ్-19 ప్రభావం, దానితో మారిన జీవనశైలి కూడా గుండెపోటు వైపు నెడుతున్నాయి. దేశవ్యాప్తంగా 2012లో 18,522 మంది హార్ట్ అటాక్‌తో చనిపోగా, 2021 వచ్చే నాటికి ఇది ఏకంగా 28,449కి పెరిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీరిలోనూ 19,744 మంది 30 నుంచి 60 ఏండ్ల మధ్య వయస్సు వారే ఉండటం గమనార్హం.

శారీరక శ్రమలేకపోవడం, జంక్ ఫుడ్ తీసు కోవడం, వ్యాయామం చేయకపోవడం, ధూమ పానం, మద్యపానం, కుటుంబ చరిత్ర కలిగి ఉండటం, డయాబెటీస్, కొలెస్ట్రాల్ తదితరాలను హార్ట్ అటాక్ రావడానికి ప్రధాన కారణాలుగా చెప్పు కునే వాళ్లం. ప్రస్తుతం వస్తున్న హార్ట్ అటాక్ కేసుల్లో వీటికి తోడు మరికొన్ని కారణాలు వైద్య నిపుణుల పరిశోధనలో వెల్లడైంది. కరోనా ప్రభావం పడిన వారిలో భౌతిక వయస్సు, జీవశాస్త్ర (బయలాజికల్ ఏజ్) మధ్య తేడా రావడం, కరోనా తర్వాత వర్క్ ఫ్రం హోంతో దైనందిన జీవితంలో ఉన్నపళంగా వచ్చిన మార్పు, ఉద్యోగాలు, ఉపాధి కోల్పోవడంతో ఆ ఒత్తిడి గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇందులో భౌతిక వయస్సు, బయాలజికల్ ఏజ్ మధ్య తేడా వచ్చిన వారు బయటికి చూసేందుకు బాగానే కనిపిస్తుంటారనీ, అయితే శరీరంలోని జీవ ప్రక్రియ పరంగా ఏజ్ బార్ అయిపోయి ఉంటారని డాక్టర్లు విశ్లేషిస్తున్నారు. ఇక సెలబ్రిటీల్లో హార్ట్ అటాక్‌లు ఎక్కువగా రావడానికి శక్తికి మించిన శ్రమ చేయడం, తగిన విశ్రాంతి తీసుకోకపోవడం, ఫలితంగా ఒత్తిడికి గురి కావటమే కారణమని డాక్టర్లు చెబుతున్నారు.

లక్షణాలను గుర్తించాలి



గుండెపోటు వచ్చే ప్రమాదమున్న లక్షణాల ను గుర్తిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని గచ్చిబౌలి ఒమెగా హాస్పిటల్ కన్సల్టెంట్ ఇంటర్వె న్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ అక్రమ్ అలీ సూచించారు. ప్రతి మనిషి దైనందిన జీవితంలో చేసే పనులు యధావిధిగా చేయలేకపోవడం గుండెలో వచ్చే మార్పులు కారణం కావచ్చని చెప్పారు. ఉదాహరణకు ప్రతి రోజు 2 కిలోమీటర్లు నడిచే వ్యక్తి అంతకన్నా ముందే అలసిపోతున్నా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనిపిస్తున్నా... డాక్టర్‌ను సంప్రదించడం, ఈసీజీ తీసుకుంటే భవిష్యత్తులో హార్ట్ అటాక్ బారిన పడకుండా కాపా డుకునే అవకాశముందని ఆయన సూచించారు.

డాక్టర్ సయ్యద్ అక్రమ్ అలీ
(హృద్రోగ నిపుణులు)

బైరి రవికృష్ణను సన్మానించిన మంత్రి గంగుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంక్షేమం కొనసాగుతున్నదనీ, విద్యాపరంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో బీసీలకు మేలు జరుగుతున్నదని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో తన నివాసంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులతో ఆయన పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బైరి రవికృష్ణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దాడి మల్లయ్య యాదవ్, గోపాల్ గౌడ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు

ప్రతిష్టాత్మకంగా బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం : సమీక్షలో మంత్రి గంగుల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నదని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. వాటి నిర్మాణాలకు సంబంధించిన అంశాలపై సోమవారం హైదరాబాద్‌లోని తన అధికారిక నివాసంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, తెలంగాణ స్టేట్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొన్నారు. నెలాఖరు కల్లా అన్ని భవనాలకు టెండర్లు పూర్తి చేయాలనీ, మార్చిలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

ఉక్రెయిన్‌లో బైడెన్ ఆకస్మిక పర్యటన

- కొత్తగా 500 మిలియన్ డాలర్ల సైనిక సహాయానికి హామీ

కీవ్ : అమెరికా అధ్యక్షులు జో బైడెన్ సోమవారం ఆకస్మికంగా ఉక్రెయిన్‌లో ప్రత్యక్షమయ్యారు. ఆ దేశ అధ్యక్షులు వోలోదమర్ జెలెన్‌స్కీతో సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌కు కొత్తగా 500 మిలియన్ డాలర్ల సైనిక సహాయానికి బైడెన్ హామీ ఇచ్చారు. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం ప్రారంభమై త్వరలో ఏడాది పూర్తి కాబోతున్న సమయంలో ఈ పర్యటన ఆసక్తికరంగా మారింది. ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌కు తమ మద్దతు గురించి వెల్లడించడంతో పాటు, ఉక్రెయిన్‌కు సంఘీభావంగా మిత్రదేశాలను ఏకం చేయడమే బైడెన్ పర్యటన ఉద్దేశంగా కనిపిస్తోంది. బైడెన్ పర్యటన సందర్భంగా సోమవారం కీవ్ అంతటా వైమానిక దాడుల సైరన్‌ను మోగించారు. అయితే రష్యా వైమానిక దాడులకు పాల్పడినట్టు ఎలాంటి వార్తలూ రాలేదు. ఉక్రెయిన్ అధ్యక్ష భవనం 'మారియిన్‌స్కీ ప్యాలెస్'లో బైడెన్-జెలెన్‌స్కీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ 'యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా మద్దతు గురించి ఎటువంటి సందేహం వద్దు. సందేహం ఉండదని కూడా నేను అనుకుంటున్నాను' అని అన్నారు.

యూపీలో విధాన సభ వద్ద జర్నలిస్టులపై మార్షల్స్ దాడి

- డీయూజే ఖండన

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్‌లో విధానసభ వద్ద సోమవారం జర్నలిస్టులు, కెమెరామెన్లపై దాడి జరిగింది. విధానసభకు చెందిన మార్షల్స్ సిబ్బంది ఈ దాడికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం సమాజ్‌వాదీ పార్టీకి చెందిన శివపాల్ యాదవ్, తన పార్టీకి చెందిన మరికొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న చౌదరీ చరణ్ సింగ్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ ప్రాంతంలో సాధారణంగా ఇలాంటి ఆందోళనలు నిర్వహిస్తుంటారు. అలాగే ఈ ప్రాంతంలో జరిగే ఆందోళన లను మీడియా కూడా కవర్ చేస్తుంటుంది. అయితే సోమవారం మాత్రం ఇందుకు భిన్నంగా జరిగింది. శివపాల్ యాదవ్ ఆందోళనను కవర్ చేయకుండా మార్షల్స్ అడ్డుకున్నారు. జర్నలిస్టులు, కెమెరామెన్లపై దాడికి దిగారు. మార్షల్స్ విధి నిర్వహణ కేవలం అసెంబ్లీలో మాత్రమే ఉంటుంది. వారు అసెంబ్లీలో మాత్రమే విధులు నిర్వహించాలి. ఇలాంటి ప్రాంతాలు పోలీసుల ఆధీనంలో ఉంటాయి. అయినా జర్నలిస్టులపై దాడి చేయడానికి మార్షల్స్ అసెంబ్లీ లోపల నుంచి వచ్చారు. విధానసభ వద్ద జర్నలిస్టులు, కెమెరామెన్లపై మార్షల్స్ దాడిని ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ తీవ్రంగా ఖండించింది. ఉద్దేశపూర్వకంగానే మార్షల్స్ ఈ దాడి చేశారని, అందుకు తగిన వీడియో ఆధారాలు ఉన్నాయని డీయూజే తెలిపింది. బీజేపీ ప్రభుత్వం ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మీడియాపై దాడులు పెరుగు తున్నాయని, దాడులు చాలా దారుణంగా ఉంటున్నాయని ఆరోపించింది

సామాజిక తెలంగాణ సాధిస్తాం : దాసు సురేష్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన అమరుల ఆత్మబలిదానాలను వధాగా పోనివ్వమనీ, సామాజిక తెలంగాణ సాధించి తీరతామని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. సోమవారం గన్‌పార్క్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో ఆత్మబలిదానం చేసుకున్న సిరిపురం యాదయ్యకు నివాళులు అర్పించారు. త్యాగాలతో పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో తెలంగాణ ద్రోహులే అధికారంలో కొనసాగడం చూస్తుంటే...దీనికోసమా తాము తెలంగాణ కోసం బరిగీసి కొట్లాడిందని ఆత్మ విమర్శ చేసుకునే పరిస్థితి నెలకొందని మాజీ ఆర్టీసీ జేఏసీ చైర్మెన్, బీసీ రాజ్యాధికార సమితి కోర్ కమిటీ సభ్యులు దొంత ఆనందం ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో "రాజ్యాధికార పోరుబాట" కార్యక్రమం నిర్వహించి, జిల్లాల్లో పర్యటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చాపర్తి కుమార్ గాడ్గే, రాష్ట్ర నాయకులు మంద వెంకటస్వామీ హైదరాబాద్ పట్టణ నాయకులు సుజిత్ రావణ్, అనిల్, శారద , రేణుక , మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఆదేశాలను రద్దు చేయండి

- హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.6,757 కోట్లను చెల్లించాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని తెలంగాణ సర్కార్... హైకోర్టును కోరింది. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలను చట్ట ప్రకారం పరిష్కరించుకునేందుకు మార్గాలున్నాయని గుర్తు చేసింది. అయి నా కేంద్రం తమ వాదనను వినకుండా ఏకపక్షంగా, తెలంగాణపై కక్షతో ఆదేశాలిచ్చిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆలస్యపు చెల్లింపు, సర్ ఛార్జీల కింద మొత్తం రూ.6,757 కోట్లను ఏపీకి చెల్లించాలనే ఆదేశాలను రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కేంద్ర ఆదేశాల అమలును నిలిపేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను మరోసారి డివిజన్ బెంచ్ పొడిగించింది. తెలంగాణ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, ఏపీ తరపున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదించారు. విచారణను కోర్టు మార్చి 14కు వాయిదా వేసింది.

లాకప్‌డెత్‌పై నేడు విచారణ

మెదక్ పోలీస్ స్టేషన్‌లో ఖాదిర్‌ఖాన్ లాకప్ డెత్ ఘటనను హైకోర్టు సుమటో పిటిషన్‌గా పరిగణించి మంగళవారం విచారించనుంది. లాకప్ లో ఉండగా పోలీసులు కొట్టడం వల్ల గాయపడిన ఖాన్ ఈనెల 16న రాత్రి గాంధీ ఆస్పత్రిలో చనిపోయాడు. దొంగతనం కేసులో అతడిని పోలీసులు వేధించారనే ఆరోపణలొచ్చాయి. ఈ ఘటనపై పత్రికల్లో వచ్చిన వార్తలు, కథనాల నేపథ్యంలో హైకోర్టు కేసును విచారించాలని నిర్ణయించింది.

వీఆర్వోలకు అన్యాయం జరగలేదు

- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తన పరిధిలో ఉన్న ఉద్యోగ పోస్టులను రద్దుచేయడమనేది ప్రభుత్వానికుండే చట్టబద్ధమైన అధికారమంటూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. దీనిపై హక్కుగానీ, ప్రశ్నించే అధికారంగానీ ఉద్యోగులకు లేదని తేల్చి చెప్పింది. ప్రజా ప్రయోజనాలు, పాలనా అవసరాల నిమిత్తమే వీఆర్వో పోస్టులను రద్దు చేశామని స్పష్టం చేసింది. ఇదంతా చట్టబద్ధ ప్రక్రియంటూ పేర్కొంది. రెవెన్యూ శాఖలో ఖాళీలున్నా తమను ఇతర శాఖల్లోకి పంపడం అన్యాయమని పేర్కొంటూ వీఆర్వోలు హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారించిన సీజే ధర్మాసనం వారిని ఇతర శాఖలకు తరలించడంపై స్టే విధించింది. ఈ పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది.

పరీక్షలకు అనుమతించండి

- కాళోజీ వర్సిటీకి హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హాజరు శాతం తక్కువగా ఉన్న నార్కెట్‌పల్లికి చెందిన విద్యార్థిని అరుణను ఎంబీబీఎస్ పరీక్షకు అనుమతించాలంటూ కాళోజీ వర్సిటీనిత హైకోర్టు ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. మంగళవారం నుంచి జరగబోయే పరీక్షలకు ఆమెను అనుమతించాలని కామినేని ఆస్పత్రికి కూడా ఆదేశాలు జారీ చేసింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

దళిత విద్యార్థి సోలంకి ఆత్మహత్యపై బాంబే ఐఐటి వద్ద ప్రజాసంఘాల ధర్నా

ముంబై : దళిత విద్యార్థి దర్శన్ సోలంకి ఆత్మహత్య సంస్థాగత హత్య అని, బాంబే ఐఐటి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ ఇక్కడి మెయిన్ గేట్ వద్ద సోమవారం ప్రజాసంఘాలు ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు, ఐద్వా, జెఎఎస్ఎస్ ఆధ్వర్యాన ఆందోళన చేశారు. దర్శన్ సోలంకిని ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిని అరెస్టు చేయాలని, వారిపై ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దర్శన్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి, ఆదుకోవాలని కోరారు.

ఆశావర్కర్లకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- సీఎం కేసీఆర్‌కు జూలకంటి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశావర్కర్లకు కనీసం వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలనీ, ప్రసూతి సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. వారికి కనీస వేతనం ఇచ్చేంత వరకు ఆంధ్రప్రదేశ్ మాదిరిగా ఫిక్స్ డ్ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గతంలో 106 రోజుల సమ్మె సందర్భంగా ఫిక్స్ డ్ వేతనం రూ.6 వేలు చెల్లిస్తామన్న ముఖ్యమంత్రి హామీ అమలు చేయడం లేదని గుర్తుచేశారు. పాత పద్దతిలోనే పారితోషికాలు చెల్లిస్తున్నారని తెలిపారు.సమయపాలన లేకుం డా పని చేస్తున్న ఆశావర్కర్లపై పని భారం రెట్టింపయిందని జూలకంటి ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. వారికి 2021 జులై నుంచి డిసెంబర్ ఆరు వరకు ఆరు మాసాల పీఆర్సీ బకాయిలతో పాటు కేంద్ర ప్రభుత్వం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్సులు నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలల బకాయిలు కూడా ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 2022 డిసెంబర్ ఆరు నుంచి లెప్రసీ సర్వే, 2023 జనవరి 18 నుంచి కంటి వెలుగు రూపంలో అదనపు పనులు నిర్వహిం చినా...డబ్బులు చెల్లించకపోవడంతో ఆశాలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొ న్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో వారి కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆశాల విభాగంలో ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలనీ, ఇన్‌చార్జీ అలవెన్సులను ఇప్పించా లని కోరారు. 32 రకాల రిజిస్టర్లు ప్రింట్ చేసి సరఫరా చేయాలనీ, ఇప్పటికే వాటి కోసం ఆశాలు పెట్టిన ఖర్చులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు., ఐదేండ్ల పెండింగ్ యూనిఫారం ఇవ్వాలనీ, జిల్లా ఆస్పత్రుల్లో రెస్టు రూములు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్ విడుదల చేసి, పని భారం తగ్గించాలనీ, టీబీ స్పూటమ్ పరీక్ష డబ్బాలను ఆశాలతో మోపించే పనిని రద్దు చేయాలనీ, అధికారుల వేధింపులు అరికట్టాలని జూలకంటి ఆ లేఖలో సీఎంను కోరారు.

ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ : ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి కేసు విచారణ వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసులో శ్రీలక్ష్మికి విముక్తి కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో సీబీఐ సవాలు చేసింది. అనివార్య కారణాల వల్ల విచారణకు శ్రీలక్ష్మి తరపు న్యాయవాదులు హాజరు కాలేదు. దీంతో విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది

వేతన సవరణ చేయండి

- టీఎస్‌పీఈజేఏసీ ఉద్యమ కార్యాచరణ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు తక్షణం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈజేఏసీ) భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. ఈనెల 21, 22 తేదీల్లో సర్కిల్ స్థాయి సమావేశాలు, 24, 25, 28 తేదీల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని జేఏసీ సమావేశంలో తీర్మానం చేసినట్టు చైర్మెన్ సాయిబాబు, కన్వీనర్ రత్నాకర్, కో చైర్మెన్ ఎన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మెన్లు గోవర్థన్, సదానందం, వజీర్, కరుణాకర్‌రెడ్డి, రాంజీ, తులసి నాగరాణి, అశోక్‌రెడ్డి, వేణు, సత్యనారాయణ తదితరులు తెలిపారు. మార్చి 14న కేటీపీఎస్ ఎదుట, మార్చి 17న వరంగల్, మార్చి 21న హైదరాబాద్‌లో నిరసన సభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. మార్చి 24న హైదరాబాద్ విద్యుత్ సౌధలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. అప్పటికీ యాజమాన్యం స్పందించకుంటే మార్చి 24న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

26న డీఏవో రాతపరీక్ష

- హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏవో) పోస్టుల భర్తీకి సంబంధించి ఈనెల 26న రాతపరీక్ష జరగనుంది. దరఖాస్తు చేసిన అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే ప్రక్రియ ప్రారంభమైందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి అనితా రామచంద్రన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,06,253 మంది దరఖాస్తు చేశారని వివరించారు. వారిలో ఇప్పటి వరకు 39,913 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని పేర్కొన్నారు. 53 డీఏవో పోస్టుల భర్తీకి గతేడాది ఆగస్టు నాలుగో తేదీన టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరు శాతం వడ్డీ చెల్లించండి

(మొదటిపేజీ తరువాయి)

50 శాతానికి తగ్గిస్తూ 2020, మార్చి 30న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 27ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ జీవోను సవాల్ చేస్తూ దాఖలు చేసిన రిట్ పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఏపీ ప్రభుత్వం ఇదే తరహాలో తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేసిన కేసులో సుప్రీంకోర్టు ఆరు శాతం వడ్డీ చెల్లించాలంటూ ఆదేశించిందనీ, ఆ ఉత్తర్వులను తెలంగాణ ప్రభుత్వం కూడా అమలు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. సంబంధిత ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణను ముగిస్తున్నట్టు కోర్టు స్పష్టం చేసింది.

గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

పాదయాత్ర డిమాండ్లను నెరవేర్చాలి : సీఎం కేసీఆర్‌కు తమ్మినేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి చేపట్టిన పాదయాత్ర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు సోమవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు 40 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా, కారోబార్, బిల్ కలెక్టర్లు, ఆఫీస్ నిర్వహణ తదితర పనులను నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలకు చెందిన పేదలేనని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణ వచ్చిన తర్వాత కూడా వారు నిరాదరణకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారి వేతనాలను రూ.8500లకు పెంచినా, అది శాస్త్రీయ పద్ధతిలో లేదని పేర్కొన్నారు. ఈ ఏడాదిలోని జనాభా, పంచాయతీల విస్తరణకనుగుణంగా వారు సేవలందిస్తున్నారని వివరించారు. కానీ 2011 జనాభాను మాత్రమే లెక్కలోకి తీసుకుని 500 జనాభాకు ఒక కార్మికుడిగా పరిగణించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో గ్రామ అవసరాల ప్రాతిపదికన పంచాయతీ పాలకవర్గం మరికొంత మంది కార్మికులను నియమించుకున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ పెంచిన వేతనాలు ఇవ్వకపోవడంతో కొందరికి మాత్రమే వస్తున్న వేతనాలను అందరూ పంచుకుంటున్నారని తెలిపారు. దీంతో అత్యధిక మంది కార్మికులకు రూ.3,500ల నుంచి రూ.4,500ల వరకు మాత్రమే వస్తున్నాయని వివరించారు. వేతనాలు పెంచామనే సాకుతో వివిధ కేటగిరీలను రద్దు చేసి మల్టీపర్పస్ వర్కర్ విధానం తీసుకొస్తూ ప్రభుత్వం 51 జీవోను తెచ్చిందని గుర్తు చేశారు. దీంతో కార్మికులకు పని భారం పెరిగిందని పేర్కొన్నారు. కారోబార్‌తో పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ, ట్రాక్టర్ల డ్రైవర్, చివరికి ప్రజా ప్రతినిధుల ఇండ్లలో వ్యక్తిగత పనులను కూడా చేయించుకుంటున్నారని విమర్శించారు. వేతనాలు కూడా నాలుగు నుంచి ఏడు నెలల వరకు బకాయిలుగా ఉంటున్నాయని తెలిపారు. దీంతో కార్మికులు అప్పులపాలై ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

గ్రామ పంచాయితీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి పాదయాత్ర జరుగుతున్నదని తమ్మినేని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 60 జీవోను గ్రామపంచాయతీ కార్మికులకు కూడా వర్తింపజేస్తూ, పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్‌కలెక్టర్లు, ట్రాక్టర్ డ్రైవర్లు, వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా కార్మికులకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ విభాగంలో పనిచేసే సిబ్బందికి రూ.22,750 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

యాక్ట్ 2/94ను రద్దు చేసి పంచాయతీ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించి వారిని అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని సూచించారు. 51 జీవోను సవరించాలనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలిపారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికులకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, ఇంటి స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5.50 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మల్టీపర్పస్ వర్కర్ విధి నిర్వహణలో ప్రమాదానికి గురై డ్యూటీ చేయలేని స్థితిలో ఉన్న వారు, మరణించిన వారి కుటుంబ సభ్యులకు పంచాయతీల్లో ఉద్యోగావకాశం కల్పించాలని తెలిపారు.

దళితబంధును ప్రాధాన్యతా క్రమంలో అమలు చేయాలంటూ పాదయాత్ర బృందం కోరుతున్నదని తమ్మినేని పేర్కొన్నారు. ఇవి గొంతెమ్మ కోర్కెలు కావనీ, వారి న్యాయమైన సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని సీఎం కేసీఆర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.



సమస్యలు పరిష్కారమయ్యేవరకూ ఉద్యమం

- గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్



నవతెలంగాణ - బీబీనగర్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం ఆగదని గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పాలడుగు భాస్కర్ అన్నారు. జీపీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 12న పాలకుర్తి నుంచి ప్రారంభమైన పాదయాత్ర సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోపాటు రహీంఖాన్‌గూడ, రాఘవాపురం, వెంకిర్యాల, మక్త అనంతరం, గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగింది. వెంకిర్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో భాస్కర్ మాట్లాడారు. పాదయాత్ర పూర్తయ్యే లోపు ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచకుండా ప్రభుత్వం.. మరోవైపు జీవో నెంబర్ 51 తీసుకొచ్చి మల్టీ పర్పస్ విధానం అని ముద్దు పేరు పెట్టి అన్ని రకాల పనులు చేయాలని కార్మికులపై ఒత్తిడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 51ని రద్దు చేయాలని, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనులు చేసిన గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీవితకాలం పనిచేసినా కనీస వేతనం రావడం లేదన్నారు. పింఛన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాదయాత్రకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, పైళ్ల గణపతిరెడ్డి, వినోద్‌కుమార్, మహేష్, పాలడుగు సుధాకర్, కల్లూరు మల్లేశం, పొట్ట యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

– డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్

యూట్యూబ్‌లో చూసి నకిలీ నోట్ల తయారీ

- జైల్లో పరిచయాలతో నోట్ల సరఫరా
- ఇద్దరు నిందితుల అరెస్ట్



హైదరాబాద్ పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

యూట్యూబ్ చూసి నకిలీ నోట్లను తయారుచేస్తున్న ఇద్దరిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.27లక్షల విలువగల నకిలీ నోట్లు, ల్యాప్‌టాప్, ప్రింటర్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాఘవేంద్ర, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్‌వర్మతో కలిసి డీసీపీ డాక్టర్ శబరీష్ వివరాలు వెల్లడించారు. నారాయణ్‌పేట్‌కు చెందిన పాత నేరస్థుడు కస్తూరి రమేష్‌బాబు కారు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని యూట్యూబ్‌ను పరిశీలించాడు. అందులో నకిలీ నోట్లు ఎలా తయారు చేయాలో చూశాడు. ఆ తర్వాత నకిలీ నోట్లు తయారు చేయడం ప్రారంభించాడు. వాటిని కావాల్సిన వారికి, తెలిసిన వారికి సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో పలుసార్లు జైలుకెళ్లొచ్చాడు. ఇదిలావుండగా ఓసారి జైల్లో ఫలక్‌నుమాకు చెందిన హసన్‌బిన్ హమూద్‌తో రమేష్‌కు పరిచయం ఏర్పడింది. హసన్‌కు పెద్దఎత్తున కస్టమర్లు ఉండటంతో కమీషన్ పద్ధతిలో నకిలీ నోట్లను సరఫరా చేస్తానని రమేష్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో హుస్సేన్, రామేశ్వరితో కలిసి నకిలీ నోట్లను చలామణి చేసేందుకు ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాంద్రాయణగుట్ట పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. రమేష్‌బాబును గుజరాత్ పోలీసులు పట్టుకున్నారని డీసీపీ తెలిపారు. అతన్ని అరెస్టు చేసి విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగుచూస్తాయని తెలిపారు. నిందితులపై గుజరాత్, హైలదరాబాద్ తదితర పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్టు తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించినం దుకుగాను పోలీసులను డీసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్ల భద్రతపై హరీశ్‌రావు సమీక్ష



నవతెలంగాణ - హైదరాబాద్

సిద్దిపేట జిల్లాలో చేపట్టాల్సిన రోడ్ల భద్రతా చర్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి టి హరీశ్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఈ భేటికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, ఆర్అండ్‌బీ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు, ఆరోగ్యశాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజ రిజ్వీ, రవాణాశాఖ కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, పోలీసు, ఆర్అండ్‌బీ, రవాణా, ఆరోగ్యశాఖ అధికారులు హాజరయ్యారు. సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సిద్దిపేట సీపీ శ్వేత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మరణాలను తగ్గించడంలో గణనీయంగా సహాయపడిన తమిళనాడు నమూనాను అధ్యయనం చేయాలని మంత్రి హరీశ్‌రావు ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే సిద్దిపేట-హైదరాబాద్ రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచికలు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగంలోని ఆసుపత్రులను ట్రామా కేర్ సెంటర్లుగా గుర్తించి వాటిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను కోరారు. గజ్వేల్ ఔటర్ రింగ్ రోడ్డులో సర్వీస్ రోడ్లను అభివద్ధి చేయాలనీ, ఐలాండ్స్‌లో లైట్లు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను సూచించారు. సిద్దిపేటలో గుర్తించిన వివిధ బ్లాక్‌స్పాట్‌లను, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. రహదారి భద్రతా కమిటీపై రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి జిల్లా స్థాయిలో కూడా ఇలాంటి కమిటీలు పనిచేస్తాయని ప్రకటించారు.

శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

నవతెలంగాణ-శంషాబాద్

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో హైదరాబాద్-చెన్నై విమానంలో బాంబు పెట్టామంటూ ఓ దుండగుడు సోమవారం ఎయిర్‌పోర్టుకు ఫోన్ చేయడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు అధికారులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువును గుర్తించలేదని అధికారులు తెలిపారు. బెదిరింపు కాల్ చేసిన వ్యక్తి ఎయిర్‌పోర్టులోనే ఉన్నట్టు ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. చెన్నైలో సీనియర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అజ్మీరా భద్రయ్యగా గుర్తించారు. విమానాశ్రయానికి ఆయన ఆలస్యంగా రావడంతో ఆయన్ను ఎయిర్‌లైన్స్ సిబ్బంది లోపలికి అనుమతించలేదు. దాంతో ఈ బెదిరింపు కాల్ చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. ఆయనను అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో గ్లాండ్ ఫార్మా రూ.400 కోట్ల పెట్టుబడులు

- జీనోమ్ వ్యాలీలో యూనిట్ విస్తరణ..



హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ గ్లాండ్ ఫార్మా రాష్ట్రంలో మరో రూ.400 కోట్ల పెట్టుబడులను ప్రకటించింది. ఈ వ్యయంతో జీనోమ్ వ్యాలీలో తన కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్టు పేర్కొంది. "గ్లాండ్ ఫార్మా కొత్తగా రూ.400 కోట్ల పెట్టుబడులతో.. మరో 500 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. జీనోమ్ వ్యాలీలో గ్లాండ్ ఫార్మా తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తున్నదని ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది." " అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ట్విట్టర్‌లో తెలిపారు. కొత్తగా రూ.400 కోట్ల పెట్టుబడితో బయాలజికల్స్ లాంటి అడ్వాన్స్ ఏరియాల్లో 500 ఉద్యోగాల సృష్టి జరుగనుందన్నారు. తెలంగాణ రాష్ట్ర లైఫ్ సైన్సెస్, జీనోమ్ వ్యాలీల శక్తి నిత్యం బలోపేతమవుతోందని మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. 2022లో ఈ కంపెనీ ఇక్కడ రూ.300 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఇప్పటికే 200 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఎండిపోతున్న మొక్కజొన్న పంటలను కాపాడండి

- ఎంఎల్‌పే మల్లు భట్టి విక్రమార్కకు రైతుల మొర



నవతెలంగాణ - బోనకల్

ఆళ్ళపాడు మేజర్ కింద ఎండిపోతున్న మొక్కజొన్న పంటకు పూర్తి స్థాయిలో సాగర్ నీటిని అందించి పంటలను కాపాడాలని సీఎల్‌పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆళ్ళపాడు మేజర్‌ను సోమవారం సుమారు 200 మంది రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడే నీటిపారుదల శాఖ ఈఈ రామకృష్ణ, బోనకల్ డీఈ పబ్బతి శ్రీనివాస్‌తో సాగర్ నీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ళపాడు మేజర్ కింద సాగు చేసిన మొక్కజొన్న పంట అన్నదాతలు తమ సమస్యను మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదలశాఖ అధికారులకు వివరించారు. ఆళ్లపాడు మేజర్ కింద ఆళ్లపాడు, గోవిందాపురం ఏ, బోనకల్ తదితర గ్రామాల కింద 3,600 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేసినట్టు రైతులు తెలిపారు. ఆళ్ళపాడు మేజర్‌కు సాగర్ నీరు సక్రమంగా విడుదల చేయకపోవడం వల్ల మొక్కజొన్న పంట దాదాపు ఎండిపోవటానికి వచ్చిందన్నారు. ఒక్కొక్క ఎకరానికి సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టామని, కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే ఒక క్వింటా కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈఈ రామకృష్ణ స్పందిస్తూ.. పంటలు తడిసే వరకు నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టీపీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, జడ్పీటీసీ మోదుగు సుధీర్‌బాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, కలకోట సొసైటీ అధ్యక్షులు కర్నాటి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

దళిత రైతుల నిరసన



ర్యాలీగా తరలివస్తున్న దళితరైతులు

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ భూముల్లో ఏండ్లుగా సాగుచేసుకుంటున్న తమకు పట్టాలు ఇవ్వాలని దళిత రైతులు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా సాలూర మండలం మంధర్న గ్రామానికి చెందిన సుమారు 50 దళిత కుటుంబాలు సోమవారం బోధన్ ఆర్డీవో కార్యాలయానికి తరలివచ్చి బైటాయించి ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా హున్స సొసైటీ చైర్మెన్, కిసాన్ ఖండ్ మండల అధ్యక్షులు మంధర్న రవి మాట్లాడుతూ.. మంధర్న గ్రామంలోని నిరుపేద దళిత, బీసీ కుటుంబాల రైతులు 25-30 ఏండ్లుగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఈ భూమిలో కొందరు బోర్లు వేసుకుని సాగు చేసుకుంటున్నారని అన్నారు. గతంలో అధికారులు సర్వేచేసి ఎలాంటి ప్రకటన చేయలేదని తెలిపారు. భూమి పట్టాలు లేకపోవడంతో వారికి ప్రభుత్వం అందించే రైతుబీమా, రైతుబంధు పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆ భూములకు తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. నిరసనలో మహిళ రైతులు, యువకులు పాల్గొన్నారు.

మోడీకి కేసీఆర్ భయం

- రైతుల ఉసురు తీసుకుంటున్న ప్రధాని
- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-నల్లగొండ

సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ఆవిర్భావంతో ప్రధానమంత్రి మోడీకి భయం పట్టుకుందని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని జేడీఏ కార్యాలయంలో సోమవారం రైతుబంధు సమితి జిల్లా కో ఆర్డినేటర్‌గా శ్రీనివాస్‌రెడ్డి ప్రమాణ స్వీకార మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. గుజరాత్‌లో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి మోడీ రైతుల ఉసురు తీసుకుంటున్నారని విమర్శించారు. 2014కు ముందు తెలంగాణలో వ్యవసాయ రంగం అగమ్యగోచరంగా ఉందన్నారు. ఇప్పుడు రైతులకు 24 గంటల ఉచిత కరంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటున్న ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో రైతులకు ఇప్పటికీ 7 గంటలకు మించి కరెంట్ ఇవ్వడం లేదని విమర్శించారు అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ బీజేపీ ద్వంద్వ విధానాలను ఎండగట్టారని, బీజేపీ నాయకులు తేలు కుట్టిన దొంగల్లా తప్పించుకు తిరుగుతున్నారని అన్నారు. కేసీఆర్‌ను నిలువరించడమే మోడీ పనిగా పెట్టుకున్నారని, గుజరాత్‌లో అన్నదాతలు కేసీఆర్ గురించి గొప్పగా చర్చించుకుంటున్నారని చెప్పారు. దేశంలో మోడీని ఎక్కడికక్కడ అన్నదాతలు నిలదీస్తున్నారని, తెలంగాణలో కరెంట్ కోతలు తెచ్చేలా మోడీ గ్యాంగ్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజల్లో చైతన్యం వచ్చి బీజేపీ జెండాలను, కేసీఆర్‌ని విమర్శించే వాళ్లను తరిమి కొట్టాలని కోరారు. రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పంజాబ్ ముఖ్యమంత్రి తెలంగాణ వ్యవసాయ విధానాన్ని, ఇరిగేషన్‌ను మెచ్చుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దేవరకొండ శాసనసభ్యులు రవీందర్ కుమార్‌నాయక్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కరరావు, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్‌కుమార్, కార్పొరేషన్ చైర్మెన్లు తిప్పన విజయసింహారెడ్డి, దూదిమెట్ల బాల రాజుయాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో కేంద్రం వివక్ష

- మత్స్యకార వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 3న చలో ఢిల్లీ: కేరళ మత్స్య ఫెడ్ చైర్మెన్ టి.మనోహరన్ పిలుపు



నవ తెలంగాణ- ముషీరాబాద్

బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసిందని, కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల మత్స్యకారులపై మరింత భారాలు పడుతున్నాయని కేరళ మత్స్య ఫెడ్ చైర్మెన్ టి.మనోహరన్ అన్నారు. మత్స్యకార వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 3న చలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాలో వేలాది మత్స్యకారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నుంచి రెండ్రోజుల పాటు జరుగుతున్న మత్స్యకార జాతీయ కార్యవర్గ సమావేశాల సందర్భంగా సంఘం జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ మనోహరన్ మాట్లాడుతూ.. 8 ఏండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారీ వర్గాలకు రాయితీలు ఇస్తూ, మరోవైపు పేదలపై భారాలు మోపుతూ, ఉన్న సబ్సిడీలను ఎత్తేస్తూ ప్రజల మధ్య అంతరాలు పెంచుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా అణగారిన వర్గాలకు చెందిన మత్స్యకారులు అనేక ఇబ్బందులు పడుతు న్నారని చెప్పారున. అఖిల భారత మత్స్య కారులు, మత్స్యకార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో జరుగు తున్న కార్యవర్గ సమావేశాల్లో దేశవ్యాప్తంగా మత్స్య కారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలకు కార్యా చరణ రూపొందిస్తున్నామని, లక్షలాది మందితో సంతకాల సేకరణ, ఏప్రిల్ 3న వేలాది మంది మత్స్యకారులతో చలో ఢిల్లీ నిర్వహించ నున్నామని చెప్పారు. అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేబ్ శేష్ బర్మన్ (కలకత్తా), పి.స్టాన్లీ (కేరళ), జాతీయ కోశాధికారి జి.మమత (న్యూ ఢిల్లీ) మాట్లాడుతూ.. దేశంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటువాద విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతూ, సెంటిమెంట్లను రెచ్చ గొడుతూ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తోం దన్నారు. ప్రజా ఉద్యమాలను పక్కదోవ పట్టిస్తుందని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్మిస్తున్నామని, మత్స్యకారులందరూ పెద్దసంఖ్యలో పాల్గొని జయ ంప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మత్స్యఫెడ్ మాజీ చైర్మెన్ చేతి ధర్మయ్య, తెలంగాణ ఫిషరీస్ సొసైటీ అధ్యక్షులు పిట్టల రవీందర్ మాట్లా డారు. తెలంగాణ మత్స్య కారులు, మత్స్యకార్మిక సం ఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ సదస్సులో తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా, రాష్ట్ర ఉపాధ్య క్షులు ముఠా విజయ కుమార్, చెనమోని శంకర్, మురారి మోహన్, పగడాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కొప్పు పద్మ, గొడుగు వెంకట్, మునిగెల రమేష్, తేలు ఇస్తారి, అర్వపల్లి శ్రీరాములు నాయకత్వం వహించారు.

సదస్సులో పలు తీర్మానాలు చేశారు.. అవి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023-24లో ప్రకటించిన బడ్జెట్లను సవరించి మత్స్యకారులకు రూ.5వేల కోట్లు నిధులు కేటాయించాలి.
- కరోనా నేపథ్యంలో 3 సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో వున్న మత్స్యకారులను ఆదుకోవడానికి ప్రతి మత్స్య సొసైటీకీ (ఎలాంటి షరతులు లేకుండా) రూ.10లక్షల ఆర్థిక సహకారం అందించాలి.
- మత్స్యశాఖ ద్వారా మత్స్య సొసైటీలకు ఉచితంగా పంపిణీ చేస్తున్న చేప/ రొయ్య పిల్లలను జలవనరులకు సరిపడేంత పంపిణీ చేయాలి. ఎలాంటి అవినీతికి తావులేకుండా క్వాలిటీ / క్వాంటిటీగా పంపిణీ చేయాలి.
- మత్స్యశాఖ పరిధిలోని శిథిలావస్థలో వుండి కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ చేప పిల్లల విత్తన క్షేత్రాలకు ప్రత్యేక నిధులు రూ.500 కోట్లు కేటాయించి, సిబ్బందిని నియమించి అభివృద్ధి చేయాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒక చేపపిల్లల విత్తన క్షేత్రాన్ని నిర్మించాలి.
- చెరువులు, కుంటలను కబ్జాలు, కాలుష్యం నుంచి రక్షించాలి. చుట్టూ శాటిలైట్ ద్వారా సర్వే చేసి ఫెన్సింగ్ వేయాలి. కబ్జాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
- పెండింగ్ ఇన్సూరెన్సు, ఎక్స్‌గ్రేషియో వెంటనే ఇవ్వాలి. సహజంగా మరణించిన మత్స్యకార్మికులకు సంబంధించి ఆయా కుటుంబాలకు రూ.10లక్షల సహాయం అందించాలి. తక్షణ సహాయం కింద రూ.50 వేలు ఇవ్వాలి. కుటుంబంలో ఒకరికి ఎలాంటి షరతులూ లేకుండా నేరుగా సభ్యత్వం ఇవ్వాలి.
- ఎన్సీడీసీ ద్వారా రెండో విడతగా టూ వీలర్స్ (మోటారు బైకులు), ఫోర్ వీలర్ (టాటా ఏసీ, బొలెరో), డీసీఎంలు, వలలు, ఐసాక్సులు, వృత్తిపరికరాలు 90% సబ్సిడీ ధరకు ఇవ్వాలి.
- 50 సంవత్సరాలు దాటిన ప్రతి మత్స్యకారుడికీ రూ.3వేల పెన్షన్ ఇవ్వాలి.
- ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో రూ.20లక్షలతో హోల్ సేల్, రిటైల్ చేపల మార్కెట్లు నిర్మించాలి.
- మత్స్య సంపదకు గిట్టుబాటు ధర లేకపోతే, చేపలు చనిపోతే ఇన్సూరెన్సు కల్పిస్తూ చట్టం చేయాలి.
- చెరువుల లూటీలు, మత్స్య సొసైటీలు, మత్స్య సామాజిక తరగతులకు రక్షణ కల్పిస్తూ సామాజిక చట్టం చేయాలి.
- ఎన్సీడీసీ స్కీమ్లు/ చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి.
- ప్రతి సొసైటీకీ రూ.20లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

కార్పొరేటర్‌కు వినూత్న బహుమతి



నవతెలంగాణ-హయత్‌నగర్
మన్సూరాబాద్ డివిజన్, పద్మావతి నగర్ కాలనీలో సోమవారం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులతో కలిసి జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మారెడ్డి పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం కాలనీ సభ్యులు వినూత్నంగా ములక్కాయలు బహుమతిగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు విజయభాస్కర్ రెడ్డి, భాస్కర చారీ, మధుసూదన్, కిషన్, పద్మా రెడ్డి, రంగయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. హయత్‌నగర్

పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవతెలంగాణ-ఘట్‌కేసర్
ఒత్తిడిని జయించి ప్రణాళికాబద్ధంగా పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ మహిపతి శ్రీనివాస్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉత్తమ మార్గాలు అనే అంశంపై విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించి, ప్రణాళిక బద్ధంగా చదువుకోవాలని సూచించారు. సమయం వృధా చేయకుండా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుంటోళ్ళ యాదయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా మారుస్తాం

- అభివృద్ధి పనుల్లో రాజీపడే ప్రసక్తే లేదు
- మలక్ పేట ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి



నవతెలంగాణ-సంతోష్‌నగర్
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, కార్పొరేటర్ కొత్త కాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ డివిజన్ ఎస్‌బిఐ కాలనీలో కార్పొరేటర్ ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసోసియేషన్ నెంబర్ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బీజేపీ నాయకులు కొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులు సిబ్బంది డివిజన్ పలు బస్తీలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యే కార్పొరేటర్ ఆదేశించారు. కాలనీలో జనాభా పెరుగుదల అనుగుణంగా అన్ని బస్తీలలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథులకు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ మంచినీటి పరిశుభ్రత, విద్యుత్ కాలనీ పరిధిలో పలు అభివృద్ధి పనులను చేపట్టాలని సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్విరామంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య మంత్రి కేసీఆర్, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో మలక్‌పేట నియోజవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ రంగంలో నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే ప్రజల సౌక ర్యార్థం ఫ్లైఓ వర్లు, అండర్‌పాస్లు, ఆర్యూ బీలు, ఆర్వోబీలు, ఎస్టీపీలు, జిమ్, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, ఆట స్థలాలు, సీసీ రోడ్లు, షటిల్ కోర్టులు, తాగునీటి రిజర్వాయర్లు నిర్మించి మెరుగైన సేవలందిం చినట్లు వెల్లడించారు. నియోజక వర్గం మరింత అభివృద్ధి చేయాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు అందజేస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు చేరువైందన్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో డివిజన్లో ఇప్పటికే చాలా వరకు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడం కోసం నిరంతరాయంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సభ్యులు, యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రూట్ మార్కెట్ స్థలంలో వెలసిన రేకుల ప్రహరీ గోడ



- ఓ వర్గానికి అప్పనంగా హాస్పిటల్ నిర్మాణం స్థలం అప్పగిస్తున్నారని స్థానిక కార్పొరేటర్ ఆరోపణ

నవతెలంగాణ -ఎల్బీనగర్
గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్ స్థలంలో నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్ స్థలం అన్యాక్రాంతం అవుతుందని చైతన్య పురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్త అన్నారు. సోమవారం గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌లో రాత్రి రాత్రికి రేకులతో ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని తెలుసు కొని కార్పొరేటర్ మార్కెట్ స్థలంను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు ఓ వర్గానికి అప్పనంగా ప్రభుత్వం స్థలం అప్పగిస్తున్నారని అయన తెలిపారు. హాస్పిటల్ నిర్మాణం కోసం పండ్ల మార్కెట్‌ను బాట సింగారంకు తరలించారని గుర్తుచేశారు. గత సంవత్సరం ముఖ్య మంత్రి హాస్పిటల్‌కు శంకుస్థాపన చేశారని అయన పేర్కొన్నారు. ఇంత వరకు హాస్పిటల్ నిర్మాణం జరగడంలేదు అన్నారు. కానీ హాస్పిటల్ స్థలం అన్యాక్రాంతం అవుతుంది అన్నారు. ఫ్రూట్ మార్కెట్ స్థలాన్ని హెల్త్ డిపార్ట్మెంట్‌కు టిమ్స్ హాస్పిటల్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పగించిన స్థలంపై పర్యవేక్షణ లేదు అన్నారు. ఓ వర్గంకు ఒక ఎకరన్నర స్థలాన్ని అన్యాక్రాంతం చేసేందుకు కుట్రలు జరుగుతున్నయని, వెంటనే అధికారులు రేకులతో ఏర్పాటు చేసిన అక్రమ పార్టిషన్ తొలగించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బీజేపీ ఇన్‌చార్జి సామరంగారెడ్డి, డివిజన్ అధ్యక్షులు వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రజ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫ్రీ హెల్త్ క్యాంప్



నవతెలంగాణ-సిటీబ్యూరో
సుప్రజ హాస్పిటల్ యూనిట్ ఆఫ్ దంతూరి వారి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించినట్లు హాస్పిటల్ ఎండి విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. మస్కతి డైరీలో పనిచేస్తున్న 400 మంది ఉద్యోగులకి వివిధ రకాల పరీక్షలు నిర్వహించామని ఎండి తెలిపారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంపట్ల ప్రతినిత్యం శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ, వ్యక్తిగత పనులలో లీనమై తమ ఆరోగ్యం పట్ల అశ్రద్ధవహిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ హాస్పిటల్లో పరీక్షించుకోవాల న్నారు. దీనివలన మనము మన ఆరోగ్యం కాపాడు కోగలమని చెప్పారు.

తమ హాస్పిటల్‌లో కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యునికి అందించాలనే ఉద్దేశంతో 24 గంటలు తమ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్కటి డైరీ చైర్మెన్ సుల్తాన్ బిన్ ఇబ్రహీం, మార్కెటింగ్ మేనేజర్ అజయ్ కుమార్‌గౌడ్, ఏజీఎం మహమ్మద్ అహ్మద్ డాక్టర్ గౌతమ్ గౌడ్, డాక్టర్ సుష్మ, క్యాంప్ కోఆర్డినేటర్ వినయ్ కుమార్, నర్సింగ్ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సరూర్‌నగర్
ఉద్యమ నేత, బిఆర్ఎస్ నాయ కులు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బీరెల్లి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఆర్కేపురంలో షా బాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నెంటూరి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా జీవితంలో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొవాలని, మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారాజు రామాచారి, న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల విషయంలో వైవిధ్యం పాటించడం ఉత్తమం

క్వాంటమ్ మ్యూచువల్ ఫండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో
మార్కెట్లు అనిశ్చితితో నిండిపోవడంతో ఇన్వెస్టర్లు అస్థిరతను ఎదుర్కొంటున్నారు. ఇవి మార్కెట్లలో సంక్లిష్టత స్థాయిని పెంచాయి, పెట్టుబడిదారుల రాబడిని ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. ఏది ఏమైనప్పటికీ, భారతదేశం అనేక రంగాలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సిల్వర్ లైనింగ్‌గా కొనసాగుతోంది. ఇది జనాభాపరమైన ప్రయోజనం కావచ్చు, ప్రైవేట్ పెట్టుబడులలో పికప్, వినియోగదారుల మనోభావాలను మెరుగుపరచడం ద్వారా బలమైన ఆర్థికత ఊపందుకుంది. ఫలితంగా సంవత్సరాల ఫ్లాట్ వృద్ధి తర్వాత ఆదాయాలు మెరుగుపడతాయి. మెరుగైన రాబడులు అందుకోవడానికి పెట్టుబడుల విషయంలో వైవిధ్యం పాటించాల్సి ఉంటుందని, ఈ దిశగా ఫిక్సిడ్ డిపాజిట్లకు మించి రాబడులు పొందడానికి క్వాంటమ్ వంటి రెడీమేడ్ మల్టీ అసెట్ ఫండ్ ఆఫ్ ఫండ్ తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడుల్లో వైవిధ్యానికి 12:20:80 వ్యూహం చక్కగా పనిచేస్తుందని మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా కనీసం 12 నెలల ఖర్చులకు సరిపడే మొత్తాన్ని లిక్విడ్ ఫండ్లో ఉంచడం శ్రేయస్కరం.20 శాతాన్ని బంగారానికి, మిగతా 80శాతాన్ని ఈక్విటీలకు కేటాయించడం ద్వారా వైవిధ్యం పాటించవచ్చని, ప్రతికూల పరిస్థితుల్లోనూ పెట్టుబడుల పోర్ట్ఫోలియోను కాపాడుకోవచ్చని క్వాంటమ్ అసెట్ మేనేజ్మెంట్ సీఐవో చిరాగ్ మెహతా అన్నారు.

డా. చింతలకు అస్థిత్వం సామాజిక సేవా పురస్కారం- 2023



నవతెలంగాణ-హయత్‌నగర్
అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2023 సంవత్సరానికి గాను అస్తిత్వం సామాజిక సేవా పురస్కారాన్ని కవి, రచయిత, గాయకులు, హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, రంగారెడ్డి జిల్లా ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ చింతల రాకేశ్ భవానికి సిటీ సివిల్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ మురళీమోహన్, ఫ్యామిలీ, మ్యారేజ్, హెల్త్ కౌన్సిలర్ డా.హిప్నో పద్మాకమలాకర్, అస్తిత్వం సంస్థ నిర్వాహకురాలు చింతలూరి మంజులకౌర్, అస్తిత్వం సంస్థ సలహాదారులు కృష్ణవేణిలు బహుకరించారు. ఈ సందర్భంగా డా.రాకేశ్ భవాని మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగంలో ఈ విశిష్ట పురస్కారానికి ఎంపిక చేసిన కమిటీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పురస్కారం ఎన్ఎస్ఎస్ పట్ల తన బాధ్యతను మరింత పెంచింద న్నారు. జాతీయ సేవా పథక రంగారెడ్డి జిల్లా, కళాశాల ప్రోగ్రాం అధికారిగా, కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం చే నోడల్ అధికారిగా నియమించబడి వివిధ కార్యక్రమాల ద్వారా అధికారుల ప్రశంసలు పొందారు. రంగారెడ్డి జిల్లా నెహ్రూయువ కేంద్ర కమిటీలో సలహా సభ్యునిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాకేశ్ భవానిని ఎన్ఎస్ఎస్ ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డా.సవిన్ పలువురు ప్రోగ్రాం అధికారులు అభినం దించారు.

కుటుంబ నియంత పాలనను అంతమొందించడానికి సిద్ధంగా ఉండాలి

ఎమ్మెల్యే ఈటల రాజేందర్



నవతెలంగాణ-నాగోల్
రాబోయే ఎన్నికల్లో టీ.ఆర్.ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కుటుంబ నియంత పాలను అంతమొందించడానికి సిద్ధంగా ఉండాలని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర బీజేపీ శాఖ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాగోష బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం నాగోల్ డివిజన్ బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దం బాలకృష్ణ ఆధ్వర్యంలో నాగోల్ చౌరస్తాలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రంగారెడ్డి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షులు సామ రంగారెడ్డి, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌లతోపాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో నీళ్ల లేవు కానీ నియామకాలు మాత్రం కేసీఆర్ కుటుంబానికి వచ్చాయని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇంటికొక ఉద్యోగం, డబల్ బెడ్ రూమ్, దళితుని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ నిరుద్యోగ భృతి ఇస్తానని కూడా ఇవ్వలేక మోసం చేశారని ఆరోపించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని కరోనా కష్టకాలంలో నిరంతరంగా ఉచితంగా రేషన్ పంపిణీ చేసిన ఘనత మోడీకే దక్కుతుందని అన్నారు. ఈ శ్రమకార్డ్స్, వ్యవసాయ సబ్సిడీలు, గ్రామపంచాయతీలో నిధులు, తదితర పథకాలపై ప్రజలను చైతన్యం చేస్తూ బూతు స్థాయి నుండి పార్టీ బలోపేతం కృషి చేయాలని ఈ సందర్భంగా బిజెపి నాయకులకు, కార్యకర్తలకు నేతలు సూచించారు.

డివిజన్‌లో మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్



నవతెలంగాణ-బోడుప్పల్
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో మంచి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ఏర్పాట్లు చేశామని కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం నాడు డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీటి సమస్యపై కాలనీవాసులతో కలిసి జలమండలి కార్యాలయంలో వినతిపత్రం అందించటంతో పాటు, కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేశామని తెలిపారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టి కి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జబ్బార్, యాకూబ్, సత్యం, మురళి, కనకయ్య, నర్సింహ్మా బాలు, అమీర్, రవి, అజయ్, మాధవ్, రాహుల్, రాజు, సురేష్, కిరణ్ సహవత్, సత్యనారాయణ, రామకృష్ణ, యాకూబ్ పాష, చంద్, వేణు, అఖిల్, నితీష్, ఎల్లయ్య, బాల్, రాజు దాగే, లక్ష్మయ్య పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం నమూనాను ముందుకు జరపాలని వినతి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్
దళితుల భూములు మునిగిపోకుండా బ్రిడ్జి నిర్మాణం నమూనాను ముందుకు జరపాలని బీఎస్పీ నాయకులు యాంజల ప్రహ్లాదు అన్నారు. సోమవారం పెద్ద అంబర్ పేట లో మీడియా తో ఆయన మాట్లాడుతూ పెద్ద అంబర్ పేట మున్సిపల్ ఐదవ వార్డు పరిధిలోని చాకలి వాగు వద్ద నూతనంగా చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణంతో దళితుల భూములు మునిగిపోయే అవకాశం ఉందని, అందుకు బ్రిడ్జి నిర్మాణం ముందుకు జరపాలని ఆర్అండ్ బి. డి ఈ వేణుగోపాలరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. కాలువ ను సర్వే చేసి దళితులకు నష్టం జరగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

భూముల క్రమబద్ధీకరణ పేరతో ప్రభుత్వ ఖజానా ఫుల్



నవతెలంగాణ-సిటీబ్యూరో
భూముల క్రమబద్ధీకరణ పేరుతో అక్రమంగా ప్రభుత్వం ఖజానాను నింపుకుంటుందని సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పి.సాయి బాబా తెలిపారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. హైదరాబాదు నగర శివారు ప్రాంతాలలో కనీసం పేదలకు నిలువ నీడ లేకుండా కేసీఆర్ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ స్థలాలను విక్రయించి, భవిష్యత్తు తరాలకు అంధకారాన్ని మిగులుస్తోందని మండిపడ్డారు. భూముల క్రమబద్ధీకరణ పేరుతో వారి బినామీలపై భూములను క్రమబద్ధీకరించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జవహర్ నగర్‌లో ఓ వ్యక్తి 300 చ.గజాల స్థలాన్ని నోటరిపై బప్పందంపై రూ. 2 లక్షలతో కొనుక్కుని రేకుల ఇల్లు కట్టుకున్నాడని గుర్తు చేశారు. క్రమబద్ధీకరణ పేరుతో రూ.13.27లక్షలు చెల్లించాలంటూ నోటీసు జారీ చేశారన్నారు. కాప్రా మండంలో 100 గజాల ప్రభుత్వ స్థలంలో ఇళ్లు కట్టుకుంటే జీవో 59 కింద రెగ్యులరైజేషన్ చేయాలని కోరితే (రూ. 50 వేల ఉండాల్సిన ఫీజు) రూ.2లక్షలు కట్టాలని వచ్చిందన్నారు. ఇదే తరహాలో మరిన్ని ప్రాంతాల్లో లక్షలు కట్టాలని నోటీసులు రావడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. లక్షల్లో డబ్బులుంటే ఇతర చోట కొనుక్కునే వారమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. క్రమబద్ధీకరణతో ఎవరికి ఉపయోగం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శి బాలరాజు గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రచారి, జోగిందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పిస్తోల్ కొనుగోలు- నిందితుడి అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో
అక్రమంగా పిస్తోల్ కొనుగోలు చేసిన నిందితుడిని సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుని నుంచి తుపాకీ, రెండు ఖాళీ మ్యాగజైన్లు, సెల్‌ఫోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం డీసీపీ శబరీష్ తెలిపిన వివరాల మేరకు నాగ్‌పూర్‌కు చెందిన పర్వేజ్ హేమరాజ్ బంటీ ఉపాధి కోసమని కొన్నేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చాడు. 2017 నుంచి ఖైరతాబాద్‌లో నివాసముంటూ 'వన్ స్టూడియో'ను బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 3లో కొనసాగిస్తున్నాడు. అయితే కొద్ది రోజుల క్రితం కొందరు వ్యక్తులు పర్వేజ్‌ను చితకబాది ఆయన దుకాణంలో చోరీ చేశారు. దాంతో కక్షపెంచుకున్న పర్వేజ్ తన స్వస్థలం నాగ్‌పూర్‌కు వెళ్లి ఒక తుపాకీ, రెండు రౌండ్లు, రెండు మ్యాగజైన్లను రూ.63వేలకు కొనుగోలు చేశాడు. తుపాకీని ఓ ప్రైవేట్ బస్సులో నగరాకి తీసుకొచ్చాడు. ఆ తర్వాత గత డిసెంబర్ మాసంలో కొంపల్లి సమీపంలో అటవీప్రాంతానికి వెళ్లాడు. తుపాకీ పనిచేస్తోందో లేదో అని రెండు బులెట్లను గాలిలో కాల్చి నిర్ధారించుకున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ కోసం నిందితుడిని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని డీసీపీ తెలిపారు.

రామంతపూర్‌లో కొనసాగుతున్న హాత్ సే జోడో యాత్ర

నవతెలంగాణ-ఉప్పల్
రామంతపూర్ రాజీవ్ గాంధీ విగ్రహం నుండి మొదలైన పాదయాత్ర టీపీసీసీ మెంబర్ వినోద్ ముదిరాజ్ రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రఫిక్ గారి అధ్యక్షతన గడపగడపకి వెళ్తూ నెహ్రు నగర్ చౌరస్తా, సత్యనారాయణ స్వామి ఆలయము, మార్కండేయ స్వామి ఆలయము, ఇంద్రనగర్ చిన్న మసీదు, మెట్ల గల్లి చౌరస్తా వరకు వరకు యాత్ర కొనసాగింది. యాత్రను ఉద్దేశించి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ లిజనం కోసం జనంలోకిలి అని పిలుపునిస్తూ గడపగడపకు వెళ్లి అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల ను ఎండగడుతూ గడిచిన ఏడు సంవత్సరాలుగా నిత్యవసర సరుకులు ఆకాశాన్ని ఉంటాయని, గ్యాస్ సిలిండర్ ధరలు అధికంగా పెంచి ప్రజలపై భారం మోపుతూ, పెట్రోలు ధరలు కూడా విపరీతంగా పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలకు తీవ్ర భారాన్ని ప్రజలపై మోపుతూ ఇష్టారాజ్యంగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఇట్టి తెలంగాణ పార్టీ ఓడించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రజల దృష్టికి తీసుకొచ్చి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల శివ రెడ్డి, ఆగి రెడ్డి, హబ్సిగూడ సుధాకర్ రెడ్డి, మెడల్ మల్లికార్జున పాల్గొన్నారు.





పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వప్పుల అంజిరెడ్డి జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంటిరెడ్డి, ప్రవీణ్ పాశం, శ్రీకాంత్ పటేల్, నవీన్ కుమార్ మరియు హరీష్ తదితరులు పాల్గొన్నారు

- నవతెలంగాణ,బోడుప్పల్

ఏసీపీకి ఘనంగా సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో
విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహ కల్పించాలనే ఉద్దేశంతో ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్ రాజు రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలోని 'ఎస్ఆర్ డీఐజీఐ స్కూల్'తో పాటు అమీంపేట్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు పాటించకుంటే జరిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం ఏసీపీని ఘనంగా సన్మానించారు. ఆయన చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అబినంధించారు. ఈ సమావేశంలో ఎస్ఆర్ డీఐజీఐ స్కూల్ ప్రిన్సిపాల్ ముంజుల రెడ్డి, గౌతమ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎం.వీ.సుదేష్‌తోపాటు విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మల్కాజిగిరి
మంగళవారం 21 ఫిబ్రవరి 2023

ఎమ్మెల్యే సాయన్న మృతి పార్టీకి తీరని లోటు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణం పార్టీకి తీరని లోటు అని నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. సోమవారం నేరేడ్‌మెట్ చౌరస్తాలో సాయన్న చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సాయన్న మరణం బాధాకర మన్నారు. పేదల పెన్నిధి సాయన్న ఐదు పర్యాయాలు కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించారన్నారు. ఒక మంచి వ్యక్తిని పార్టీ కోల్పోయిందని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, నాయకులు ఎస్ ఆర్ ప్రసాద్, చెన్నా రెడ్డి, శివ,రాజు, మహేష్, రాజేష్,రమేష్, నవీన్, కిషన్, పాషా, కోటే శ్వరి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

నవతెలంగాణ-జవహర్‌నగర్



ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవనీ, ప్రభుత్వ భూముల్లో కట్టడాలు చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ హెచ్చరించారు. సోమవారం కార్పొరేషన్ లోని సర్కారు భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ సర్కారు భూముల్లో నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలకు వెనుకడుగు వేసేది లేదన్నారు. ఇకపై అక్రమ నిర్మాణం చేయాలంటే వణుకు పుట్టల్సిందేన అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దు

- అధికారులు వెంటనే పరిష్కరించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి
- ప్రజావాణిలో 47 దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్నందున వారు అందచేసిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఏమాత్రం పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాల్సిన



అవసరం ఉందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేటలోని జిల్లా కలెక్టరేట్ కార్యాయలంలోని సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు, వినతులు, విజ్ఞప్తులను అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో మొత్తం 47 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయా దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి సంబంధిత శాఖల అధికారులకు తెలియజేస్తూ వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో అవసరమైతే సంబంధిత సమస్యను ఆర్జీ సమర్పించిన వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా



- దుబాక ఎమ్మెల్యే రఘునందన్ రావు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా అని దుబాక్క ఎమ్మెల్యే రఘునాధన్ రావు అన్నాడు. తెలంగాణ ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర మహాసభ బడంగ్‌పేటలోని జీఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల సమస్యలను, వారి ఆలోచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. ప్రయివేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ కార్మిక సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ప్రయివేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కార్మికులు ప్రతి నిత్యం ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సన్ బోర్డు మెంబర్ నక్క యాదగిరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం వారిచ్చే వైర్మన్, సూపర్ వైజర్ తీసుకోవాలన్నారు. సభ నిర్వాకుడు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎలక్ట్రియన్ ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. ప్రయివేట్ ఎలక్ట్రికల్ కార్యాలయ భవన నిర్మాణానికి 1000 గజాల స్థలం కేటాయించాలనీ, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనీ, ప్రయివేట్ ఎలక్ట్రికల్ కార్మికుల కోసం ఈఎస్, పీఎఫ్ సదుపాయం కల్పించాలనీ, ప్రమాదంలో మృతి చెందిన వారికి రూ.15లక్షల ఆర్థిక సహాయం అందించాలనీ, సాధారణ మరణానికి రూ.8 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలనీ, 50 ఏండ్లు దాటిన ఎలక్ట్రికల్స్‌కు నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలనీ, ఉపాధి అవకాశాలు కల్పించాలనీ, అర్హత గల ప్రతి ఎలక్ట్రికల్ కార్మికునికి డబుల్ బెడ్ రూం ఇవ్వాలనీ, ఎలక్ట్రికల్ కార్మికుల కోసం రూ.100 కోట్ల నిధితో ప్రత్యేక సంక్షేమ బోర్డ్ ను ఏర్పాటు చేయాలి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకన్న గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర మల్లేష్ యాదవ్, నెమల బెనర్జీ, నిరంజన్ పాషా బాయి, ఉదయ్ కుమార్, బాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతనగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

అనంత నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరిస్తానని వినాయకనగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని అనంత నగర్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల వల్ల కొత్తగా చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జీహెచ్ఎంసీ ఏఈ సత్యలక్ష్మి, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజర్ నవీన్‌తో సమస్య పరిష్కారం కోసం చర్చించారు. ఇక్కడి పరిస్థితిని కాలనీ వాసులకు వివరించారు. సాధ్యమైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరిస్తానని కాలనీ ప్రతినిధులకు కార్పొరేటర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సూపర్వైజర్ సాగర్, కాంట్రాక్టర్ చిరంజీవి, కాలనీవాసులు హరికృష్ణ, ప్రమోద్, నరేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విస్తరించిన అమెజాన్ ఫైర్ టివి

నవతెలంగాణ- బెంగళూరు

ఇంటర్నెట్ ఆధారిత కం టెంట్కు అత్యధిక ప్రాచుర్యం ఉండటంతో రోజుకు కనీసం నాలుగు గంటలు వినోద వీక్షణ ఉందని సర్వేలో తేలింది. ప్రధానంగా అమెజాన్ ఫైర్టివిలో 12 భాషలలో కంటెంట్ను వీక్షించారన్నది ఇది వెల్లడించింది. గత సంవత్సర కాలంలో ప్రాంతీయ కంటెంట్కు ప్రాముఖ్యత పెరిగింది వీటిలో హిందీ, తమిళ,తెలుగు, మలయాళం, బెంగాలీ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ విషయంపై అమెజాన్ డివైజస్ ఇండియా డైరెక్టర్ అండ్ కంట్రీ మేనేజర్ పరాగ్ గుప్తా మాట్లాడుతూ మిలియన్ల కొద్ది ఫైరివి వినియోగదారులకు ఓటీటీ స్ట్రీమింగ్ సేవలు ద్వారా అందించామన్నారు. క్రీడలు, చిత్రాలు, ఇన్ఫోటైన్మెంట్, మ్యూజిక్ మొదలు సోప్ ఓపెరాల వరకూ ప్రతి ఒక్క చోటా వినియోగదారులు వాయిస్ సెర్చ్ను ఆస్వాదిస్తుండటంతో పాటుగా బహుళ భాషలలో కంటెంట్ను వీక్షిస్తున్నారు. ఈ నివేదికలో కనుగొనబడిన అంశాలు మాకు స్ఫూర్తి కలిగించడంతో పాటుగా ఫైరివి వేగవంతంగా సౌకర్యవంతమైన, వ్యక్తిగతీకరించిన, లీనమయ్యే వీక్షణ అనుభవాల కోసం మరింతగా ఆవిష్కరించేందుకు తోడ్పడింది అని అన్నారు.

క్రీడల ద్వారా యువతకు గుర్తింపు

నవతెలంగాణ-నాచారం



క్రీడల ద్వారా యువతకు గుర్తింపు లభిస్తుందని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. ప్రతి ఏడాదీ మహాశివరాత్రిని పురస్కరించుకుని శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చాందిని (సర్కిల్) క్రికెట్ టోర్నమెంట్ మల్లాపూర్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో రెండు రోజులు నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 42 జట్లు పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్ లో శాంతి యూత్ క్లబ్ జట్టు కళ్యాణ్ బాయ్స్ జట్టు తలపడగా కళ్యాణ్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.15వేల నగదు బహుమతి, రన్నర్ జట్టుకు రూ.5వేల నగదు బహుమతులు అందజేశారు. మ్యాచ్ లో కళ్యాణ్ బాయ్స్ జట్టుకు చెందిన సందీప్ బెస్ట్ బ్యాట్స్ మాన్ గా శాంతి యూత్ క్లబ్ జట్టుకు చెందిన గౌతమ్ బెస్ట్ కీపర్ గా ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ స్థానిక నాయకులు ఎస్ వి శివకుమార్, పిఆర్ ప్రవీణ్, నెమలి అనిల్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా సమాజంలో గుర్తింపు గౌరవాన్ని పొందాలంటే క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో మేలు చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాంతి యూత్ క్లబ్ నిర్వాహకులు రాజేష్, రఘు, నాగరాజు, శ్రీనివాస్, శశి, శ్రావణ్ రెడ్డి, మోగ్రాజ్, పరమేష్ రెడ్డి, నరేష్, సాయి యాదవ్, నర్సింగరావు, కిషోర్, శ్రీశైలం పాల్గొన్నారు.

దీర్ఘకాలిక డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దీర్ఘకాలిక డ్రయినేజీ సమస్యలకు పరిష్కారం చూపాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్ ఓల్డ్ విలేజ్ తో పాటు వివిధ కాలనీలలో డ్రయినేజీ సమస్యలు, మ్యాన్ హెూల్ మూతలు, సిల్ట్ ఛాంబర్ నోరు తెరిచి అస్తవ్యస్తంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు. శుభ్రం చేసిన డ్రైనేజీ సిల్ట్ మురుగును తొలగించకపోవడంతో దుర్వాసన దుర్గంధం వెదజల్లి దోమల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. మల్లాపూర్ డివిజన్ ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నా డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది స్పందించకపోవడమే కారణమని ఫిర్యాదు చేశారు. ప్రజల



నుంచి వ్యతిరేకత తీవ్రతరం కాకముందే ఉన్నత అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మల్లేష్, శ్రీనివాస్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-కాప్రా

ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి అని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా చర్లపల్లి డివిజన్‌లో బజరంగదల్ కుషాయిగూడ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ నేమూరి మహేశ్ గౌడ్, చల్లా ప్రభాకర్,



కుషాయిగూడ బజరంగ్దళ్ ప్రెసిడెంట్ సుమంత్, యశ్వంత్, అరుణ్, బీజేపీ మహిళా నాయకురాలు చంద్రకళ సాకేత్, అభి వినయ్, శివ, వంశీ, అర్జున్ శేఖర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాత రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలకు రండి



నవతెలంగాణ-నాచారం

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి అంబేద్కర్ 125వ జయంతి వేడుకలను మల్లాపూర్ అంబేద్కర్ భవన్ లో ఈనెల 25న నిర్వహించనున్నామనీ, ఈ కార్యక్రమానికి హాజరు కావాలని మాత రమాబాయి అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఉప్పల్ నియోజకవర్గం నల్ల బాబు ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఒక పురుషుడు ఎదుగుదలకు స్త్రీ సహకారం ఎంత అవసరమో అంత కంటే ఎక్కువగా భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ ఎదుగుదలకు మాత రమాబాయి తోడ్పాటు సహకారం అభివర్ణించరానిదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు అంజి మాదిగ, సంతోష్, మల్లేష్, శ్రీను పాల్గొన్నారు.

కేజీఆర్ కాలేజీలో ఏప్రిల్ 12 ,13 తేదీల్లో జాతీయ సమ్మేళనం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కేజీఆర్ కళాశాలలో ఏప్రిల్ 12 ,13 తేదీల్లో జాతీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు కాలేజీ చైర్మన్ కె.గోవింద్ రెడ్డి తెలిపారు. నాగారం మున్సిపాలిటీ ,రాంపల్లి గ్రామంలోని కేజీఆర్ కళాశాల లో "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు - భారతదేశంలో సమస్యలు సుస్థిర అభివృద్ధి కి బాటలు" అనే అంశం పై రెండు రోజుల జాతీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి బ్రోచర్ ను ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జి.రవీందర్, రిజిస్టర్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఓఎస్డీ రెడ్యానాయక్‌తో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.రవీందర్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వ విద్యాలయం బిసినెస్ మేనేజ్ మెంటు స్వర్ణోత్సవాలకు అనుబంధంగా నిర్వహిస్తున్న సమ్మేళనమునకు కేజీఆర్ కళాశాల ముందుకు వచ్చినందుకు అభినందిస్తూ, ఇలాంటి మరొక 50 కార్యక్రమాలను, వివిధ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలకు చెందిన 50 మంది ప్రముఖులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.గోవింద రెడ్డి, డైరెక్టర్ పి.వి.రమణారావు, ప్రిన్సిపాల్ విజయులక్ష్మి, బిజినెస్ మేనేజిమెంట్ విభాగ అధిపతి శ్రీరాములు, వెంకటయ్య సుధ పాల్గొన్నారు.

కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-కాప్రా



చర్లపల్లి డివిజన్ వీఎన్‌రెడ్డి నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి కాలనీ సమస్యలైనా రైన్ వాటర్ డ్రైన్, కమ్యూనిటీ హాల్ పై అదనపు అంతస్తు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేశారు. అందుకుగాను ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వీఎన్. రెడ్డి నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రెటరీ హనుమంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బుచ్చిరెడ్డి, బాలిరెడ్డి, రామ్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డప్పు గిరిబాబు, రెడ్డి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని వినతి

నవతెలంగాన-జవహర్ నగర్

ఆరోగ్యనికి ఎంతో హానికరమైన సెల్ టవర్‌ను తొలగించండి అంటూ కమిషనర్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ లోని 23వ డివిజన్ కు చెందిన శ్రీరామ్ నగర్ కాలనీవాసులు సెల్ టవర్ తొలగించాలని కోరుతూ సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనరు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కూలి పనులు చేసుకుని జీవనం సాగించే వాళ్ళం అనీ, సెల్ టవర్ ఏర్పాటుతో అనారోగ్యం పాలవుతూ చేసిన కష్టం దవాఖానాలకే సరిపోతలేదని వాపోయారు. వెంటనే



టవర్ ను తొలగించి తమ వెతలు తీర్చాలని కోరారు. త్వరలోనే సెల్ టవర్ ను తొలగిస్తామని కమిషనర్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు విజయ, మాధవి, సుజన, అండాలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం : బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా



అన్నదానం మహా దానం అని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. వాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో సాయి బాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అన్నదానం మహా దానం అన్నారు. అమావాస్య రోజున అన్నదానం నిర్వహిస్తే పితృదేవతలు సంతృప్తి చెందుతారని తెలిపారు. అన్నదానం నిర్వహించిన పెద్ది మౌనిక - నిఖిల్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి మిత్రమండలి ప్రెసిడెంట్ పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి తిరుమలేశ్ గుప్త, కార్యదర్శి గంప కృష్ణ గుప్త, వాసవి మిత్ర మండలి సభ్యులు ఉప్పల శ్రీనివాస్, భగవాన్, సిద్ధిపేట శ్రీనివాస్, సంతోష్ నవీన్ అశోక్, రాంపల్లి శ్రీనివాస్, చర్లపల్లి డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ నేమూరి మహేష్ గౌడ్, జంపాల్ రెడ్డి, రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రోగ్రామ్ల కోసం రిజిస్ట్రేషన్లను తెరిచిన సింబయోసిస్ ఇంటర్నేషనల్

నవతెలంగాణ- బెంగళూరు

సింబయోసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్శిటీ) (ఎస్ఐయు) సింబయోసిస్ ప్రవేశ పరీక్ష (సెట్) కోసం దరఖాస్తులు తెరిచినట్లు వెల్లడించింది. మే 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగనున్నాయి. పలుమార్లు ఈ సెట్లో పాల్గొనే అవకాశముంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఎస్ఐయు కింద ఉన్న 16 ఇనిస్టిట్యూట్లు అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్లను మేనేజ్మెంజ్, లా, ఇంజినీరింగ్, మాస్ కమ్యూనికేషన్, ఎకనమిక్స్, లిబరల్ ఆర్ట్స్, ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్స్, అప్లయ్డ్ స్టాటిస్టిక్స్, డాటా సైన్స్లో ఎంచుకోవచ్చు. ఈసందర్భంగా సింబయోసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్శిటీ) (ఎయు) వైసఛాన్సలర్ డాక్టర్ రజని గుప్తే మాట్లాడుతూ... జాతీయ విద్యావిధానం 2020 ఇప్పుడు మన దేశపు విద్యావిధానాన్ని సమూలంగా మార్చనుందన్నారు. ఈ విజనరీ పాలసీ, అభివృద్ధి, సౌకర్యం, నూతన తరపు అభ్యాసం పరంగా నూతన శిఖరాలకు తీసుకువెళ్తుందన్నారు. సింబయోసిస్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ వద్ద తాము ఇప్పటికే ఎన్ఎస్ఈపీ 2020 సూచించిన పలు ప్రోగ్రామ్లను అమలు చేస్తున్నామన్నారు. తమ పలుప్రోగ్రామ్లను సమగ్రమైన, మల్టీ డిసిప్లీనరీ విద్యను తమ విద్యార్థులకు అందిచేందుకు తీర్చిదిద్దామన్నారు.

కార్పెంటర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కాప్రా



అమావాస్య సందర్భంగా కాప్రా కార్పెంటర్స్ అసోసియేషన్ ప్రతి నెల సమావేశంలో భాగంగా అసోసియేషన్ 2023 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం కైలాస్ ప్లయ్ వుడ్ అండ్ హార్డ్వేర్ సంస్థ ప్రతినిధి రమేష్ పటేల్, మానవ్ మార్కెటింగ్ ప్రతినిధి పురుషోత్తం పటేల్. కాప్రా కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షులుగా పోలోజు రాజు చారి,ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, కోశాధికారి సద్గురు చారి అసోసియేషన్ ఫౌండర్ వెంకటేష్ చారి, చీఫ్ అడ్వైజర్ జ్యోతిర్మయ చారి, గౌరవ అధ్యక్షులు భార్గవ చార, కార్యనిర్వాహక అధ్యక్షులు నరసింహ చారి,అడ్వైజర్ గగన్ కుమార్, ఉపాధ్యక్షులు పూర్ణ చారిలి జాయింట్ సెక్రెటరీ యాదగిరి చారి, ప్రచార కార్యదర్శి సంపత్ చారి, ఆర్గనైజర్ శేఖర్ చారి, రాంబాబ నియమించబడ్డారు.

నెక్సస్ మాల్ అండ్ శరత్ సిటీల్లో తమ సరికొత్త స్టోర్స్ ని లాంచ్ చేసిన బిర్కెన్ స్టాక్ ఇండియా

నవతెలంగాణ- బెంగళూరు

ప్రపంచ ఫుట్వేర్ రంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్నటువంటి ప్రముఖ జర్మన్ ఫుట్వేర్ బ్రాండ్ బిర్కెన్స్టాక్. దక్షిణ భారతదేశంలో మరింతగా తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు మరో రెండు స్టోర్స్ ని హైదరాబాద్లోని నెక్సస్ మాల్ అండ్ శరత్ సిటీ మాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా తమ బ్రాండ్ని మరింతగా విస్తరించే స్థిరమైన ప్రణాళికతో వేగంగా ముందుకెళ్తోంది. అందులో భాగంగా జూబ్లీహిల్స్ హైదరాబాద్ తో పాటు లులు మాల్, కొచ్చి, ఎక్స్ప్రెస్ అవెన్యూ మాల్, చెన్నై అండ్ ఓరియన్ మాల్, బెంగళూరులో ఏర్పాటు చేసింది. బిర్కెన్స్టెక్ ఎంతో చరిత్ర కలిగిన కంపెనీ. ఇది 1774 నుంచి తమ ఉత్పత్తులను ప్రజలకు అందిస్తోంది. అసాధారణమైన సౌలభ్యం మరియు అధునాతన ఫుట్బెడ్ టెక్నాలజీకి ఎంతో ప్రసిద్ధి చెందింది ఈ బ్రాండ్. ఇది ఎప్పటికప్పుడు లేటెస్ట్ ఫ్యాషన్లతో ఉత్పత్తులను అందిస్తుంది. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ సరికొత్త స్టోర్లలో లేటెస్ట్ కలెక్షన్ అన్నీ ఉన్నాయి. అన్నింటికి మించి త్వరలో స్ప్రింగ్ సమ్మర్ 2023 కలెక్షన్ కూడా ఈ స్టోర్లోకి రాబోతున్నాయి. నెక్సస్ మాల్లో 690 చదరపు అడుగులు అండ్ శరత్ సిటీ మాల్లో 1900 చదరపు అడుగుల విస్తీర్ణంతో వీటిని ఏర్పాటు చేశారు. జర్మనీ అతిపెద్ద ఫుట్వేర్ తయారీదారు అయినటువంటి ఈ సంస్థ నుంచి మొత్తం 250కి పైగా ఎక్కువ మోడల్స్ ఉన్నాయి.

సయ్యద్ సిరాజుద్దినికి అండగా ఉంటాం : మంత్రి తలసాని

నవతెలంగాణ-సనత్‌నగర్

సనత్‌నగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జాఫ్రీ మసీద్ అధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మృతుని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటాం అని హామీనిచ్చారు.

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి నేడు ఐదుగురు నామినేషన్లు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. సోమవారం ఐదుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మాడిశెట్టి తిరుపతి, చాలిక చంద్రశేఖర్, చాలికపార్వతి, పాపన్నగారి మాణిక్‌రెడ్డి, మారంపల్లి లక్ష్మీనారాయణ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలాకు అందజేశారు. మరో ఇద్దరు బి.భుజంగరావు, దేవన్నగిరి మల్లారెడ్డి అదనంగా మరో సెట్ నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు 11 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు 18 నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్లు దాఖలు చేసిన వారిలో మాడిశట్టి తిరుపతి 2 సెట్లు, చాలిక చంద్రశేఖర్ 2 సెట్లు, చాలిక పార్వతి, పాపన్నగిరి మానిక్‌రెడ్డి, మారపల్లి లక్ష్మీనారాయణ ఒక్కొక్కరు ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. హైదరాబాద్ లోకల్ అథారిటీ ఎన్నికకు మూడో రోజూ ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి ప్రియాంక అలా తెలిపారు.

రానున్న ఎన్నికల్లో గోషామహల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



రానున్న రోజుల్లో గోషామహల్ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామని బీఆర్ఎస్ నాయకులు టి.శేఖర్ చారి అన్నారు. జంబాగ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొంది 9 ఏండ్లు పూర్తి చేసుకున్నదన్నారు. ప్రజా సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే విజయం సాధిస్తుందన్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ఒంటరి మహిళలకు పింఛన్లు, వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి పార్టీని నమ్ముకుని పని చేస్తున్నట్టు తెలిపారు.

టీచర్ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య
చీఫ్ సెక్రెటరీకి వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-అడిక్‌మెట్

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4 నోటిఫికేషన్‌లతో పాటు అన్ని కేటగిరీల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేశారు అని తెలిపారు. ముఖ్యమైన, ప్రాధాన్యత గల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేయడం లేదన్నారు. వెంటనే చీఫ్ సెక్రెటరీగా జోక్యం చేసుకుని టీచర్ పోస్టులు భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నోటిఫికేషన్ జారీ చేసే విధంగా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మన ఊరు మనబడి అనే కార్యక్రమం తీసుకువచ్చారనీ, మౌలిక సదుపాయాలకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. టీచర్లు లేరని ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం లేదన్నారు. రిటైర్మెంట్ వల్ల ఏర్పడ్డ 24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలనీ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4,900 పోస్టులను భర్తీ చేయాలి అని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో 12 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు ప్రకటించారు. కానీ ఇంతవరకు నోటిఫికేషన్ జారీ చేయలేదనీ, వీటి భర్తీకి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, ప్రధాన కార్యదర్శి సుధాకర్, భూపేష్ సాగర్, నాగరాజ్ వీరస్వామి, నరసింహ గౌడ్, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల దొంగలకు రిమాండ్

26 పెద్ద, 48 చిన్న బ్యాటరీలు, ఇతర పరికరాలు స్వాధీనం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బ్యాటరీల దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అబిడ్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువ గల 26 పెద్ద బ్యాటరీలు, 48 చిన్న బ్యాటరీలు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ బి.ప్రసాదరావు నిందితుల వివరాలను వెల్లడించారు. నగరంలోని పాతబస్తీ ప్రాంతానికి చెందిన షేక్ అజీముద్దీన్ అలియాస్ అజీమ్, జంగాల మద్దిలేటి తరచూ బ్యాటరీలు దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరిపై నగరంలోని బేగంబజార్, బేగంపేట్, కాచిగూడ, లంగర్ హౌస్, హబీబ్ నగర్, గోపాల్‌పురం, మల్కాపేట్, షాహినాయత్‌గంజ్, సైఫాబాద్, చైతన్యపురి పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయనీ, 11 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం తెల్లవారుజామున అబిడ్స్ రోడ్డు పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ప్రత్యేకత తనిఖీలు చేయగా అనుమానంస్పద స్థితిలో వీరి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి రూ.ఐదు లక్షల విలువైన బ్యాటరీలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడం, సామాగ్రిని స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు గౌరేందర్‌గౌడ్, నిరంజన్, పీసీలు రాజ్ కుమార్, రతన్, రవి కుమార్ యాదవ్‌ను అభినందించారు.

వైఎస్ షర్మిలపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-ఓయూ

గిరిజన ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైఎస్ షర్మిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గిరిజన చైతన్య వేదిక చైర్మన్ డాక్టర్ కరాటే రాజు నాయక్ అన్నారు. షర్మిలను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సోమవారం ఓయూ జాక్ నాయకులు ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయిక్‌కు ఫిర్యాదు చేశారు. షర్మిల మహబూబాబాద్ జిల్లాలో పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై దుర్భాషలాడుతూ కించపరిచే విధంగా మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేశారనీ, ఆమెపై ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో జగన్మోహన్ రెడ్డికి మానుకోట ప్రజలు ఏ విధంగా బుద్ధి చెప్పారో రాబోయే రోజుల్లో వైఎస్ షర్మిలకు కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉన్న గిరిజనులు, ఎమ్మెల్యే శంకర్ నాయక్ కి క్షమాపణలు చెప్పి పాదయాత్రలో పాల్గొంటే బాగుంటుందనీ, లేదంటే గిరిజనుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాజకీయపరమైన విమర్శలు చేస్తే మంచిదనీ, వ్యక్తిగత విమర్శలు ఒక జాతిని కించపరిచే విధంగా మాట్లాడే భాష రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమాజంలో సంఘ విద్రోహక శక్తులనీ, ఇలాంటి వారిని జనంలో తిరగనిస్తే రాబోయే రోజుల్లో శాంతి భద్రతలకు భంగం కలిగి విఘాతం కలిగే పరిస్థితి ఉంటుందన్నారు. ఇలాంటి వ్యక్తుల్ని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. గిరిజనులు తలచుకుంటే తెలంగాణలో తిరగలేవు అని హెచ్చరించారు. లోటస్ పాండ్‌లో అక్రమంగా నిర్మించిన ని ఇంటిపై సీబీఐ విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. 48 గంటల్లో గిరిజనులకు క్షమాపణ చెప్పకపోతేని ఇంటిని ముట్టడిస్తాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రీసెర్చ్ స్కాలర్ సుబ్బు నాయక్, ఆలిండియా బంజారా స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, ట్రైబల్ జాక్ చైర్మన్ రమేష్ రాథోడ్, భీం పూలే పరివార్ అధ్యక్షుడు హరిలాల్, గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు వినోద్, హనుమంతు, ప్రకాష్, ఓయూ జాక్ రవి, మోహన్ పాల్గొన్నారు.

ఈఎస్‌సీఐలో అడ్మిషన్లు షురూ

పీజీడీఎం ఇన్‌ఫ్రా, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కోర్సులకు డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సులకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి అనుమతి లభించింది. ఈస్కీ అందిస్తున్న కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. ఈ ఈస్కీ దేశంలోని అతిపెద్ద ప్రొఫెషనల్ ఇంజినీర్ల సంస్థ. ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) స్వయంప్రతిపత్తి గల సంస్థ. ఇంజినీరింగ్, టెక్నో-మేనేజ్‌మెంట్ డొమైన్‌లలో నాణ్యమైన శిక్షణ, విద్యను అందించేందుకు కృషి చేస్తుంది. ఏఐసీటీఈ 2023-25 సంవత్సరానికి ఈ కింది స్ట్రీమ్‌లలో రెండేండ్ల పోస్ట్-గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు అర్హులైన గ్రాడ్యుయేట్లు నుంచి దరఖాస్తులు కోరుతోంది. పీజీడీఎం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్‌లో 60 సీట్లు ఉన్నాయి. గతంలో 30 ఉంటే 60కి పెరిగాయి. పీజీడీఎం జనరల్ మేనేజ్‌మెంట్ 120 సీట్లు ఉన్నాయి. పీజీడీఎం ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో 60 సీట్లు ఉన్నాయి. మారుతున్న గ్లోబల్ ట్రెండ్, పరిశ్రమ అవసరాలు, సాంకేతిక ఆవిష్కరణలు మొదలైన అవకాశాలకు అనుగుణంగా ప్రోగ్రామ్‌లు రూపొందించబడ్డాయి. ఈ ప్రోగ్రామ్‌లు వ్యాపారంపై సమగ్ర దృక్పథాన్ని అందిస్తాయి. అత్యంత నిష్ణాతులైన పరిశ్రమల, విద్యా నిపుణులతో సంభాషించే అవకాశాన్ని అందిస్తుంది. నైతికత, విలువలతో రాజీ పడకుండా విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న ప్రాంతంలో రాణించాలని ఈఎస్‌సీఐ ప్రధాన ఆశయం. ఇంజినీరింగ్, ఇతర గ్రాడ్యుయేట్ల నుంచి పైప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. విద్యార్థులకు బ్యాంకు రుణ సహాయం, ప్లేస్‌మెంట్ శిక్షణ, ప్లేస్‌మెంట్ సహాయం అందిస్తారు. గతంలో 95 నుంచి 100శాతం విద్యార్థులు ఆకర్షణీయమైన ప్యాకేజీలతో ప్రసిద్ధ సంస్థల్లో ప్లేస్‌మెంట్ పొందారు. మరింత సమాచారం కోసం విద్యార్థులు/తల్లిదండ్రులు www.escihyd.org వెబ్‌సైట్‌ని సందర్శించాలని ఈఎస్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు తెలిపారు. మరింత సమాచారం కోసం వ్యక్తిగతంగా హైదరాబాద్ గచ్చిబౌలి క్యాంపస్‌ను సందర్శించాలని సూచించారు.

ఇద్దరు చైన్ స్నాచర్లు అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-అడిక్‌మెట్

నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇండ్లలో ఉన్న ఒంటరి మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను నల్లకుంట పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మొగలిచెర్ల రవి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ఈస్ట్ గోదావరి జిల్లా అంతర్వేది పల్లిపలెం ప్రాంతానికి చెందిన పెనుపోతు శంకర్ వీరప్రసాద్ ప్రస్తుతం జగదీర్ గుట్ట అంజయ్య నగర్ లో ఉంటూ రాపిడో బైక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాకినాడ సంజీవ్ నగర్‌కు చెందిన కోకిరిగడ్డ శ్రీను కాకినాడ పోర్ట్‌లో హౌస్ కీపింగ్ పని చేస్తున్నాడు. వరుసకు ఇద్దరూ బంధువులు కావడంతో తేలికగా డబ్బు సంపాదించడం పై తరచూ ఫోన్లో సంభాషణ చేస్తూ ఉండేవారు. అందులో భాగంగానే తరచూ రాపిడో బైక్ నెపంతో నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో ఒంటరి మహిళలు, వృద్ధులు ఉన్న ఇండ్లను టార్గెట్‌గా చేసుకుని గస్తీ నిర్వహిస్తూ ఉంటారు. అందులో భాగంగా నల్లకుంట ప్రాంతంలో కేవలం వృద్ధులు మాత్రమే నివసిస్తున్న ఒక ఇంటిని టార్గెట్ చేసుకుని ఎవరూ లేని సమయంలో ఇంట్లోని ఎలక్ట్రికల్ కరెంట్ ఫ్యూజ్ వైర్ పీకేసి వృద్ధురాలి మెడలో నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును తెంపుకుని ఆంధ్రప్రదేశ్ కాకినాడకు వెళ్లిపోయారు. దొంగలించిన బంగారాన్ని తాడేపల్లిగూడెం కాకినాడ ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదవ పెట్టినట్టు వెల్లడించారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారు కావడంతో ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ద్విచక్ర వాహనంపై రామ్ హెూండా అని స్టిక్కర్ ను గమనించి చాకచక్యంగా స్టిక్కర్ ఆధారంగా నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 200 సీసీ కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలించి నిందితుల అదుపులోకి తీసుకుని విచారించగా ఇంట్లో ఆర్థిక కష్టాలు ఉండటం వల్ల తామే ఈ నేరాన్ని చేశామని ఒప్పుకున్నారని తెలిపారు. గతంలో నిందితులపై ఏపీలో బైక్ దొంగతనాల, ఇంటి తాళాలు పగులగొట్టి న మరికొన్ని కేసులు నమోదయ్యాయి అని తెలిపారు. నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు

క్రీడా రంగంలోనూ సత్తా చాటుదాం : కేంద్రమంత్రి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



అన్ని రంగాల్లో దూసుకువెళ్తున్న ఇండియా క్రీడా రంగంలోనూ సత్తా చాటాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఒలింపిక్స్, పారా ఒలింపిక్స్ లాంటి పోటీల్లో భారత క్రీడాకారులు పతకాలతో మెరిశారనీ, అదే స్ఫూర్తితో దేశంలోని ప్రతిభ గల క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఖేలో ఇండియాలో భాగంగా ప్రతి పార్లమెంట్ నియోజక వర్గంలో క్రీడా పోటీలు నిర్వహించాలని ప్రధాని మోడీ ఆదేశించారని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణలో మొదటి సారి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం నిజాం కాలేజ్ గ్రౌండ్‌లో సాయంత్రం "ఖేలో తెలంగాణ..జీతో తెలంగాణ" క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అనేక మల్టీ నేషనల్ కంపెనీల అధిపతులు మన భారతీయులేననీ, క్రీడల్లోనూ మనం ఆ స్థాయికి చేరుకోవాలని సూచించారు. "ఖేలో తెలంగాణ.. జీతో తెలంగాణ"లో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో దాదాపు 40కి పైగా మైదానాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్ తదితర పోటీలు ఉంటాయనీ, 7,000 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వారిలో 3వేల మంది మహిళా క్రీడాకారులు ఉండటం విశేషం. క్రీడలకు సంబంధించి ప్రజల్లో మంచి సానుకూల భావన రావాలనీ, మన దేశం అన్ని రకాలుగా ముందున్నా స్పోర్ట్స్‌లో వెనకబడి ఉంటే ప్రపంచవ్యాప్తంగా మన దేశానికి రావాల్సినంత గౌరవం రాదన్నారు. దేశంలో మారుమూల గిరిజన ప్రాంతాలు, గ్రామాలు, పట్టణాల్లో సహజ క్రీడా సామర్థ్యం ఉన్న క్రీడాకారులకు ఈ క్రీడా పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇది ఒక మెగా స్పోర్ట్స్ ఫెస్టివల్ అనీ, దీన్ని ఓ పండుగ వాతావరణంలో జరుపుకోవాలనీ, తల్లిదండ్రులు, క్రీడాకారులు, క్రీడా అసోసియేషన్లు, విద్యార్థులు, యువత ఈ క్రీడల్లో భాగస్వాములు కావాలని మంత్రి కోరారు.

సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శిగా ఛాయాదేవి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్న ఎస్.ఛాయాదేవి జిల్లా నూతన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛాయాదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమతం యాదగిరిని జిల్లా నూతన సహాయ కార్యదర్శిగా సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ప్రస్తుత సహాయ కార్యదర్శి బి.స్టాలిన్ కొనసాగుతున్నారు. ప్రస్తుత కార్యదర్శి ఈ.టి.నరసింహను సీపీఐ జాతీయ సమితి సభ్యునిగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నుకున్న నేపథ్యంలో ఈ మార్పు జరిగింది. అలుపెరుగని పోరాటాల చరిత్ర గల హైదరాబాద్ జిల్లా సీపీఐ కార్యదర్శిగా మహిళా ఎన్నిక కావడం ఇదే తొలిసారి. 3 దశాబ్దాలుగా నిబద్ధత గల కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పని చేస్తూ అనేక ప్రజా ఉద్యమాల్లో ఎస్.ఛాయాదేవి పాల్గొన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలుగా సేవలందించి, మహిళల సమస్యలపై పోరాటాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలైన రాజ్ బహదూర్ గౌర్, కె.ఎల్.మహేంద్ర, మఖ్దూమ్ మొహియుద్దీన్, జవాద్ రజ్వీల ఆశయ సాధనకు కృషి చేస్తూ సీపీఐని అట్టడుగు స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సామాజిక వాతావరణాన్ని అవగాహనా చేసుకుంటూ, ప్రజా సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కరానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాన్సీ వాగ్దానాలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయనీ, సామ్రాజ్యవాదానికి, నయా ఉదారవాద విధానాలకు, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తూ, హైదరాబాద్ జిల్లా ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని పేర్కొన్నారు. తనను కార్యదర్శిగా ఎన్నుకున్న సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ.టి.నరసింహ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలకు, పేదలకు డబల్ బెడ్ రూమ్, భూదాన్ భూముల పంపిణీకి పోరాటాలు తీవ్రతరం చేయాలని సూచించారు. శాంతియుత హైదరాబాద్ సమాజంలో విభజనకు ప్రయత్నించే మత శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. హైదరాబాద్ చరిత్రను వక్రీకరించి మితవాద శక్తులను తిప్పికొట్టాలనీ, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని రక్షించేందుకు ఉద్యమాలు నిర్మించాలని సూచించారు.

దేశాన్ని మార్చడానికి వెయ్యి మంది కలెక్టర్లు చాలు

మేఘాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏడీజీ జీహెచ్‌పీ రాజు



నవతెలంగాణ-సిటీబ్యూరో

దేశాన్ని మార్చడానికి 1000 మంది కలెక్టర్లు నిబద్ధతతో పనిచేస్తే చాలనీ, దేశం అద్భుతంగా, ప్రగతి పథంలో పని చేస్తోందని మేఘాలయ ప్రిన్సిపల్ సెక్రెటరీ, సీఆర్పీఎఫ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జీహెచ్‌పీ రాజు అన్నారు. అదివారం నగరంలోని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశం సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అవినీతిని ప్రశ్నించే సమయంలో ఫేక్ కేసులు ఎవ్వరు పెట్టినా, పోలీసులు దురుసుగా ప్రవర్తించినా వీడియో రికార్డు లేదా ఇంకేదైనా అవకాశం ఉంటే సోషల్ మీడియాలో వైరల్ చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ అధికారీ ప్రజల సేవకుడేననీ, ఎవరూ ప్రజలకు బాసులు కాదన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ మరికొన్ని కార్యక్రమాలు చేయాలని పలు సలహాలు అందించారు. ఒక మంచి ఆలోచనతో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ముందుకు పోతుందనీ, రాబోయే రోజుల్లో ఓటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. డబ్బులు ఇవ్వడం ఆపలేమనీ, కాకపోతే ఉన్న దాంట్లోనే మంచి వాళ్లకు ఓటెయ్యమని అవగాహన కొన్ని ప్రాంతాల్లోనైనా చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాచారహక్కు చట్టంపై యువతకు అవగాహన కల్పిస్తూ, వారిని ప్రశ్నించే శక్తులుగా తయారుచేయాలన్నారు. అవినీతి అధికారులను తక్షణమే మార్చలేకపోవచ్చు కానీ నిజాయితీ అధికారులకు గుర్తించి వారిని సత్కరించడం వల్ల రాబోయే తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కనీస హక్కులపై యువతకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందడుగు వేయాలన్నారు. హక్కులపై అవగాహన ఉంటేనే ఏదైనా ప్రశ్నించవచ్చున్నారు. ఈ సమావేశంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులు కానుగంటి రాజు, మీడియా కార్యదర్శి జయరాం, వరికుప్పల గంగాధర్, డా.ఇందిరా ప్రియదర్శిని, సంతోషిణి, కొఠారి సునీత, కోమటి రమేశ్ బాబు, అంజుకర్, మూడావత్ రమేష్ నాయక్, మణిదీప్, రాజేశ్, నాగేంద్ర, సత్తార్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కింగ్‌కోఠి పాలి క్లినిక్‌ను కేంద్ర బృందం సందర్శన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

కింగ్ కోఠిలోని రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయూష్, గవర్నమెంట్ పాలీ క్లినిక్ (ఆయుర్వేద) ను మినిస్ట్రీ ఆఫ్ ఆయూష్ హెూమియోపతి అడ్వైజర్ డాక్టర్ సంగీత సందర్శించారు. మినిస్ట్రీ ఆఫ్ ఆయూష్ కన్సల్టెంట్ డాక్టర్ జాస్మిన్, రిచర్స్ ఆఫ్ మినిస్ట్రీ ఆయుష్ డాక్టర్ బిషోవా రంజన్ దాస్, రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ నోడల్ ఆఫీసర్ లింగరాజు, డిప్యూటీ డైరెక్టర్ అన్వర్, అడిషనల్ డైరెక్టర్ పరమేశ్వర్ నాయక్, శివరాం, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రాందాస్, యోగా టీచర్ డాక్టర్ యోగా శీల, ఫార్మసిస్ట్ సంధ్య తదితరులు. ఇక్కడ రోగులకు అందుతున్న ఆయుర్వేద వైద్య సేవలను కేంద్ర బృందం అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే సాయన్న మృతి రాష్ట్రానికి తీరని లోటు

నవతెలంగాణ-అంబర్ పేట



కంటెన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని ఆలిండియా జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎం.సాల్మాన్ రాజు అన్నారు. సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న పార్థీవ దేహానికి నివాళులర్పించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన కుటుంబంలో జన్మించి పేదలకు నిరంతరం సేవ చేస్తూ అకాల మరణం తీవ్ర విచారణ వ్యక్తం చేశారు. క్రిస్టియన్ మత పెద్దలు బిషప్ డానియల్, బిషప్ ఆంటోనీ, బిషప్ పద్మారావు, ఆల్ ఇండియా క్రిస్టియన్ జయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, కేన్ని, రవి సుందర్, డేవిడ్ రాజూ, దేవా దన్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయకుమార్ గౌడ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్ బిలాల్ మజీద్ లైన్‌లో డ్రయినేజీ సమస్య, కలుషిత మంచినీటి సమస్యని పరిశీలించిన కార్పొరేటర్ స్థానిక బస్తీ ప్రజలతో కలిసి సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులను పిలిపించి త్వరితగతిగా పరిష్కరించాలనీ, త్వరలోనే నూతన మంచినీటి పైపులైన్ వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు మజీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు షానూర్, గౌస్, ముక్రం, సంతోష్ చారి, తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం యాదయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆత్మహత్యకి పాల్పడిన యువకెరటం సర్దార్ సిరిపురం యాదయ్య కాంస్య విగ్రహాన్ని గేటు పరిసర ప్రదేశంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. సర్దార్ భగత్ సింగ్‌ను యాదయ్య గుర్తు చేశాడని తెలిపారు. యాదయ్య స్మారక సమితి కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ తాటికొండ వెంకట రాజయ్య కో-కన్వీనర్ పుట్ట పాండురంగయ్య ఆధ్వర్యంలో సోమవారం ఓయూ గేటు వద్ద యాదయ్య 13వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్ రావు, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి, కో-కన్వీనర్లు పగిడిమర్రి హరి, శంకరం గారి నర్సింగరావు, సిరిపురం ఉపేందర్, చిలువేరు యాదగిరి, గంజి వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి హాజరై యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని బీఎస్ మక్త మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ పక్క లైన్‌లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు హైమద్ భాయ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి వెంకటేశ్వరరావు

సొంత నిధులతో సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ-హైదరాబాద్ ఏడీవీటీ





కూకట్‌పల్లి నియోజకవర్గంలో గొట్టం ముక్కల వెంకటేశ్వరరావు, అలియాస్ జీవీఆర్ అంటే తెలియని వ్యక్తులు ఉండరు. ఎందుకంటే నియోజకవర్గంలో 24 గంటలు అందరికీ అందుబాటులో ఉంటూ, అందరి సమస్యలను పరిష్కరిస్తూ, పదేండ్లుగా గొప్ప నాయకుడిగా ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు. పదేండ్లుగా వందల కుటుంబాలకు సొంత అన్నలా అండగా నిలిచారు. సొంత నిధులతో వందల సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. కష్టాల్లో ఉన్న ఎన్నో కుటుంబాలకు ఉపాధి కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిని దత్తత తీసుకుని అధునాతనంగా తీర్చిదిద్దారు. కరోనా సమయంలో అదే ఆస్పత్రి నగరానికి ఆదర్శంగా నిలిచేలా చేశారు. తద్వారా కూకట్‌పల్లి, బోరబండ, కూకట్‌పల్లి ఏరియాల్లో, కోవిడ్ తాండవించిన సమయంలో అదే పీహెచ్‌సీ కొన్ని వేల మందికి సంజీవినిలా పని చేసింది. హైదరాబాద్ నగరానికే ఆదర్శంగా నిలిచింది. పేద కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ నిధులను మంజూరు చేయించడం, ఆపదలో ఉన్నవాళ్ళకు ముందస్తు ఎల్‌ఓసీలను కూడా అందించారు జీవీఆర్. వందల కుటుంబాలకు ఎల్‌ఓసీలను అందజేసి ఎన్నో ప్రాణాలను కాపాడారు ఆయన. అనాథ శవాలకు అంత్యక్రియలు, ఆస్పత్రుల్లో నిస్సహాయ స్థితుల్లో ఉన్నవాళ్ళకు చేయూత వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. కూకట్‌పల్లి మెయిన్ రోడ్డులో గల పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటూ, కార్యాలయంలో సిబ్బందిని నియమించి కొన్నేండ్లుగా పార్టీ కార్యాలయానికి వచ్చే వారికి, ప్రభుత్వం తరుపున, తాను సొంతంగా కూడా సహాయ సహకారాలు అందిస్తూ ఉన్నారు జీవీఆర్. జీవీఆర్ ఎంపీ కాదు, ఎమ్మెల్యే కాదు.. స్థానికంగా ఏ పోర్ట్‌ఫోలియోనూ కలిగిలేరు. కానీ ప్రజాసేవే ఆయన సంకల్పం. ఏ పోస్ట్ లేకపోయినా కేసీఆర్ కుటుంబంతో అత్యంత సాన్నిహిత్యం గల లీడర్ ఆయన. ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా కూకట్‌పల్లిలో పేరుగాంచారు. తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహించడం, పేదలకు భోజన సదుపాయాలు, ఆర్ట్ ఆఫ్ గివింగ్ సేవలు, నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం, క్రీడాకారులకు చేయూత, మంచినీటి సదుపాయాలు, వాల్ ఆఫ్ హ్యుమానిటీ, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ, పేద విద్యార్థులకు బస్ పాసులు, అంబలి కార్యక్రమం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు ఆయన క్యాలెండర్‌లో అనునిత్యం జరిగేవే. జీవీఆర్ ది లీడర్స్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఇప్పటి వరకు రూ.కోట్లు వెచ్చించి అన్నార్థులకు, నిస్సహాయులకు సహాయం చేస్తూ, స్థానిక ప్రజలకు సొంతింటి మనిషిగా జీవీఆర్ కొనసాగుతున్నారు. ఇలాంటి లీడర్లు ఊరికొకరు ఉంటే ఎంతో బాగుంటుంది అని నియోజకవర్గ ప్రజలు ఎంతో ధైర్యంతో జీవిస్తూ ఉన్నారు.





కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ లతా రవి

నవతెలంగాణ-శామీర్‌పేట

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లతా రవి అన్నారు. సోమవారం శామీర్ పేట మండలం బాబా గూడా గ్రామంలో కంటికి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందత్వ నివారణ ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇందిరా, వార్డు సభ్యులు దయాకర్ రెడ్డి, రాజు,దయానంద్, సులోచన, అంజలి, కో ఆప్షన్ సభ్యులు వెంకట్ రెడ్డి, అశోక్ రెడ్డి, మహేశ్వరి, టిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అధ్యక్షుడు దీపక్ రెడ్డి, వైద్యులు సంగీత,సూపర్వైజర్లు రాకేష్ సింగ్, రాణి, ఏఎన్ఎంలు స్వరూప రాణి, పారిజాత, డి ఈ ఓ సరిత, ఆశా వర్కర్లు చిట్టెమ్మ, సుజాత, జ్యోతి, మాలతి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మేయర్ సమీక్ష సమావేశం

నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మేయర్ నీలా గోపాల్ రెడ్డి వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా డంపింగ్ యార్డ్, ఎస్ ఎన్‌డిపి నాలా నిర్మాణ పనులు, రోడ్ వర్క్స్, డ్రైనేజీ, రోడు విస్తరణ పనులు, బస్తీ దవాఖాన, వైకుంఠధామాలు, శానిటేషన్, పార్క్ అభివృద్ధి పనులు, ఒపెన్ జిమ్స్, క్రీడా ప్రాంగణం,పట్టణ అభివృద్ధి వంటి పలు కీలక అంశాలపై ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారులతో మాట్లాడుతూ త్వరితగతిన. సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించడం జరిగింది.

ఈ సమావేశంలో కార్పొరేటర్లు విజయ లక్ష్మి సుబ్బారావు, చిట్ల దివాకర్ , సురేష్ రెడ్డి , కాసాని సుధాకర్ ముదిరాజ్, స్వతంత్ర కార్పొరేటర్ శ్రీరాములు, ఎన్ఎంసి ఉన్నత అధికారులు, టౌన్ ప్లానింగ్, ఇంజనీర్, శానిటేషన్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలం

సీపీఐ(ఎం) మండల నాయకులు కే.కృష్ణ నాయక్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు అనుకూలంగా లేదని ఇది ఆదాని అంబానీ నిరోమోది కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని సీపీఐ(ఎం) మండల నాయకులు కే కృష్ణ నాయక్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు నిరసనగా కెపిహెచ్ బీ జేఎన్టీయూ ఆటో స్టాండ్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో పేదలకు రాయితీ కల్పించడంలో విఫలమైందన్నారు. పేదలకు అందించే నిత్యవసర సరుకులు బియ్యం కూడా ఈ బడ్జెట్లో తగ్గించారన్నారు. పేదలకు అందించే 10 కేజీల బియ్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఆర్థిక సంక్షోభం మొదలవుతుంటే చిన్న వ్యాపారులకు కత్తి మీద స్వాముల ఉందన్నారు. పెద్ద వాహనాలకు



రేట్లు తగ్గించి చిన్న వాహనదారులైన ఆటో కార్ల టైర్లు రేట్లను పెంచి కార్మికులకు ఇబ్బంది పాలు చేస్తున్నారన్నారు. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో మోడీ విదేశీ పర్యటనలో భాగంగా 9 లక్షల కోట్లు అప్పు చేశారని ఈ భారం అంతా పేద ప్రజలపై వేస్తున్నారని విమర్శించారు. గుజరాతి వారసులే ఎందుకు ప్రపంచంలో ఎక్కువ డబ్బున్న వారుగా ఎదుగుతున్నారని ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు ఎందుకు ఎదగడం లేదని వారు ప్రశ్నించారు భారతదేశాన్ని కొంతమంది పెట్టుబడిదారీ శక్తులకు అప్పగించే దాంట్లో మోడీ నిమగ్నమయ్యారని విమర్శించారు. రాబోయే కాలంలో ప్రజలు తగ్గిన గుణపాఠం బిజెపికి చెబుతారని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు శ్రీనివాస్ గౌడ్ సదా మహేష్ , సిఐటియు ఆటో యూనియన్ నాయకులు మహేష్ సుదర్శన్ వెంకటేష్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు .

మహిళలకు ఉపాధిలో కార్డ్ సంస్థ కృషి అభినందనీయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ - కూకట్‌పల్లి



సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి డివిజన్ ఏ.వీ.బీపురంలోని కార్డ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో, మహిళలు స్వయం సమృద్ధి సాధించే విధంగా వారికి వృత్తిపరమైన విద్యా కోర్సులు ఉచితంగా కల్పించడానికి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, కార్డు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు సుమన్ 25 సంవత్సరాల నుంచి ఎంతోమంది అనాధ పిల్లలను చేరదీయడం తో పాటు మహిళలకు ఉపాధి కల్పించి వారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి కృషి చేశారని. అటువంటివారు మన కూకట్ పల్లి కి చెందినవారు కావడం మనకు గర్వకారణం అని, వారు అందించే సేవల ద్వారా మహిళలు అన్ని వృత్తిపరమైన కోర్సులు నేర్చుకుని, అనగా కుట్టు మిషన్లు.బ్యూటీషియన్. జూట్ బ్యాగ్స్ తయారీ తదితర వంటివి శిక్షణ పొంది వారు అందించే ధ్రువీకరణ పత్రం పొంది సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చని. అలాగే పెద్దపెద్ద సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కూడా పొందవచ్చని, దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏవీబీపురంలో చాలామంది నిరుపేదలు ఉన్నారని అందుకనే ఈ ప్రాంతంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామని తెలిపారు. అలాగే కరోనా కష్టకాలంలో ఎంతోమంది నిరుపేదలకు వారి స్వచ్ఛంద సంస్థ ద్వారా నిత్యవసరాలు అందించినందుకు ఇలా నిరుపేదలకు ఉపయోగపడుతున్నందుకు కార్డు స్వచ్ఛంద సంస్థ సభ్యులైన సుమన్ దంపతులను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ డివిజన్ అధ్యక్షులు సంతోష్. సీనియర్ నాయకులు హరినాథ్. ధారాసింగ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై మురళీధర్



నవతెలంగాణ-మేడ్చల్

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మేడ్చల్ ఎస్సై మురళీధర్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాలలో సోమవారం మేడ్చల్ పోలీస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మురళీధర్ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫేస్ బుక్, ఓఎల్ ఎక్స్, వాట్సాప్,ట్విట్టర్,ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ముందుగా మనతో పరిచయం పెంచుకుంటారు. ఆ పరిచయం ద్వారా చేసే చాటింగ్ లో మన యొక్క పూర్తి వివరాలను సేకరిస్తారు.మనకు తెలియకుండానే మన బ్యాంక్ ఖాతాలో నుండి నగదును వారి బ్యాంక్ ఖాతాల్లోకి బదిలీ చేసుకుంటారు. ఇలాంటివి పాల్పడేవారు ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందినవారే. సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసగాళ్లకు ఎలా చెక్కుతామో పలు ఉదాహరణల ద్వారా విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కమలాకర్ రెడ్డి,మేడ్చల్ పోలీస్ సిబ్బంది,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు బెస్ట్ ఎక్సలెన్స్ అవార్డు



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు అరుదైన గౌరవం తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ పోలీస్ స్టేషన్ 2022 సంవత్సరంకు దేశంలోని అన్ని పోలీస్ స్టేషన్లోని ర్యాంకింగ్‌లో బెస్ట్ ఎక్సలెన్స్ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైనట్లు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ హోమ్ ఎఫైర్ మినిస్ట్రీ ఆఫ్ హెూం ఎఫైర్ శాఖ ప్రకటించగా తెలంగాణ స్టేట్ డీజీపీ అంజనీ కుమార్ తెలిపారు. దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు ఎక్సలెన్స్ అవార్డు రావడం ఎంతో సంతోషదాయకమని, మిగతా అన్ని పోలీస్ స్టేషన్‌లు దుండిగల్ పోలీస్ స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఐపీఎస్ స్టీఫెన్ రవీంద్ర దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు ఈ అవార్డు ప్రధానం పట్ల పోలీస్ అధికారులతో పాటు కానిస్టేబుల్. సిబ్బంది అందరి కృషి వల్ల ఎక్సెన్స్ దక్కినట్లు అధికారులు తెలిపి మేడ్చల్ ఏసిపి, డిసిపి, లు దుండిగల్ పోలీస్ స్టేషన్ సీఐ రమణారెడ్డి, ఎస్సై, కానిస్టేబుల్‌లను, సిబ్బందిని అభినందించారు.

ఫంక్షన్ హాల్, పార్క్, గ్రంథాలయంకు స్థలం కేటాయించండి

సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్

జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్‌లో సర్వేనెంబర్ 348/1లో అనేక ఎకరాలుప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు కాపాడలేకపోతున్నారని కుత్బుల్లాపూర్ మండల సీపీఐ కార్యదర్శి ఈ.ఉమా మహేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఫంక్షన్ హాల్, పార్క్,గ్రంథాలయం కోసం స్థలం కేటాయించాలని కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో సీపీఐ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా అదరపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలైన బస్తీదవాఖాన, ఫంక్షన్ హాల్ ,పార్క్,గ్రంథాలయం ల ఏర్పాటు కొరకు స్థలం కేటాయిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని అన్నారు అధికారులు అవేమి పట్టించుకోకపోవడం వల్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని ప్రజల అవసరాల కోసం తక్షణమే స్థలం కేటాయించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉజ్జిని హరినాథ్ రావ్,బాచుపల్లి మండల కార్యదర్శి శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, సీపీఐ నాయకులు శ్రీనివాస్, యాదయ్య, ఏఐఎస్‌వైఫ్ కార్యదర్శి శివ పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్ జేఏసీ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-కేపీహెచ్‌బి

జేఎన్టీయూ యూనివర్సిటీలో జేఎన్టీయూహెచ్ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జేఎన్టీయూ హెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహా రెడ్డి, యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్, కాలేజీ ప్రిన్సిపాల్ ఎ. జయలక్ష్మిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఎన్టీయూహెచ్ జేఏసీ ఆధ్వర్యంలో రూపొందించిన జేఎన్టీయూ హెచ్ జేఏసీ 2023నూతన సంవత్సర డైరిని సోమవారం జేఎన్టీయూ హెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎం గోవర్ధన్, కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.జయలక్ష్మిలు క్యాలెండర్ ను, టేబుల్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఎన్టీయూ జేఏసీ చైర్మన్ బొట్ల బిక్షపతి, అధ్యక్షులు మంద రంజిత్ కుమార్ మాట్లాడుతూ జేఎన్టీయూ జేఏసీ డైరీలో సమాచారం గురించి వివరిస్తూ భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు, దేశ, రాష్ట్ర స్థాయిలో యూజీసీ గుర్తింపు పొందిన మెడికల్, ఇంజనీరింగ్ యూనివర్సిటీలు, ఏఐసిటిఈ, న్యాక్, ఎన్బీఎ సంబంధిత సమాచారం, తెలంగాణ రాష్ట్రంలో గుర్తింపు పొందిన గవర్నమెంట్ యూనివర్సిటీలు, ప్రైవేట్ యూనివర్సిటీల సమాచారం, తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే వివిధ సెట్ అర్హతల సమాచారం, తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హైకోర్టు, జిల్లా



ప్రధాన కోర్టుల వివరాలు, శాసనసభ పాలకవర్గం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ రాష్ట్ర జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, యస్పీల వివరాలు, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ అధికారుల సమాచారం, అనుబంధ యూనివర్సిటీ కాలేజీల అధికారుల సమాచారం , గుర్తింపు పొందిన అనుబంధ కాలేజీల సమాచారం జేఎన్టీయూ హెచ్ జేఏసీ డైరీలో ఉంటుందని తెలిపారు. ఈ డైరీ ద్వారా ఎడ్యుకేషన్ సంబంధిత సమాచారం, రాష్ట్ర సంబంధిత పూర్తి సమాచారం విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, రాజకీయ నాయకులకు, అతి సామాన్య ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బొట్ల బిక్షపతి, అధ్యక్షులు మంద రంజిత్ కుమార్, వైస్ చైర్మన్ ధరమ్ సొత్తు శ్రీనివాస్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గర్ సందీప్, ప్రణయ్, అజయ్, సాయిశరత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భావితరాలకు దిక్సూచిగా నిలవాలి

మండల విద్యాధికారి ఆంజనేయులు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

నేటి విద్యార్థులు భావితరాలకు దిక్సూచిగా నిలవాలని కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి ఆంజనేయులు అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ చెన్నారెడ్డినగర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ప్రముఖ సంఘ సేవకులు, పంచశీల ఫౌండేషన్, సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు జింకల వెంకటేష్ ముదిరాజ్, రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో విద్యాశాఖ ప్రవేశపెట్టిన (ఎఫ్.ఎల్.ఎన్.టి.ఎల్.ఎం. మేళా) కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కల్పన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయనతోపాటు గాంధీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకట రాములు ముఖ్య అతిథులుగా హాజరై, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చిన్ననాటి నుండే విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సామాజిక విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కన్న కలలు సాకారం చేసేది విద్యార్థులేనని అన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా విద్యార్థులకు ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చక్కని విలువలతో కూడిన విద్యనందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని తెలిపారు. చిన్నారి విద్యార్థులు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆలరింపజేశాయి. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పంచశీల ఫౌండేషన్, ఉత్సవ కమిటీ సభ్యుల నేతృత్వంలో మేమేంటోలతో అభినందించారు. ప్రతీ నెల అమావాస్య సందర్భంగా పంచశీల ఫౌండేషన్, సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతి, మధు, విద్య వాలంటీర్ శాంతి, సామాజిక వేత్త విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కెప్టెన్ భీమయ్య, సంఘ సేవకులు ప్రముఖ కవి, గాయకులు, రచయిత వాకిటి రామిరెడ్డి, పారిశ్రామికవేత్త ఆంజనేయులు, జలమండలి విశ్రాంత ఉద్యోగి షాబుద్దీన్‌తోపాటు కమిటీ సభ్యులు భాషయ్య, సూర్యనారాయణ, దేశ్ ముఖ్, రాములు, మాజీ వార్డు సభ్యులు రహీం తదితరులు పాల్గొన్నారు.

సూరారంలో కొనసాగుతున్న "హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర"

నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో "హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర" 15వ రోజులో భాగంగా సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని రామకృష్ణ నగర్ చౌరస్తా, వేమారెడ్డి నగర్, సోనియా గాంధీ నగర్, హమీద్ బస్తీ, లక్ష్మీ నగర్, సూరారం విలేజ్, విశ్వకర్మ కాలనీలలో జండా ఎగరవేసిన నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి గడప గడపకు హాత్ సే హాత్ జోడో అభియాన్ స్టికర్ వేసి కరపత్రాలను పంచుతూ... బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల ద్వంద్వనీతిని , అధికారం కోసం మోసపూరిత హామీలతో ప్రజలకు జరిగిన అన్యాయం గురించి ప్రజలకు వివరించి, కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, ఆల్ ఇండియా దళిత సేన అధ్యక్షులు ఆవిజే జమ్స్, సిద్ధనోలా సంజీవరెడ్డి, పండరి రావు, మారి సంతోష్ కుమార్ ముదిరాజ్, శ్రీశైలం



యాదవ్, సంపంగి వెంకటేష్, వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, నవీన్, అబ్బాస్, సలీం, సోహెల్, రజాక్, సురేందర్ రెడ్డి, సురేష్ , మల్లేష్ , యాదమ్మ, గౌష్య బేగం , హసీనా, అన్నపూర్ణ, వరలక్ష్మి, మణెమ్మ , సువర్ణ, మంజుల మరియు యువజన నాయకులు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్లో రెండు రోజుల పాటు జాతీయ కార్యశాల

నవతెలంగాణ-కేపీహెచ్‌బి



కృతిమ మేధాని ఉపయోగించి చేసిన సమాచార విశ్లేషణ, మనిషి యొక్క సహజ మేధ ద్వారానే నిర్ణయించాలని జేఎన్టీయూహెచ్ ఉపకులపతి ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం జేఎన్టీయూహెచ్ యుసీ ఈఎస్టి కళాశాల ఆధ్వర్యంలో డిపార్టుమెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్లో రెండు రోజుల పాటు జాతీయ కార్యశాల " మోడర్న్ టూల్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ ఎనర్జీ డేటా అనలటిక్స్" పై నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఇంధనరంగంలో డాటా అనలిటిక్స్ ఆవశ్యకతను వివరించారు. రెక్టార్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ సమాచార విశ్లేషణ, భద్రత, దేశ రక్షణకు ఎంతో ఆవశ్యకమన్నారు. జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ , మెకానికల్ రంగాల మధ్యనున్న అవినాభావ సంబంధం, ఆ రంగాలల్లో ఉద్యోగ అవకాశాలు పెంచుకునేందుకు , ఇంజినీరింగ్ సెలబెస్లో రావాల్సిన మార్పులు, చేర్పులు, దానికి తగ్గట్టుగా విద్యార్థులలో పెంపొందించాల్సిన నైపుణ్యాలు , శిక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయలక్ష్మీ, ఎలక్ట్రికల్ విభాగాధిపతి , కార్యశాల కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ నాగ సుజాత, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు, పరిశోధన విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కైసర నగర్ పాఠశాలకు మంచినీటి సరఫరా



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం సర్కిల్‌లోగల కైసరనగర్ ప్రభుత్వ పాఠశాలకు మంచినీటి సరఫరా చేయకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిసి గత శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన అధికారులు సోమవారం మంచినీటి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమస్యలు ఎక్కడున్నా వాటి సమస్య పరిష్కారం కొరకు ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం చేస్తుందని నియోజకవర్గ కార్యదర్శి శివ అన్నారు. అదేవిధంగా వెంటనే స్పందించి సమస్యను తీర్చినందుకు వాటర్ వర్క్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల సమస్యల కోసం పోరాడినందుకు సీపీఐ మండల కార్యదర్శి ఉమా మహేష్ విద్యార్థి సంఘం నాయకులను అభినందించారు.



బాక్సర్ నిఖత్‌కు ఇంటి స్థలం

పత్రాలు అందజేసిన క్రీడా మంత్రి

నవతెలంగాణ, హైదరాబాద్

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్, తెలంగాణ సూపర్‌స్టార్ నిఖత్ జరీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయించింది. క్రీడాశాఖ మంత్రి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో నిఖత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్‌కు ఈ మేరకు ఇంటి స్థలం పత్రాలను మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియ అందజేశారు. నిఖత్ జరీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం జూబ్లీహిల్స్‌లో 600 గజాల స్థలం కేటాయించింది. ఇటీవల యువ షూటర్ ఇషా సింగ్‌కు సైతం 600 గజాల ఇంటి స్థలాన్ని అందజేసిన సంగతి తెలిసిందే.

త్వరలోనే డీఎస్పీ ఉద్యోగం

'బాక్సర్ నిఖత్ జరీన్ తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటింది. సిఎం కెసిఆర్ గతంలోనే రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహకం అందించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరలోనే నిఖత్ జరీన్‌కు పోలీసు శాఖలో డీఎస్పీగా ఉద్యోగ నియామక పత్రం సైతం అందజేస్తాం. భవిష్యత్‌లోనూ నిఖత్ జరీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం కొనసాగుతుందని' రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. రాష్ట్ర క్రీడా పాలసీకి రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం తెలిపేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి అన్నారు. ప్రపంచ చాంపియన్ బాక్సర్ నిఖత్ జరీన్ ప్రతిభ, విజయాలను గుర్తించి నగదు బహుమతితో పాటు ఇంటి స్థలం కేటాయించినందుకు సంతోషంగా ఉందని మహ్మద్ జమీల్ అహ్మద్ అన్నారు.

సెమీస్‌లో అడుగు

టీమ్ ఇండియా తీన్‌మార్!. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో వరుసగా మూడోసారి భారత్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. వర్షం అంతరాయం కలిగించిన చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై 5 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) విజయం సాధించిన హర్మన్‌సేన నాకౌట్‌కు చేరుకుంది. 2018, 2020 ఐసీసీ టీ20 ప్రపంచకప్ సెమీస్‌కు చేరుకున్న భారత్ ముచ్చటగా మూడో వరల్డ్‌కప్‌లో సెమీఫైనల్‌కు అర్హత సాధించింది.

- ఐర్లాండ్‌పై 5 పరుగులతో భారత్ పైచేయి
- వర్షం అంతరాయం, డక్‌వర్త్ పద్ధతిలో ఫలితం

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2023



నవతెలంగాణ-గాబెరా

భారత్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో వరుసగా మూడోసారి భారత్ నాకౌట్ దశకు అర్హత సాధించింది. గాబెరాలో సోమవారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై భారత్ 5 పరుగుల తేడాతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో విజయం సాధించింది. గ్రూప్-2లో మూడు విజయాలతో ఆరు పాయింట్లు ఖాతాలో వేసుకున్న భారత్.. రెండో స్థానంలో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. నాలుగు విజయాలతో ఇంగ్లాండ్ అగ్రస్థానం సాధించింది. గ్రూప్-1 అగ్రజట్టు ఆస్ట్రేలియాతో భారత్ సెమీఫైనల్లో పోటీపడనుంది. స్మృతీ మంధాన (87, 56 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు) భారీ అర్ధ సెంచరీతో తొలుత భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 155 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. భారీ ఛేదనలో ఐర్లాండ్ మహిళల జట్టు 8.2 ఓవర్లలో 54/2 పరుగులు చేసింది. ఐర్లాండ్ ఇన్నింగ్స్ మధ్యలో వర్షం ఆటంకం కలిగించింది. చిరుజల్లులు, బలమైన గాలులతో మొదలైన వర్షం ఎడతెరపి లేకుండా కురిసింది. ఆట పున ప్రారంభమయ్యే పరిస్థితులు లేకపోవటంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేశారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఛేదనలో ఐర్లాండ్ 8.2 ఓవర్లలో 59 పరుగులు చేయాలి. కానీ ఐర్లాండ్ 54 పరుగులే చేసింది. దీంతో భారత్ 5 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది.

మంధాన మెరుపుల్

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్ స్మృతీ మంధాన (87) ధనాధన్ ఆరంభాన్ని అందించింది. షెఫాలీ వర్మ (24, 29 బంతుల్లో 3 ఫోర్లు)తో కలిసి తొలి వికెట్‌కు 62 పరుగులు జోడించిన మంధాన.. భారీ స్కోరుకు గట్టి పునాది వేసింది. షెఫాలీ వర్మ సహజశైలికి భిన్నంగా ఆడింది. 29 బంతుల్లో 24 పరుగులే చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (13), రిచా ఘోష్ (0) నిరాశపరిచారు. జెమీమా రొడ్రిగస్ (19, 12 బంతుల్లో 3 ఫోర్లు) తోడుగా రెచ్చిపోయిన మంధాన.. 40 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించింది. మంధాన అర్ధ శతక ఇన్నింగ్స్‌తో భారత్ మంచి స్కోరు నమోదు చేసింది.



వరుణుడు వచ్చే!

156 పరుగుల లక్ష్యం ఐర్లాండ్‌కు అసాధ్యమైన ఛేదన. ఇన్నింగ్స్ తొలి బంతికే ఆమీ హంటర్ (1) నిష్క్రమించగా.. ఐదో బంతికి ఓర్లా (0) అవుటైంది. తొలి ఓవర్లోనే రెండు వికెట్లు కోల్పోయిన ఐర్లాండ్.. అనూహ్యంగా తెగువ చూపించింది. ఓపెనర్ లెవిస్ (32 నాటౌట్, 25 బంతుల్లో 5 ఫోర్లు) దూకుడుగా పరుగులు సాధించింది. లెవిస్ ఎదురుదాడితో ఐర్లాండ్ వేగంగా పరుగులు పిండుకుంది. లారా డెలానీ (17 నాటౌట్, 20 బంతుల్లో 3 ఫోర్లు) సైతం రాణించింది. దీంతో 8.2 ఓవర్లలో ఆ జట్టు 54 పరుగులు చేసింది. వర్షంతో రద్దుగా ముగిసిన మ్యాచ్‌లో ఐర్లాండ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో పరాజయం పాలైంది.

స్కోరు వివరాలు :

భారత మహిళలు : 155/6 (స్మృతీ మంధాన 87, షెఫాలీ వర్మ 24, రొడ్రిగస్ 19, ఓర్లా 2/22)

ఐర్లాండ్ మహిళలు : 54/2 (గాబీ లెవిస్ 32, లారా డెలానీ 17, రేణుక ఠాకూర్ సింగ్ 1/10)

పాట్ కమిన్స్ ఇంటికి

- గాయంతో హాజెల్‌వుడ్ అవుట్
- ఆసీస్ శిబిరంలో అనిశ్చితి



న్యూఢిల్లీ : బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో పేలవ ప్రదర్శనతో 0-2తో నైరాశ్యంలో కూరుకున్న ఆస్ట్రేలియా శిబిరంలో అశిన్చితి వాతావరణం ఏర్పడింది. కెప్టెన్ పాట్ కమిన్స్ కుటుంబ కారణాలతో అత్యవసరంగా స్వదేశానికి బయల్దేరగా.. పేసర్ జోశ్ హాజెల్‌వుడ్ గాయంతో చివరి రెండు టెస్టులకు దూరమయ్యాడు. దీంతో హాజెల్‌వుడ్ ఆస్ట్రేలియాకు తిరుగు పయనం అయ్యాడు. ఓపెనర్ డెవిడ్ వార్నర్ రెండో టెస్టులో కంకషన్‌తో బాధపడుతుండగా.. యువ స్పిన్నర్ టాడ్ మర్ఫీ సైతం గాయం బారిన పడ్డాడు. దీంతో ప్రస్తుతం కంగారూల శిబిరంలో కంగారు కాస్త ఎక్కువైంది.

కెప్టెన్ పాట్ కమిన్స్ కుటుంబ సభ్యులలో ఒకరు తీవ్ర అనారోగ్యంతో ఉన్నట్టు తెలిసింది. ఈ మేరకు పాట్ కమిన్స్ అత్యవసరంగా ఆస్ట్రేలియాకు బయల్దేరాడు. ఈ అంశంలో క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి సవివరణ ప్రకటన రావాల్సి ఉంది. న్యూఢిల్లీ టెస్టుకు ఇండోర్ టెస్టు మ్యాచ్‌కు 9 రోజుల విరామం వచ్చింది. దీంతో పాట్ కమిన్స్ మార్చి 1కి ముందే తిరిగి భారత్‌లో కంగారూ శిబిరంలో చేరతాడనే అంచనా ఉంది. పాట్ కమిన్స్ మూడో టెస్టు సమయానికి రాలేకపోతే..మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ నాయకత్వం వహించే అవకాశం కనిపిస్తోంది. ఇక ఓపెనర్ డెవిడ్ వార్నర్ పరిస్థితిపై ఇంకా తేలాల్సి ఉంది. అతడు ఫిట్‌నెస్ సాధించకపోతే ట్రావిశ్ హెడ్ ఇండోర్ టెస్టులో ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. పాట్ కమిన్స్, జోశ్ హాజెల్‌వుడ్ ప్రభావం జట్టుపై పెద్దగా ఉండే అవకాశం లేదు. జోశ్ హాజెల్‌వుడ్ జట్టుతో పాటు ఉన్నప్పటికీ ఫిట్‌నెస్ సమస్యతో తొలి రెండు టెస్టులకు దూరమయ్యాడు. నాగ్‌పూర్‌లో స్కాట్ బొలాండ్ తుది జట్టులో నిలువగా.. న్యూఢిల్లీలో మూడో స్పిన్నర్‌కు చోటు కల్పించారు. నాల్గో టెస్టుకు కామెరూన్ గ్రీన్ తుది జట్టులో చోటు సాధించేందుకు వీలుంది. పాట్ కమిన్స్ ఆస్ట్రేలియాకు వెళ్లినా.. జట్టుతో టచ్‌లోనే ఉంటాడని, నిర్ణయాల్లో భాగస్వామ్యం అవుతాడని ఆసీస్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తెలిపారు.

ఫతే మైదాన్ క్లబ్‌లో మెంబర్‌షిప్ లొల్లి?

- శాట్స్ చైర్మెన్, ఎండీని సంప్రదించని వైనం
- ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏకపక్ష నిర్ణయాలు

నవతెలంగాణ-హైదరాబాద్

చారిత్రక ఫతే మైదాన్ క్లబ్ (ఎఫ్ఎంసీ)లో ప్రస్తుతం కొత్త మెంబర్‌షిప్ వ్యవహారం చర్చనీయాంశమైంది. ఫిబ్రవరి 4న సమావేశమైన ఎఫ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ నూతనంగా120 మందికి సభ్యత్వాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. అయితే, ప్రస్తుతం ఉన్న సభ్యులు రూ.4 లక్షల సభ్యత్వ రుసుముతో మెంబర్‌షిప్ పొందగా.. కొత్తగా ఇవ్వనున్న 120 సభ్యత్వాలకు రూ.2 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. నూతన సభ్యత్వాల రుసుముపై జనరల్ బాడీ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ కమిటీలో సూచనలు చేసినా.. బేఖాతరు చేస్తూ ఏకపక్షంగా ముందుకెళు న్నారు. నూతన సభ్యత్వాలకు రూ.2 లక్షల ఫీజునే ఎలా వసూలు చేస్తారని ప్రస్తుత సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఓటింగ్ హక్కుతో కూడిన సభ్యత్వాన్ని చౌకగా సన్నిహితులకు కట్టబెట్టేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సభ్యులు విమర్శిస్తున్నా రు. శాట్స్ చైర్మెన్‌కు ఫిర్యాదు : ఫతే మైదాన్ క్లబ్ ఏకపక్ష నిర్ణయాలపై కొందరు సభ్యులు శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఎఫ్ఎంసీ, శాట్స్ (శాప్) ఎంఓయూ ప్రకారం కీలక నిర్ణయాలను శాట్స్ చైర్మెన్, వీసీ-ఎండీ అనుమతితో తీసుకోవాల్సి ఉంది. ఈ మేరకు క్లబ్ 1969 నిబంధనల్లో స్పష్టంగా ఉంది. సభ్యత్వ నమోదు, రుసుము అంశంలో ఎఫ్ఎంసీ నిర్ణయాలపై తక్షణే జోక్యం చేసుకోవాలని శాట్స్ చైర్మెన్‌ను కొందరు సభ్యులు కోరినట్టు సమాచారం.

24, 25న బాడీ బిల్డింగ్ టోర్నీ



హైదరాబాద్ : ఫిబ్రవరి 24, 25న 'ది స్టీల్ మ్యాన్ క్లాసిక్' బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ సోమాజిగూడలో జరుగనుంది. రెండు రోజుల పాటు జరిగే టోర్నీలో దక్షిణాది రాష్ట్రాల నుంచి 200 మంది బాడీ బిల్డర్లు పోటీపడతారని నిర్వాహకులు మిస్టర్ ఇండియా శివ కుమార్, మిస్టర్ వరల్డ్ శ్రీరాహుల్ తెలిపారు. జూనియర్, సీనియర్, క్లాసిక్ ఈవెంట్లలో ఐదు విభాగాల్లో పోటీలు ఉంటాయి. విజేతలకు రూ. 5 లక్షల నగదు బహుమతి ఇవ్వనున్నారు. జాతీయ స్థాయి న్యాయ నిర్ణేతలు పోటీల్లో విజేతలను ఎంపిక చేస్తారని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బాడీ బిల్డర్లకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేవారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా.. ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై దృష్టి సారించేలా ప్రోత్సహించేందుకు ఈ టోర్నీ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



జాతీయ వాటర్ పోలో పోటీలు షురూ

ప్రారంభించిన శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్

హైదరాబాద్ : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) అందిస్తున్న ప్రోత్సాహంతో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ నగరం కేంద్రంగా మారిందని శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. ఇటీవల జరిగిన ఎఫ్ఐఏ ఫార్ములా-ఈ రేసు అందుకు నిదర్శమని చెప్పారు. గచ్చిబౌలి స్టేడియంలోని ఆక్వాటిక్ కాంప్లెక్స్‌లో సోమవారం జాతీయ వాటర్ పోలో పోటీలను ప్రారంభించిన ఆంజనేయ గౌడ్.. రాష్ట్రంలో క్రీడా వాతావరణం నెలకొంది, శాట్స్ సహకారంతో అనేక టోర్నీలు జరుగుతున్నాయని అన్నారు. తొలి రోజు పోటీల్లో ఆర్మీ రెడ్, కోల్‌కత స్పోర్ట్స్ అసోసియేషన్, అమరావతి, నేవి క్లబ్స్ విజయాలు సాధించాయి.

హృదయాలను కదిలించే పాటలు..



వేణు ఎల్దండి, దిల్‌రాజు

దిల్‌రాజు ప్రొడక్షన్స్ శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తున్న సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. వేణు ఎల్దండి దర్శకుడు. త్వరలోనే ఈ సినిమాను రిలీజ్ చేయటానికి నిర్మాత దిల్ రాజు ప్లాన్ చేస్తున్నారు.

సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో సినిమాలోని పాత్రలను పరిచయం చేశారు.

ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, "ఈ సినిమా షూటింగ్ పూర్తయ్యింది. త్వరలోనే రిలీజ్ డేట్ ఎనౌన్స్ చేస్తాం. ఇప్పటికే విడుదలైన 'ఊరు పల్లెటూరు..' సాంగ్, 'పొట్టి పిల్ల' సాంగ్‌కు సూపర్బ్ రెస్పాన్స్ వస్తున్నాయి. సినిమా ఆర్గానిక్‌గా ఆడియెన్స్‌లోకి వెళ్లిపోయింది. వేణు తన ఐడియాను ప్రాపర్‌గా మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్‌కి చెప్పటం, అలాగే దానికి అద్భుతమైన లిరిక్స్‌ని కాసర్ల శ్యామ్ అందించారు. మంచి సోల్ ఉన్న సాంగ్స్‌ను అందించారు. మరో రెండు సాంగ్స్‌ను త్వరలోనే రిలీజ్ చేస్తాం. ఆ పాటలు వింటే హృదయాలు కదిలిపోతాయి. అంత గొప్పగా ఉంటాయి పాటలు. రిలీజ్ తర్వాత సినిమా పెద్ద హిట్ అవుతుందని భావిస్తున్నాం' అని తెలిపారు.

'దర్శకుడిగా అవకాశం ఇచ్చిన దిల్ రాజుకి థ్యాంక్స్. త్వరలోనే ఈ సినిమాను మీ ముందుకు తీసుకువస్తున్నాం. ఈ సినిమాలో నారాయణ పాత్రలో మురళీధర్, హీరో మేనత్త పాత్రలో విజయ లక్ష్మి హీరో తల్లి పాత్రలో స్వరూప, హీరో బాబాయ్ పాత్రలో మొగిలి ఇలా అందరూ దాదాపు కొత్త వారినే పరిచయం చేశాం. ఇక ఇప్పటికే మా మూవీ నుంచి విడుదలైన రెండు సాంగ్స్‌కు భీమ్స్ ఇచ్చిన సాంగ్స్, దానికి కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ ఎక్సలెంట్. పాటలన్నీ శ్యామ్‌గారే రాశారు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన అందరికీ థ్యాంక్స్. ఓ మంచి సినిమా చేశామనే తృప్తి ఉంది' అని దర్శకుడు వేణు ఎల్దండి చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆచార్య వేణు, కథ విస్తరణ - స్క్రీన్ ప్లే: రమేష్ ఎలిగేటి - నాగరాజు మడూరి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: మధు, పాటలు: శ్యామ్ కాసర్ల, మాటలు: వేణు ఎల్దండి, రమేష్ ఎలిగేటి - నాగరాజు మడూరి, ప్రొడక్షన్ డిజైన్: రమణ వంక

జంతువు లాంటి మనిషి కోసం వేట



'పులి మేక' ఒరిజినల్ సిరీస్ ఫస్ట్‌లుక్

ఇండియాలోనే వన్ ఆఫ్ ది బెస్ట్ ఓటీటీల్లో ఒకటైన జీ 5లో ఈనెల 24న 'పులి మేక' ఒరిజినల్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ ఒరిజినల్ కోసం జీ 5 కోన ఫిల్మ్ కార్పొరేషన్‌తో జాయిన్ అయ్యింది. లావణ్య త్రిపాఠి, ఆది సాయి కుమార్, సిరి హన్మంత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సోమవారం ఈ ఒరిజినల్ ట్రైలర్‌ను డైరెక్టర్ బాబీ, హీరో సిద్ధు జొన్నలగడ్డ రిలీజ్ చేశారు.

"చావు చెప్పిరాదు, వచ్చినప్పుడు తప్పించుకోవడం సాధ్యం కాదు అంటూ మొదలవుతుంది పులిమేక ట్రైలర్. ఆ మర్డర్ చేసింది, ఈ మర్డర్ చేసింది ఒక్కరే సార్ అని చెబుతూ ప్రభాకర్ శర్మ క్యారెక్టర్‌లో పరిచయమవుతారు ఆది. పోలీస్ అఫిషియల్‌గా కనిపిస్తారు సుమన్. ఆయన మాటలను బట్టి ఒక సైకో పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని టార్గెట్ చేశాడని అర్థమవుతుంది. ఈ కేసును డీల్ చేయడం కోసం అపాయింట్ అవుతుంది ఐపీఎస్ ఆఫీసర్ కిరణ్ ప్రభ క్యారెక్టర్‌లో లావణ్య. సీరియస్ లుక్స్‌లో, ఖాకీ యూనిఫార్మ్‌కి గట్టిగా న్యాయం చేశారు ఆమె. ఈ ఛేజింగ్‌లో ఆమెకు సాయం చేస్తాడు ప్రభ. ఈ కథలో పులి ఎవరో తెలియాలి అంటూ జరిగే ఇన్వెస్టిగేషన్ ఆడియన్స్‌ని ఎంగేజ్ చేస్తుంది. జంతువులాంటి మనిషి కోసం కిరణ్ ప్రభ అండ్ ప్రభాకర్ టీమ్ చేసే ప్రయత్నం ఫలించిందా?, లాక్‌డౌన్‌లో ప్రభాకర్ చూసిన సీరీస్‌ల వల్ల కేసుకు ఏమైనా హెల్ప్ జరిగిందా?' వంటి వివరాలు మరింత ఆసక్తిని క్రియేట్ చేస్తున్నాయి. నైట్ ఎఫెక్ట్‌లో కనిపించే దృశ్యాలు, ఎంగేజింగ్‌గా అనిపించిన రీరికార్డింగ్ ఈ సీరీస్‌కి హైలైట్. కోన వెంకట్, వెంకటేష్ కిళారు కథ, చక్రవర్తి రెడ్డి డైరక్షన్, రమేష్ కె మహేష్ కెమెరా, ప్రవీణ్ లక్కరాజు సంగీతం సీరీస్‌కి హైలైట్ అవుతాయి.



తారకరత్నకు కన్నీటి వీడ్కోలు

ముగిసిన అంత్యక్రియలు

నందమూరి కుటుంబ సభ్యులు, నందమూరి అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖుల కన్నీటి వీడ్కోలుతో కథానాయకుడు తారకరత్న అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముగిశాయి.

'యువగళం' పాత్ర యాత్రలో పాల్గొన్న తారకరత్న తీవ్ర గుండెపోటుకి గురై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ 23 రోజులు మృత్యువుతో పోరాడారు. అయినప్పటికీ ఆయన కన్నుమూయడం అందరినీ కలిచివేస్తోంది.

సోమవారం ఉదయం ప్రజలు, సీని, రాజకీయ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం తారకరత్న భౌతిక కాయాన్ని ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్‌ఛాంబర్‌కి తరలించారు. అనంతరం వైకుంఠ రథంలో ఆయన పార్థివ దేహాన్ని జూబ్లీహిల్స్‌ని మహాప్రస్థానానికి తీసుకెళ్ళారు.

ఈ వైకుంఠరథంలో చంద్రబాబునాయుడు, బాలకృష్ణతోపాటు పలువురు కుటుంబ సభ్యులున్నారు. తారకరత్నకు కడసారి వీడ్కోలు పలికేందుకు వేలాది మంది ప్రజలు తరలి వచ్చారు. మహాప్రస్థానానికి చేరిన అనంతరం తారకరత్న భౌతికకాయాన్ని బాలకృష్ణ సహా నందమూరి కుటుంబ సభ్యులందరూ మోశారు.





నవచిత్రం

కళాతపస్వికి కళాంజలి



చిరంజీవి

'మన సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లి మనందరినీ గర్వపడేలా చేసిన దిగ్దర్శకుడు కె.విశ్వనాథ్' అని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ప్రముఖ దర్శకుడు కె.విశ్వనాథ్ జయంతిని పురస్కరించుకుని 'కళాతపస్వికి కళాంజలి' పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నాకు అత్యంత ఇష్టమైన వ్యక్తిగా నా మనసులో స్థానం ఎప్పటికీ పదిలం. ఈ వేదిక విశ్వనాథ్‌గారి సంతాప స్థలంలా ఉండకూడదు. ఓ సంబరంలా ఉండాలి. ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకోవాలి అని మేమంతా అనుకున్నాం. దర్శకులు కాశీ విశ్వనాథ్, వీఎన్ ఆదిత్య, ఏడిద రాజా, పీపుల్ మీడియా సంస్థ, టి.సుబ్బిరామిరెడ్డి తదితరుల సహకారంతో ఇది సాధ్యమైంది. ఈ విధంగా విశ్వనాథ్‌గారి ఆత్మ శాంతిస్తుందని విశ్వసిస్తున్నా. ఆయన్ని నేను మూడు కోణాల్లో చూస్తుంటా. నాకు మూడు సినిమాల్లో అవకాశం ఇచ్చిన దర్శకుడిగా, అనుక్షణం నా నటనను సరిదిద్దిన గురువుగా, ఆయన చూపించిన ప్రేమ విషయంలో తండ్రిగా భావిస్తుంటా. నటుడిగా నిలదొక్కుకుంటున్న సమయంలో 'శుభలేఖ సినిమా చేసే అవకాశం ఇచ్చారు. వైజాగ్‌లో మొదటిరోజు షూటింగ్‌లో ఉండగా నా దగ్గరకు వచ్చి 'నిన్ను ఎవరైనా తరుముతున్నారా?, అంత వేగంగా డైలాగ్ చెబుతున్నావు' అని అన్నారు. కంగారుగా ఉంది సర్ అని చెప్పడంతో నా స్పీడ్‌ను నియంత్రించి, సరిగ్గా చెప్పేలా చేశారు. ఓసారి బెత్తంలాంటిది పట్టుకుని తిరుగుతుంటే.. ఆ స్టైల్ నచ్చి అలా డ్యాన్స్ చేస్తావా అని అడిగారు. నటుల్లోని ఒరిజినాలిటీని ఆయన చక్కగా రాబట్టుకునేవారు. నేను క్లాసికల్ డ్యాన్స్ చేయగలనని ఆయన చెప్పేంత వరకూ నాకు తెలియదు. నేను పూర్తిస్థాయిలో మాస్ యాక్షన్ చిత్రాలు చేస్తున్నప్పుడు 'స్వయంకృషి' కథ చెప్పారు. ఆయన శిక్షణతో ఆయా పాత్రల్లో ఒదిగిపోయేవాణ్ని. సున్నితంగా నటించడం ఆయన దగ్గరే నేర్చుకున్నా. మా కాంబినేషన్‌లో వచ్చిన 'ఆపద్బాంధవుడు' మరో అపురూప చిత్రం' అని చెప్పారు. ఈ వేడుకలో కె.రాఘవేంద్రరావు, ఆమని, తనికెళ్ళభరణి, రాధిక, జయసుధ, జీవిత, రాజశేఖర్, అలీ తదితరులు పాల్గొని కె.విశ్వనాథ్‌తో తమకి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

ఆ అడవిలోకి నో ఎంట్రీ



ఆండ్రియా

ఆండ్రియా జెరెమియా ఇప్పటివరకు ఫ్యామిలీ, లవ్, కామెడీ చిత్రాల్లో నటించింది. అయితే ఈసారి యాక్షన్ హీరోయిన్‌గా కనిపించనుంది. అటవీ నేపథ్యంలో రూపుదిద్దుకున్న 'నో ఎంట్రీ' చిత్రంలో ఆమె సరికొత్త పాత్రలో నటిస్తోంది. ఈ మూవీలో ఆమె ఎంతో సాహసంతో ఉన్న యాక్షన్ థ్రిల్లర్ పాత్ర చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు.

'దట్టమైన అటవీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్ళిన కొంత మంది స్నేహితులు అడవిలోని కొండ శిఖరంలో ఉన్న లగ్జరీ విల్లాలో బస చేస్తారు. ఆ ఇంటిని క్రూరమైన అడవి కుక్కలు చుట్టుముడతాయి. ఆ కుక్కల భారీనుండి వారు ఏ విధంగా తప్పించుకున్నారన్నదే' ఈ చిత్ర కథగా తెలుస్తోంది ఎంతో థ్రిల్లింగ్‌గా, రోమాలు నిక్కబొడుచుకునేలా ఇందులోని సన్నివేశాలను తెరకెక్కించినట్టు దర్శకుడు ఆర్.అళగు కార్తీక్ వెల్లడించారు. జంబో సినిమాస్ బ్యానరులో శ్రీధర్ అరుణాచలం ఈ చిత్రాన్ని నిర్మించారు. అదవ్ కణ్ణదాసన్, రన్యరావ్, మానస్, జయశ్రీ, జాన్వీ ఇతర కీలకపాత్రల్లో నటించారు. త్వరలోనే ఈ చిత్రం తెలుగు, తమిళ భాషలలో విడుదల కానుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.